




www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★★



ఎన్‌కౌంటర్‌లో మహిళా మావోయిస్టు మృతి 05

విద్యుత్ ఆర్టిజన్ కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలి 03

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి



సంపుటి 09, సంచిక: 134 | మంగళవారం | 14-04-2026 | ఖమ్మం | Published from: **Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar** | పేజీలు: 12+8 | వెల రూ. 5.00





## జనాభా ఆధారంగా జిడిపిలో రాష్ట్రాల వాటా ప్రకారం సగం

### హైబ్రిడ్ విధానంలో డీలిమిటేషన్ : కేంద్రానికి సిఎం రేవంత్‌రెడ్డి సూచన

- కొత్తగా పెంచే సీట్లలో 136 సీట్లు జిడిపి వృద్ధి ఆధారంగా మరో 136 జనాభా ప్రాతిపదికన పెంచాలి
- దేశానికి ఆదాయం ఇస్తున్న రాష్ట్రాలను గౌరవించాలి
- నియోజకవర్గాల పునర్విభజనపై అఖిలపక్షంతో పాటు అన్ని సంస్థలతో సంప్రదింపులు చేపట్టాలి
- నిపుణులతో కమిటీ ఏర్పాటు చేయాలి
- అన్ని అసెంబ్లీలలో చర్చించి పార్లమెంటులో ఆమోదించిన తర్వాతే నిర్ణయం తీసుకోవాలి

ప్రజాపక్షం/హైదరాబాద్

లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనను హైబ్రీడ్ విధానంతో చేపట్టాలని, కేంద్ర ప్రభుత్వం పెంచాలనుకుంటున్న 50 శాతం 272 సీట్లలో 136 సీట్లు ప్రొరేటా విధానం ప్రకారం, మరో 136 సీట్లు జిడిపి (స్థూల జాతీయోత్పత్తి)లో అత్యధింకంగా వాటా ఇస్తున్న రాష్ట్రలకు జిఎస్‌డిపి (రాష్ట్ర స్థూల ఉత్పత్తి) పెరుగుదల ప్రకారం పునర్విభజన చేపట్టాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నియోజకవర్గాల పునర్విభజన అంశంపై అఖిలపక్ష సమావేశంతో పాటు అన్ని సంస్థలతో సంప్రదింపులు చేపట్టాలని, నిపుణులతో ఒక కమిటీని ఏర్పాటు చేయాలని, అన్ని అసెంబ్లీలలో చర్చించి, పార్లమెంటులో ఆమోదించిన తర్వాతనే నిర్ణయం తీసుకోవాలని సిఎం కోరారు. 2028 మార్చి వరకు ఈ ప్రక్రియను పూర్తి చేయవచ్చని, ఈ బిల్లు వల్ల దక్షిణాది రాష్ట్రాలు, చిన్న రాష్ట్రాలు తీవ్రంగా నష్టపోతాయన్నారు. కేంద్రం హడావుడి చేసి దేశంలో దక్షిణ, ఉత్తరాది రాష్ట్రాల మధ్య అగాధాన్ని పెంచొద్దని సూచించారు. ఈ నెల 16 నుంచి జరిగే పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో బిజెపి ప్రభుత్వం ప్రవేశపెట్టే మహిళా బిల్లుకు కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్దతు తెలుపుతుందని, అయితే అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాల పునర్విభజన బిల్లును మాత్రం పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ సచివాలయంలో సోమవారం మంత్రులతో కలిసి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ లోక్‌సభ, అసెంబ్లీ స్థానాల పునర్విభజనపై మోదికి పలు ప్రతిపాదనలు సూచించారు. దక్షిణ భారతదేశం దేశానికి ఆదాయాన్ని, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నదని,

తరువాయి 2లో

### బిల్లును ఎలా ఆమోదిస్తారో చూస్తాం

దక్షిణాది రాష్ట్రాలతో పాటు చిన్న రాష్ట్రాలను కూడా ఐక్యం చేస్తామని, పార్లమెంట్‌లో నియోజకవర్గాల బిల్లును ఎలా ఆమోదిస్తారో చూస్తామని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. అన్ని దక్షణాది రాష్ట్రాలతో పాటు ఢిల్లీ, పంజాబ్ లాంటి చిన్న రాష్ట్రాలకు దీనిపైన లేఖ రాస్తానని తెలిపారు. తెలంగాణ ఎంపిలు తెలంగాణ రాష్ట్రాన్ని సాధించారని, ఇప్పుడు నియోజకవర్గాల పునర్విభజనపై కూడా పోరాడుతారన్నారు. సీట్ల పునర్విభజనలో పర్సంటేజీలు కాదు నెంబర్ ముఖ్యమని సిఎం అన్నారు. రాజకీయాల్లో నెంబర్ ముఖ్యమని, వాజ్‌పేయి ప్రభుత్వం ఒక్క ఓటుతో పడిపోయిందని, నెంబర్ లేకుండా రాజకీయాల్లో ఎవరూ ఎవరితోనూ చర్చలు చేయరన్నారు. యాభై శాతంతో సీట్ల పునర్విభజన జరిగితే కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లు మోదీ ఇంటి ముందు బంట్రోతులుగా నిలబడాల్సి వస్తుందని, వాళ్ల అవసరం ఇక ముందు మోదీకి ఉండదని సిఎం వ్యాఖ్యానించారు.

## హోర్ముజ్‌లో జలసంధి దిగ్బంధించిన అమెరికా

- పరస్పర హెచ్చరికల మధ్య యుద్ధ భయం–ఉత్కంఠ
- జలసంధి దాటే ఇరాన్ నౌకలను ధ్వంసం చేస్తాం: ట్రంప్
- సైనిక నౌకలొస్తే తీవ్ర పరిణామాలు : ఐఆర్‌జిసి
- గల్ఫ్ దేశాల్లో ఏ రేవుకీ భద్రత ఉండదు : ఇరాన్
- నౌకల దిగ్బంధం సముద్ర దొంగతనమే : యుసిఐఎఎఫ్
- అమెరికాకు బ్లాకేడ్ మద్దతు తిరస్కరించిన నాటో దేశాలు
- భారత్,చైనా,జపాన్ సహా పలు దేశాలకు చమురు కష్టాలు
- మళ్ళీ 100 డాలర్లు దాటిన బ్యారెల్ ధర
- గల్ఫ్ రేవులను మూసేస్తామని ఇరాన్ హెచ్చరిక



**వాషింగ్టన్:** హోర్ముజ్ జలసంధి దిగ్బంధనం (బ్లాకేడ్)పై అమెరికా సెంట్రల్ కమాండ్, ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కోర్ (ఐఆర్‌జిసి) పరస్పర హెచ్చరికలతో తీవ్ర ఉత్కంఠ పరిస్థితి నెలకుంది. మళ్ళీ యుద్ధ పరిస్థితులు నెలకొన్న భారత కాలమానం ప్రకారం సోమవారం సాయంత్రం 6.46 గంటల నుండి ట్రంప్ ఆదేశించిన విధంగా హోర్ముజ్ జలసంధిలో తమ దళాలు ఇరాన్ ఓడ రేవుల నుండి నౌకలు రాకపోకలు చేయకుండా దిగ్బంధనాన్ని అమలులోకి తెచ్చినట్లు అమెరికా సెంట్రల్ కమాండ్ అధికారికంగా రాత్రి ధృవీకరించింది. దిగ్బంధనాన్ని ఉల్లంఘించి జలసంధిని దాటే ప్రయత్నం చేసే ఇరాన్ నౌకలను ధ్వంసం చేస్తామని మరోవైపు డోనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు. శాటలైట్ ద్వారా ఈ కదలికలను గమనిస్తున్నారు. అదే సమయంలో ఐఆర్‌జిసి ఒక ప్రకటన చేస్తూ, హోర్ముజ్ జలసంధి సమీపంలోకి ఏ సైనిక నౌక వచ్చినాగానీ కాల్పుల విరమణ ఉల్లంఘనగా భావిస్తామని, చాలా తీవ్రంగా ప్రతిస్పందిస్తామని హెచ్చరించింది. అంతర్జాతీయ జలాలలో నౌకల రాకపోకలపై దిగ్బంధనం ''సముద్రపు దొంగతనం'' అవుతుందని, అమెరికా చర్య అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించడమేనని ఇరాన్ సాయుధ దళాల యూనిఫైడ్ కమాండ్ అధికార ప్రతినిధి హెచ్చరించారు. ఒకవైపు ఉద్రిక్తతలు కొనసాగుతుండగా మరోవైపు వాగ్వాదం కూడా జరుగుతోంది. ఇరాన్ తన అణుశుద్ధి, అణ్వాయుధ ఆశయాలను వదులుకోకపోవడంవల్లనే చర్చలు విఫలమయ్యాయని ట్రంప్ విమర్శించగా, అమెరికా తన లక్ష్యాలను మార్చుకోవడంవల్లనే చర్చలు విఫలమయ్యాయని ఇరాన్ విదేశీ వ్యవహారాలమంత్రి అబ్బాస్ అరాఘ్చి అన్నారు. ఒప్పందానికి కొద్ది అంగుళాల దూరంలో ఉన్న సమయంలో పరిస్థితిని తారుమారు చేసి చర్చలను కుప్పకూల్చారని ఆయన విమర్శించారు. కాగా బెదిరింపులకు ఇరాన్ లొంగిపోదని ఇరాన్ పార్లమెంటు స్పీకర్ మహ్మద్ బాఘెర్ ఘాలిబాఫ్ హెచ్చరించారు. ''ఇరాన్ నౌకా దళాన్ని తుడిచిపెట్టాం, కానీ శరవేగంగా వెళ్ళే నౌకలను ముప్పుగా పరిగణించలేదు, అందువల్ల వాటిపై దాడి చేయకుండా వదిలిపెట్టాం, కానీ ఆ ఫాస్ట్ ట్రాక్ షిప్పులు పరిధిదాటి దిగ్బంధన ప్రాంతం వైపు వస్తే వెంటనే ధ్వంసం చేస్తాం, ఇరాన్ యుద్ధ నౌకలు,పడవలు మా బ్లాకేడ్ ప్రాంతానికి దగ్గరగా వస్తే, మాదక ద్రవ్యాల ముఠాలకు చెందిన పడవలను ధ్వంసం చేసేందుకు మేం ఉపయోగించే శక్తిమంతమైన వ్యవస్థలను ఉపయోగించి తక్షణం వాటిని తునాతునకలుగా పేల్చేస్తాం'' అని సోషల్ మీడియా వేదికగా ట్రంప్ ప్రకటించారు. ఈ సందర్భంలో లెబనాన్ నుండి హెజ్బొల్లా ఉత్తర ఇజ్రాయెల్‌లోకి దాడులు చేసింది. హోర్ముజ్ జలసంధి ఇప్పటికీ పూర్తిగా తమ

తరువాయి 2లో

## 15 నుంచి టెట్ దరఖాస్తులు

### జూన్ 15 నుంచి 30 వరకు పరీక్షలు

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టిజిటెట్ 2026) దరఖాస్తులను ఈ నెల 15వ తేదీ నుంచి 30వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో స్వీకరించనున్నారు. ఈ మేరకు విద్యా శాఖ డైరక్టర్ డాక్టర్ ఈ.నవీన్ నికోలస్ సోమవారం నోటిఫికేషన్‌ను జారీ చేశారు. జూన్ 9వ తేదీ నుంచి టెట్ హాల్ టికెట్లు జారీ చేయనున్నారు. జూన్ 15వ తేదీ నుంచి 30వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో పరీక్షలు నిర్వహించగా, జూలై 28వ తేదీ నుంచి 31వ తేదీ లోపు టెట్ ఫలితాలు విడుదల చేస్తారు. కాగా ఏడాదికి రెండు సార్లు (జూన్, డిసెంబర్) టెట్ నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగనే ఈ సారి జూన్‌లో పరీక్షలు నిర్వహించనుంది.




### అమెరికా-భారత్ ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం

## తక్షణమే రద్దు

### ముక్తకంఠంతో డిమాండ్ చేసిన సంయుక్త కిసాన్ మోర్చా నేతలు

- ఒప్పందం కొనసాగిస్తే వ్యవసాయ ఉత్పత్తుల ధరలు క్షీణించి రైతుల జీవితాలు చీకటి మయమవుతాయని అందోళన
- ఒప్పందం రద్దు చేసేంత వరకూ మరో రైతు మహోద్యమాన్ని చేపడతామని కేంద్రానిక హెచ్చరిక
- ఇందిరాపార్కు ధర్నా చౌక్ వద్ద ఎస్‌కెఎం ధర్నా

ప్రజాపక్షం/హైదరాబాద్

విదేశీ, స్వదేశీ కార్పొరేట్ కంపెనీలకు లాభం చేకూర్చడమే లక్ష్యంగా చేసుకున్న అమెరికా–భారత్ ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాన్ని తక్షణమే రద్దు చేయాలని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) నేతలు ముక్తకంఠంతో డిమాండ్ చేశారు. ఈ ఒప్పందం ఇదేవిధంగా కొనసాగిస్తే దేశ వ్యాప్తంగా వ్యవసాయ ఉత్పత్తుల ధరలు క్షీణించి అన్నదాతల జీవితాలు పూర్తిగా చీకటిమయం కానున్నాయని వారు పేర్కొన్నారు. ఈ ఒప్పందం రద్దు చేసేంత వరకు అవసరమైతే మరో రైతు మహోద్యమాన్ని చేపడుతామని కేంద్ర ప్రభుత్వాన్ని

తరువాయి 2లో

## కనీస వేతనాలు అమలు చేయాలి

- నోయిడాలో రోడ్డెక్కిన కార్మికులు
- హింసాత్మకంగా మారిన నిరసనలు
- వాహనాలకు నిప్పు, ఆస్తులు ధ్వంసం
- నిరసనలతో స్తంభించిన ట్రాఫిక్



**నోయిడా/ న్యూఢిల్లీ :** వేతనాల పెంపు కోసం ఫ్యాక్టరీ కార్మికులు చేపట్టిన నిరసనలు హింసాత్మకంగా మారింది. సోమవారం నోయిడాలోని ఫేజ్ 2, సెక్టార్ 60 ప్రాంతాలలో వాహనాలకు నిప్పు పెట్టడం, ఆస్తులను ధ్వంసం చేయడం, రాళ్ల దాడి వంటి ఘటనలు నమోదయ్యాయని పోలీసులు తెలిపారు. ఈ నిరసనల కారణంగా ట్రాఫిక్ స్తంభించిపోయింది. ఉదయం రద్దీ సమయంలో ఢిల్లీకి వెళ్లే వివిధ రహదారులపై వేలాది మంది ప్రయాణికులు చిక్కుకుపోయారు. ఢిల్లీ–నోయిడా సరిహద్దు వద్ద అనేక కిలోమీటర్ల మేర వాహనాలు బారులు తీరాయి. అధికారుల ప్రకారం, వివిధ పారిశ్రామిక యూనిట్లకు చెందిన పెద్ద సంఖ్యలో కార్మికులు తమ చిరకాల

తరువాయి 12లో




## దోస్త్ నోటిఫికేషన్ విడుదల

- ఈ నెల15 నుంచి మే 7 వరకు మొదటి దశ రిజిస్ట్రేషన్
- రాష్ట్ర వ్యాప్తంగా మూడు దశల్లో డిగ్రీ సీట్ల రిజిస్ట్రేషన్ల ప్రక్రియ

ప్రజాపక్షం/హైదరాబాద్

డిగ్రీ ఆన్‌లైన్ సేవలు తెలంగాణ (దోస్త్ 2026) మొదటి దశ రిజిస్ట్రేషన్ పక్రియ ఈ నెల15వ తేదీ నుంచి మే 7వ తేదీ వరకు జరగనుంది. మొత్తం మూడు దశలలో రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో డిగ్రీ కోర్సులలో రిజిస్ట్రేషన్ల పక్రియ కొనసాగనుంది. జూలై 1వ తేదీ నుంచి డిగ్రీ మొదటి సెమిస్టర్ తరగతులు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు తెలంగాణ ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి 'దోస్త్' నోటిఫికేషన్‌ను సోమవారం విడుదల చేశారు. ఏప్రిల్ 30 నుంచి మే 8 వరకు వెబ్ ఆప్షన్లు ఉంటాయి. మే 14న తొలి విడత సీట్ల కేటాయింపు ఉంటుంది. మే15 నుంచి మే 23వ తేదీ లోపు విద్యార్థులు ఆన్‌లైన్ సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుంది. రెండవ

తరువాయి 2లో




## కెసిఆర్‌కు సీతక్క లీగల్ నోటీసు

### 48గంటల్లో నిరాధార పోస్టును తొలిగించాలని డిమాండ్

ప్రజాపక్షం/హైదరాబాద్

అంగన్‌వాడీ మొబైల్ ఫోన్ల కొనుగోలు విషయంలో నిరాధార ఆరోపణలు చేస్తూ తన ప్రతిష్టను దెబ్బతీసే విధంగా బిఆర్‌ఎస్ సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపిస్తూ బిఆర్‌ఎస్ అధ్యక్షుడు

తరువాయి 12లో

## టిజిఎస్ ఆర్‌టిసిలో 22 నుంచి సమ్మె

- విలీనం సహా 32 డిమాండ్లు పరిష్కరించాలి
- కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలి
- టిఎస్ ఆర్‌టిసి జెఎసి చైర్మన్ ఈదురు వెంకన్న

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టిఎస్ ఆర్‌టిసి)లో సమ్మె సైరన్ మోగింది. తమ డిమాండ్‌ల పరిష్కారంపై ప్రభుత్వం, యాజమాన్యం నుంచి ఆశించిన స్పంద న రాకపోవడంతో ఈనెల 22వ తేదీ (ఏప్రిల్ 21 అర్ధరాత్రి మొదటి డ్యూటీ నుం చి) సమ్మెకు వెళ్తున్నట్లు ఆర్‌టిసి జెఎసి చైర్మన్ ఈదురు వెంకన్న ప్రకటించారు. తాము కొత్త కోరికలేవీ కోరడం లేదని, ఎన్నికల మేనిఫెస్టోలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలనే అమలు చేయమని అడుగుతున్నామని తెలిపారు. హైదరాబాద్ ఆర్‌టిసి క్రాస్ రోడ్స్‌లోని కార్మిక శాఖ కమిషనర్ కార్యాలయంలో కార్మిక శాఖ కమిషనర్‌తో సో మవారం జెఎసి చైర్మన్ ఈదురు వెంకన్న, వైస్ చైర్మన్ థామస్ రెడ్డి, కోకన్వీనర్‌లు కత్తుల యాద య్య, మౌలాన, యాదగిరి తదితర ప్రతినిధులు చర్చలు జరిపారు. ఆర్‌టిసి యాజమాన్యం ఎవ రూ రాకపోవడం గమనర్హం. దీంతో కార్మిక శాఖ కమిషనర్‌తో జెఎసి ప్రతినిధులు జరిపిన చర్చలు విఫలమాయ్యాయి.



చర్చల అనంతరం ఈదురు వెంకన్న మాట్లాడుతూ గత నెల 13న సమ్మె నోటీ సు ఇచ్చినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం, యాజమా న్యం నుంచి చర్చలకు పిలవకపోవడాన్ని ఈదు రు వెంకన్న తప్పుబట్టారు. యాజమాన్యమే కార్మికులను సమ్మె చేసేలా ప్రోత్సహిస్తున్నట్లు ఉందని ఆయన మండిపడ్డారు. ప్రభుత్వం నుంచి స్పందన రాకపోవడంతో

తరువాయి 2లో



## 20న జగిత్యాలలో కెసిఆర్ సభ

ప్రజాపక్షం/జగిత్యాల

జగిత్యాల నుంచే కాంగ్రెస్ ప్రభుత్వ పతనానికి నాంది పలుకుతామని మాజీ మంత్రి జీవన్ రెడ్డి ఆరోపించారు. జగిత్యాల జిల్లా కేంద్రంలో ఈ నెల 20న నిర్వహించనున్న కెసిఆర్ బహిరంగ సభ సన్నాహక సమావేశాన్ని విజయవంతం చేయాలని

తరువాయి 12లో

## చరిత్రలో మొట్టమొదటిసారి ఆస్ట్రేలియా ఆర్మీకి మహిళా నాయకత్వం



**కాన్‌బెర్రా:** ఆస్ట్రేలియా చరిత్రలో మొదటిసారి ఒక మహిళకు సైనిక బలగాల నాయకత్వాన్ని అప్పగించారు. లెఫ్టినెంట్ జనరల్ సూసన్ కోయిల్ రాబోయే జులై నెలలో ఆస్ట్రేలియా సాయుధ బలగాల ప్రధానాధిపతిగా బాధ్యతలు స్వీకరిస్తారు. దేశ రక్షణ దళాల నాయకత్వంలో జరుగుతున్న పునర్వ్యవస్థీకరణ చర్యల్లో భాగంగా ఈ మార్పు జరిగింది. ప్రధానమంత్రి ఆంటోనీ ఆల్బెనీస్, రక్షణమంత్రి రిచర్డ్ మార్లెస్ ఆమెకు అభినందనలు తెలియజేశారు. దీనిని ఒక చారిత్రక ఘట్టంగా పేర్కొన్నారు. 125 సంవత్సరాల ఆస్ట్రేలియా సైనిక చరిత్రలో ఒక మహిళ సర్వసైన్యాధిపతి బాధ్యతలు చేపట్టడం ఇదే మొదటిసారి. సూసన్ కోయిల్ ప్రస్తుతం జాయింట్ క్యాపబిలిటీస్ ప్రధానాధిపతిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. 2022లో సైనిక దళాల ప్రధానాధిపతిగా బాధ్యతలు చేపట్టిన సైమన్ స్టువర్ట్ పదవీకాలం మరో మూడు నెలల్లో జులైతో ముగుస్తుంది. కొత్త నాయకురాలు కోయిల్ నాలుగు దశాబ్దాలుగా సైనిక బలగాల్లో పనిచేస్తూ వివిధ హోదాల్లో బాధ్యతలు నిర్వహిస్తూ వచ్చారు. పలు ఉన్నతస్థాయి కమాండ్ పదవులు నిర్వహించిన కోయిల్ అఫ్గానిస్థాన్,పశ్చిమాసియాలలో అనేక కార్యకలాపాల్లో పాల్గొన్నారు. ఆస్ట్రేలియా సైన్యంలో మహిళా అధికారులు,మహిళా సైన్యం సంఖ్య పెంచాలని ప్రభుత్వం భావిస్తున్న తరుణంలో ఆమె నియామకం జరిగింది. వ్యవస్థాగతంగా సైన్యంలో వివక్ష, లైంగిక వేధింపుల ఆరోపణలు కొనసాగుతున్నాయి.

# లెబనాన్‌లో 160 మంది హెజ్బొల్లా ఫైటర్స్ మృతి



### మిలిటరీ స్థావరాలపై ఐడిఎఫ్ దాడులు
### రెడ్‌క్రాస్ కార్యాలయాలపై డ్రోన్లు

**సనా:** లెబనాన్‌లో ఇజ్రాయెల్ దాడులు ఆగకుండా కొనసాగుతున్నాయి. 160 మంది హెజ్బొల్లా ఫైటర్స్‌ను హతమార్చినట్లు ఇజ్రాయెల్ సైన్యం ప్రకటించింది. గడచిన శుక్రవారం నుండి జరిగిన దాడులలోవీరు మరణించారు. దీనిపై హెజ్బొల్లా వెంటనే స్పందించలేదు. దక్షిణ లెబనాన్‌లోని మొరౌబ్ పట్టణంలో ఐ.డి.ఎఫ్ సైనికులు చేసిన దాడుల్లో నలగురు మరణించారు. అంతకుముందు పదిమంది దాడుల్లో మరణించారు. లెబనాన్‌లో గడచిన 40 రోజులుగా జరుగుతున్న యుద్ధంలో మృతులసంఖ్య 2,055కి చేరింది. వేలసంఖ్యలో ప్రజలు గాయపడ్డారు. అనేక భవంతులు నేలమట్టమయ్యాయి. పిల్లలు,స్త్రీలు, అమాయకులు మరణిస్తున్నారు. వ్యూహాత్మకమైన బింట్ జెబైల్ పట్టణంలో ఇజ్రాయెల్ దళాలు భూతల దాడులు చేస్తూ హెజ్బొల్లా మిలిటరీ మౌలిక సదుపాయాలను చుట్టుముట్టామని, ఈ దాడుల్లో 100 మంది హెజ్బొల్లా ఫైటర్లు మరణించారని ఐడిఎఫ్ ప్రకటించింది. పట్టణ శివార్లలో ఐదుసార్లు ఐడిఎఫ్‌పై దాడులు చేసినట్లు ముందురోజు ఆదివారం హెజ్బొల్లా ప్రకటించింది. అదేవిధంగా టైర్‌లోని లెబనాన్ రెడ్‌క్రాస్ కార్యాలయాలపై కూడా సోమవారం డ్రోన్ దాడులు జరిగాయి. ఈ దాడుల్లో ఒకరు మరణించారు. వాహనాలు ధ్వంసమయ్యాయి. కాగా బెయిట్ యాహౌన్‌లో ఆదివారం దాడుల్లో మరణించిన రెడ్‌క్రాస్ వాలంటీర్‌కు సోమవారం అంత్యక్రియలు నిర్వహించారు. ఇరాన్ ప్రతిపాదించిన పది అంశాల ప్రణాళికను అంగీకరించి ఏప్రిల్ ఎనిమిదో తేదీన ట్రంప్ కాల్పుల విరమణకు అంగీకరించిన వెంటనే భారీస్థాయిలో లెబనాన్‌పై దాడులు చేసి వందలమందిని ఇజ్రాయెల్ హతమార్చింది. దీంతో ఇరాన్,హెజ్బొల్లా, ఐక్యరాజ్యసమితి సహా ప్రపంచ దేశాలు ఈ చర్యను ఖండించాయి. దీని వల్ల వాషింగ్టన్‌లో చర్చలకు కూడా విఘాతం కలిగింది. ఈ నేపథ్యంలో హెజ్బొల్లాను నిరాయుధులను చేసి నిర్మూలించే వరకూ తమ యుద్ధం ఆగదని ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజిమన్ నెతన్యాహూ సోమవారం మరోసారి స్పష్టం చేశారు. ఇదే తరుణంలో ఇజ్రాయెల్–లెబనాన్ మధ్య వాషింగ్టన్‌లో నిర్ణీత ప్రకారం తలపెట్టిన మంగళవారంనాటి చర్చలను హెజ్బొల్లా తిరస్కరించింది. ఈ చర్చల ఆలోచనను తీవ్రంగా విమర్శించింది.

**'మొస్సాద్' అధిపతిగా గోఫ్‌మన్:** ఇజ్రాయెల్ విదేశీ గూఢచారి సంస్థ ''మొస్సాద్'' అధిపతిగా రోమన్ గోఫ్‌మన్ (50) ను నెతన్యాహూ నియమించారు. గూఢచారి రంగంలో ఎలాంటి అనుభవంలేని ఒక వసైనిక అధికారిని తీసుకువచ్చి మొస్సాద్ అధిపతిగా నియమించడం ఒక అసాధారణ నిర్ణయంగా మారింది. ఐతే కరడుగట్టిన జియోనిస్టు భావజాలం నింపుకున్న గోఫ్‌మన్ నెతన్యాహూ జాతీయవాద భావాలకు అనుగుణంగా ప్రవర్తిస్తారు. సైనిక కార్యకలాపాలకు అనుగుణంగా సమన్వయం చేసుకుంటూ గూఢచారి కార్యకలాపాలు చేయడ, వివిధ కీలక ఏజన్సీలను సమీకృతం చేయడం, ప్రాంతీయ దేశాలలో ఇజ్రాయెల్ చురకైన పాత్రకు ఊతాన్ని ఇవ్వడం గోఫ్‌మన్ ప్రధాన లక్ష్యాలు.

ప్రస్తుత మొస్సాద్ అధిపతి డేవిడ్ బార్నియా ఐదేళ్ళ పదవీకాలం ముగిసిన తర్వాత జూన్ రెండో తేదీన గోఫ్‌మన్ కొత్త బాధ్యతలు తీసుకుంటారు. పొరుగుదేశాలలో ఉన్న ఇరాన్ అనుబంధ ఉగ్రవాదసంస్థల నాయకులను అంతం చేయడంలో మొస్సా ద్ ఆరితేరిన కళలు ప్రదర్శిస్తూవస్తోంది. ఐతే ఈ సంస్థ కు అమెరికా అంతరిక్ష ఉపగ్రహాల ద్వారా కూడా సహాయ సహకారాలు అందుతున్నట్లు ఇప్పటికే వార్తలు వె లువడ్డాయి. బెలారస్‌లో జన్మించిన గోఫ్‌మన్ 14 ఏళ్ళ వయసులో ఇజ్రాయెల్‌కు వలస వెళ్ళి అక్కడి సైన్యంలో చేరారు.

# 22 నుంచి సమ్మె

(మొదటి పేజీ తరువాయి)

గత్యంతరం లేని పరిస్థితిలో సమ్మెలోకి వెళ్లాల్సి వస్తుందని తెలిపారు. ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీనం చేయడం సహా మొత్తం 32 డిమాండ్‌లను ప్రభుత్వం ముందు ఉంచామని, వాటిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్మిక సంఘాలకు ఎన్నికలు నిర్వహించడం, ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా జీతభత్యాలు కల్పించడం వంటి అంశాలు తమ ప్రధాన డిమాండ్‌లని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి పలు సమస్యలను ప్రస్తావించినప్పటికీ పట్టించుకోలేదని ఆయన విమర్శించారు. సమ్మె నోటీసు ఇచ్చి నెల రోజులు గడిచినా స్పందన లేకపోవడం బాధాకరమన్నారు.

ఆర్‌టిసి యాజమాన్యం కూడా కార్మికుల సమస్యలు పరిష్కరించాలనే ఆసక్తి చూపడం లేదన్నారు. ఆర్‌టిసి విలీనం, యూనియన్ ఎన్నికల కోసం కమిటీని వేశామని మంత్రి చెబుతున్నారని, అయితే ఆ కమిటీకి ఛైర్మన్, సభ్యులు ఎవరో తెలియజేస్తూ ఉత్తర్వులను బహిర్గతం చేయాలని ఈదురు వెంకన్న డిమాండ్ చేశారు.

ఏప్రిల్ 22 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలు చేపట్టనున్నట్లు తెలిపారు. జెఎసి వెనుక 39500 మంది కార్మికులు ఉన్నారని చెప్పారు. తమ అడుగుజాడల్లోనే అందరూ నడుస్తారన్నారు. అన్ని కేటగిరీల ఖాళీలను భర్తీ చేయాలని, కార్మికులను వారి పని స్థానాల్లోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఏప్రిల్ 21 అర్ధరాత్రి తర్వాత మొదటి డ్యూటీ నుంచి సమ్మె ప్రారంభమవుతుందని ఈదురు వెంకన్న స్పషం చేశారు. తమ చేపట్టే సమ్మెకు ప్రజలు, ప్రతిపక్ష పార్టీలు, ప్రజా సంఘాలు మద్దతు తెలపాలని కోరారు. థామస్ రెడ్డి మాట్లాడుతూ ఆర్‌టిసి కార్మికుల పట్ల ప్రభుత్వం వ్యహరిస్తున్న విధానాలను ఖండించారు. కార్మికుల న్యాయమైన హక్కులు సాధించుకునేందుకు ప్రభుత్వంతో చావో రేవో తెల్చుకుంటామని హెచ్చరించారు. దశలవారిగా ఆర్‌టిసిని ప్రైవేటికరించడంలో భాగంగా ఈవి బస్సులను ప్రవేశపెడుతున్నారని, బస్సు భవన్‌ను సెల్ ట్యాక్స్ శాఖకు కేటాయించిందని, దాన్ని తాము అడ్డుకున్నామని తెలిపారు.

సంస్థను ప్రభుత్వంలో విలీనం, ట్రేడ్‌యూనియన్‌ల పునరుద్ధరణ అంశాలు ప్రభుత్వ పరిధిలో ఉన్నాయని యాజమాన్యం తప్పించుకుందన్నారు. సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం కనీస శ్రద్ధను చూపడం లేదని విమర్శించారు. విధిలేని పరిస్థితుల్లో సమ్మెలోకి వెళ్లుతున్నామని, ఈ సమ్మెకు ప్రజలు, ప్రతిపక్ష పార్టీలు, ప్రజాసంఘాలు మద్దతు ఇవ్వాలని కోరా రు.

**ప్రేరేపిత సమ్మెలకు వెళ్ళవద్దు : మంత్రి పొన్నం**

ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీనం చేసే అంశం కమిటీ వద్ద ఉందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. రెండు సమస్యల మినహా మిగతా అంశాలపై చర్చించడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపా రు. సిబ్బందికి సంబధించిన అంశాలు పరిష్కరిస్తామని, ప్రేరేపిత సమ్మెలకు వెళ్ళవద్దని సూచించారు. ఇప్పటికే పెండింగ్ డిఎ ఇచ్చామని, పిఆర్‌సిపై ఆలోచన చేస్తున్నామని మంత్రి వెల్లడించారు.

# ఒప్పందం తక్షణమే రద్దు

(మొదటి పేజీ తరువాయి)

హెచ్చరించారు. అమెరికా భారత్ వాణిజ్య ఒప్పందాలను రద్దు చేయాలని, కేంద్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్‌కెఎం ఆధ్వర్యంలో సోమవారం ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద ధర్నా నిర్వహించా రు. ఎస్‌కెఎం నాయకులు కె.సూర్యనారాయణ, సుదర్శన్, దేవారా మ్, కోటేశ్వరరావు,ఇంద్రసేనా, తుకారామ్ నాయక్, సనప పొమ్మయ్య, సదా నందం అధ్యక్షత వహించారు.

ధర్నాను ఉద్దేశించి ఎస్‌కెఎం రాష్ట్ర కన్వీనర్, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పశ్యపద్మ ప్రసంగిస్తూ వ్యవసాయ ఆధారితమైన ఈ దేశ జనాభాలో (50 శాతం మంది) సుమారు 14 కోట్ల రైతు కుటుంబాలు వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్న నేపథ్యంలో 2023 ఫిబ్రవరి 10వ తేదీన కేంద్ర ప్రభుత్వం అమెరికాతో ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోవడం రైతాంగానికి తీవ్రమైన ముప్పుగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో మనదేశం నుంచి అమెరికా లాంటి విదేశాలకు వ్యవసాయ ఉత్పత్తులను ఎగుమతి చేస్తే 30 శాతం నుంచి 150 శాతం మేరకు సుంకాలు ఉండేవని, ఈ ఒప్పందంతో మొత్తం ఎత్తివేశారన్నారు. దీంతో రైతులు పండిస్తున్న వరి, గోధుమ, మొక్కజొన్న, పత్తి, సోయాబీన్, పసుపు మిర్చి, నూనె గింజలతో సహా అన్ని రకాల పంటకు కనీస మద్దతు ధర కూడా రాని పరిస్థితి ఏర్పడిందన్నారు. దీంతో దేశ రైతాంగమంతా తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయే పరిస్థితి వచ్చిందని ఆమె పేర్కొన్నారు.

ఈ నేపథ్యంలో రైతుల జీవితాలతో చెలగాటమాడే ఒప్పందాలను చేసుకునే హక్కును కేంద్ర ప్రభుత్వానికి ఎవరు ఇచ్చారని ప్రశ్నించారు. ఇప్పటికే నూతన వ్యవసాయ మార్కెట్ విధానాలు, విత్తన, విద్యుత్ సంస్కరణల పేరుతో రైతులను మరింత కష్టాల్లోకి నెట్టే ప్రయత్నం జరుగుతుండగా మరోవైపు ఈ ఒప్పందం రైతులకు మరింత గుదిబండగా మారునుందని, దీనిని రద్దు చేసేవరకు రైతాంగం విశ్రమించబోదని పశ్యపద్మ పేర్కొన్నారు. ఎస్‌కెఎం రాష్ట్ర కన్వీనర్ టి.సాగర్ మాట్లాడుతూ భారత్, అమెరికా మధ్య జరిగిన ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందానికి ముందు 2024 జనవరి నవంబర్ మధ్య 190.30 మిలియన్ డాలర్ల విలువైన పత్తి దిగుమతి కాగా, 2025 అదే కాలంలో ఇది 377.90 మిలియన్ డాలర్లకు పెరిగిందన్నారు. దీంతో గతంలో పత్తి రైతులు క్వింటాల్ పత్తిని మద్దతు ధరకు మించి రూ.10వేలకు పైగా అమ్మగా, ఒప్పందం కారణంగా దిగుమతులు పెరగడం కనీస మద్దతు ధర కనీస మద్దతు ధర రూ.7710 నుంచి రూ.8110 ఉండగా ధర మాత్రం రూ.5 వేలకు పడిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.

ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాన్ని రద్దు చేయడంతో స్వామినాథన్ కమిటీ సిఫారసుల ప్రకారం (సి2+50 శాతం) పాటు మద్దతు ధరల చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. బి.రాము, బిక్షపతి, జంకుల వెంకటయ్య, ఎన్‌రెడ్డి హంసారెడ్డి, బి.వెంకటేశ్వర్లు, వి.నాగిరెడ్డి, ఎ.సాయన్నలు మాట్లాడుతూ అధునిక వ్యవసాయంలో పూర్తిగా వెనకబడి ఉన్న మన దేశాన్ని ఈ ఒప్పందం ఏవిధంగాను న్యాయం చేయదని పేర్కొన్నారు. భారతదేశంలో మన దేశంలో 86 శాతం మంది చిన్న, సన్నకారు రైతులు ఉండగా సగటు భూమి పరిమాణం 2.67 ఎకరాలు మాత్రమేనని, అదే అమెరికాలో అది సుమారు 469 ఎకరాలన్నారు. అమెరికాలో కేవలం 18.65 లక్షల మంది మాత్రమే వ్యవసాయం చేస్తుండగా, భారత్‌లో 14 కోట్ల కుటుంబాలు వ్యవసాయంపై ఆధారపడి ఉన్నారని, అక్కడ ఒక్కో రైతుకు సుమారు రూ.21 లక్షల వరకు సబ్సిడీలు లభిస్తుంటే, భారతదేశంలో కేవలం రూ.6000 మాత్రమేనని వారు వివరించారు. రైతు బతికితేనే దేశం బతుకుతుందని, ఈ ఒప్పందాన్ని రద్దు చేయాల్సిందేనని వారు డిమాండ్ చేశారు.

# దోస్త్ నోటిఫికేషన్ విడుదల

(మొదటి పేజీ తరువాయి)

దశ రిజిస్ట్రేషన్లు మే 15 నుంచి 25 వరకు, మూడో దశ రిజిస్ట్రేషన్లు మే 31 నుండి జూన్ 15వరకు ఉండనున్నట్లు తెలంగాణ ఉన్నత విద్యా మండలి వెల్లడించింది. మరిన్ని వివరాల కోసం https://dos t.cgg .gov.in వెబ్ సైట్‌లో చూడాలని తెలంగాణ ఉన్నత విద్యా మండలి సూచించింది.

**ఉపాధి ఆధారిత కొత్త కోర్సులు : ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి**

డిగ్రీలో ప్రవేశాల పట్ల ఆసక్తి పెంచేందుకు ఉపాధి ఆధారిత కొత్త కోర్సులను ఈ ఏడాది నుంచి ప్రవేశపెడుతున్నామని తెలంగాణ ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి తెలిపారు. ప్రస్తుతం దోస్త్ లో కొత్త కోర్సులను కూడా చేరుస్తున్నామని, ఈ కోర్సు లు 52 కళాశాలలో అందుబాటులో ఉన్నాయని, మరో 69 కళాశాలలో పాత కోర్సుల స్థానంలో కొత్త కోర్సులను మార్చుకున్నారని ఆయన వివరించారు. ఎక్కడ ఉద్యోగాలు ఉంటాయో, ఏ రంగాల్లో ఖాళీలు ఉన్నాయో వాటికి సంబంధించిన కోర్సులను నూతనంగా అందిస్తున్నామన్నారు.

గత ఏడాది దోస్త్ లో 969 కాలేజీల్లో 4,40,107 సీట్లు ఉండగా, అందులో 2,05,140 సీట్లు,రెసిడెన్షియల్ డిగ్రీ కాలేజీల్లో 23 వేల సీట్లకు గాను 11,387 సీట్లు భర్తీ అయ్యాయని ఆయన వివరించారు. గత ఏడాది 54 కళాశాలలో జీరో అడ్మిషన్లు వచ్చాయని, ఫీజు రీయంబర్స్ మెంట్ తో పాటు పలు విషయాలను ఇప్పటికే తాము ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. ఈ సమావేశంలో ఉన్నత విద్యా మండలి వైస్ ఛైర్మన్ ప్రొఫెసర్ ఇటిక్యాల పురుషోత్తం, కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరామ్ వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

**దోస్త్ నోటిఫికేషన్**

**'దోస్త్' మొదటి దశ రిజిస్ట్రేషన్** (ఫీజు రూ.200లు)ఏప్రిల్ 15 నుంచి మే 7 వరకు.
వెబ్‌ఆప్షన్స్ ఏప్రిల్ 30 నుంచి
మే 8 వరకు..
సీట్ల కేటాయింపు మే 14న ఆన్‌లైన్ సెల్ఫ్ రిపోర్టింగ్‌మే 15 నుంచి 23 వరకు
**రెండవ దశ రిజిస్ట్రేషన్** (ఫీజు రూ.400లు)
మే 15 నుంచి 25 వరకు..
వెబ్ ఆప్షన్స్ మే 15 నుంచి మే 26 వరకు..
సీట్ల కేటాయింపు
మే 30న ఆన్‌లైన్ సెల్ఫ్ రిపోర్టింగ్
మే 31 నుంచి జూన్ 5 వతేదీ వరకు
......
**మూడవ దశ రిజిస్ట్రేషన్**
మే 31 నుంచి జూన్ 15 వరకు
వెబ్ ఆప్షన్
మే 31 నుంచి జూన్ 16 వరకు
సీట్ల కేటాయింపు జూన్ 20 వరకు
ఆన్‌లైన్ రిపోర్టింగ్
జూన్ 20 నుంచి జూన్ 25 వరకు
(మొదటి, రెండవ, మూడవ దశలో సీట్లు పొంది న విద్యార్థులు జూన్ 20 నుంచి 27 వరకు రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుంది)
'సెమిస్టర్1' తరగతులు ప్రారంభం
జూలై 1వ తేదీ నుంచి ప్రారంభం.

# వాటా ప్రకారం సగం

(మొదటి పేజీ తరువాయి)

అలాంటి రాష్ట్రాలను ఎలా శిక్షిస్తారని సిఎం ప్రశ్నించారు. విద్య, ఉద్యోగ అవకాశాల్లో యాభై శాతం రిజర్వేషన్లు, 50 శాతం మెరిట్‌తో చేయాలని ఇదివరకే సుప్రీంకోర్టు స్పష్టం చేసిందని, అందుకే రిజర్వేషన్లు 50 శాతానికి మించలేదని గుర్తు చేశారు. స్థూల ఉత్పత్తిలో అత్యధికంగా భాగస్వామ్యమైన రాష్ట్రాలకు అవకాశం కల్పించాలని, ఈశాన్య రాష్ట్రాల్లో, కేంద్ర పాలిత ప్రాంతాల్లో జనాభా ప్రాతిపాదికన సీట్లు లేవని, వంద శాతం జనాభా ప్రాతిపదికన సీట్ల పెంపు జరగలేదని, ప్రాతినిధ్యం కోసమే ఈశాన్య రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఎంపి సీట్లు ఇచ్చారని రేవంత్ రెడ్డి వివరించారు.

**దక్షిణాది ద్వితీయ శ్రేణి రాష్ట్రాలుగా మార్చడానికి ప్రయత్నాలు**

దక్షిణాది రాష్ట్రాలను రాజకీయంగా ద్వితీయ శ్రేణి రాష్ట్రాలుగా మార్చడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని, చిన్న రాష్ట్రాలకు కూడా సమస్య ఉండబోతుందని, ఢిల్లీ, పంజాబ్ వంటి రాష్ట్రాలు రాజకీయ మనుగడను కోల్పోతాయమని సిఎం ఆందోళన వ్యక్తం చేశారు. జనాభా ప్రతిపాదికన 50 శాతం సీట్ల పెంపు అంశం దక్షిణాది రాష్ట్రాలతో పాటు చిన్న రాష్ట్రాలకు తీరని విఘాతమని విమర్శించారు. ఏ ప్రాతిపదకన సీట్లు పెంచాలో మొదట చర్చించాలన్నారు. రాజకీయ అవసరాల కోసం 50 శాతం సీట్లు పెంపు దేశ మనుగడకు మంచిదికాదని సూచించారు. ఇది రాజకీయ పార్టీలకు సంబంధించిన అంశం కాదని, ప్రజలకు సంబంధించిందని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు, నక్సలైట్లు లాంటి సమస్యలు వివక్ష వల్లనే వచ్చాయన్నారు. వివక్షను ఇంకా పెంచడానికి బిజెపి ప్రయత్నం చేస్తోందని, మహిళా బిల్లు ముసుగులో అడ్డు పడుతున్నారని, తక్షణమే మహిళా రిజర్వేషన్ బిల్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఉన్న లోక్‌సభ, అసెంబ్లీ స్థానాల్లో మహిళా రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు.

తప్పుడు ప్రచారం చేస్తున్న కేంద్రం నియోజకవర్గాల పునర్విభజన, మహిళా బిల్లు అంశంలో కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక పార్లమెంటు సమావేశాలను నిర్వహించి హడావుడి చేస్తోందని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. కేంద్ర ప్రభుత్వం వ్యూహాత్మకంగా మహిళా రిజర్వేషన్లు, నియోజకవర్గాల పునర్విభజనను రెండింటినీ ఒకటిగా చూపించి ప్రతిపక్షాలు సహకరించడంలేదని తప్పుడు ప్రచారం చేస్తోందని సిఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ రెండు అంశాలు ఒకదానికి మరొకటి సంబం ధం లేనివని, రెండింటిని విడదీసి, వేర్వురుగా చర్చించాలని సూచించారు. రాజ్యాంగంలో పురుషులతో సమానంగా మహిళలకు ఓటు హక్కు కల్పించిందే కాంగ్రెస్ పార్టీ అని, ప్రపంచంలోని చాలా దేశాల్లో మహిళలకు ఓటు హక్కు లేదని సిఎం గుర్తు చేశారు.

**రాజకీయ పావుగా వాడుకుంటున్న ప్రధాని మోదీ**

నియోజకవర్గాల పునర్విభజనను ప్రధాని మోదీ రాజకీయ పావుగా, ప్రమాదకరంగా వాడుకుంటున్నారని సిఎం రేవంత్ రెడ్డి విమర్శించారు. పార్లమెంట్ నియోజకవర్గాలను 1967లో 520 సీట్లకు పెంచారని, 1976లో 542 సీట్లకు పెంచారని, ఆ తర్వాత సిక్కిం నుంచి ఒక సీటు పెరిగి ఆ సంఖ్య 543కు పెరిగిందని గుర్తు చేశారు. దక్షణాది రాష్ట్రాలు కుటుంబ నియంత్రణ పకడ్బందీగా అమలు చేయడం వల్ల జనాభా తగ్గిందని, ఉత్తరాదిలో కుటుంబ నియంత్రణ అమలు కాకపోవడంతో జనాభా విపరీతంగా పెరిగిందన్నారు. ఇందిరాగాంధీ ఈ విషయాన్ని గమనించే లోక్‌సభ సీట్ల ప్రకారమే నియోజకవర్గాల పునర్విభజన చేయాలని నిర్ణయించిందన్నారు. 25 ఏళ్ల వరకు సీట్ల పెంపునను ఇందిరాగాంధీ నిషేధించారన్నారు. జనాభా ప్రాతి పదికన సీట్ల పునర్విభజన జరగొద్దనే సీట్లను నియంత్రించారని, 2001లో వాజ్ పేయ్ పునర్విభజనపై చట్ట సవరణ చేశారని, తద్వారా 2009లో తెలంగాణకు 17 ఎంపి సీట్లు , ఆంధ్రాకు 25 ఎంపి సీట్లు వచ్చాయని, తెలంగాణకు 119 అసెంబ్లీ సీట్లు, ఎపికి 175 శాసనసభ సీట్లు పెరిగాయని అన్నా రు.

**జనాభా ప్రతిపాదికన సీట్లను ఒప్పుకోం:** జనాభా ప్రాతిపదికన సీట్ల పునర్విభజనకు ఒప్పుకోబోమని దక్షిణాది రాష్ట్రాలు నిరసన వ్యక్తం చేస్తూ ప్రధానికి లేఖ రాశాయన్నారు. 50 శాతం తం సీట్లు పెంచితే 20 సీట్లు ఉన్న కేరళకు, 80 సీట్లు ఉన్న యుపికి ఉన్న అంతరం ప్రస్తుతం 60 సీట్లు మాత్రమేనని, కానీ 50 శాతం పెంచితే 90 సీట్ల వరకు తేడా పెరుగుతుందని, అలాగే తెలంగాణకు, యుపికి 94 సీట్ల అంతరం పెరుగుతుందని వివరించారు.

దక్షిణాదిలో 130 సీట్లు ఉన్నాయని, 50 శాతం పెరిగితే 195 వరకు పెరుగుతాయని, కానీ ఉత్తరాదిలో 413 సీట్ల నుంచి 621 సీట్ల వరకు పెరుగుతాయని తెలిపారు. దీంతో దక్షిణాది, ఉత్తరాది మధ్య అంతరం 620 సీట్లకు పెరుగుతుందని, దీని ప్రభావం తీవ్రంగా ఉంటుందని సిఎం ఆందోళన వ్యక్తం చేశారు. ఈ లెక్కల ప్రకారం ఇక రాష్ట్రపతి నుంచి కీలకమైన ఏ పదవినైనా దక్షిణాది రాష్ట్రాలకు ఇవ్వలేరని, బలహీనులు, బలవంతుల మధ్య చర్చలు జరగబోవని, సమాన స్థాయి ఉన్న వారి మధ్య చర్చలు ఉంటాయని సిఎం అన్నారు.

**కాంగ్రెస్ పార్టీ పురుషులతో పాటు మహిళలకు సమాన అవకాశాలు కల్పించింది**

కాంగ్రెస్ పార్టీ పురుషులతో పాటు మహిళలకు సమాన అవకాశాలు కల్పించిందని సిఎం చెప్పారు. దేశ ప్రధానిగా, రాష్ట్రపతిగా, లోక్‌సభ స్పీకర్‌గా, ముఖ్యమంత్రులుగా, గవర్నర్లు గా చాలా రాజ్యాంగ బద్ధమైన పదవుల్లో మహిళలకు కాంగ్రెస్ పార్టీ అనేక అవకాశాలను కల్పించిందన్నారు. నాడు సోనియా గాంధీ నాయకత్వంలో చట్టసభల్లో మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెడితే,బిజెపి సహకరించకపోవడంతో లోక్ సభలో మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందలేదని ఆరోపించారు. 2024 లోక్ సభ ఎన్నికల్లో 543 లోక్ సభ సభ్యుల్లో 33 శాతం రిజర్వేషన్ కల్పిస్తే 181 మహిళలు ఎన్నికయ్యేందుకు అవకాశం ఉండేదన్నారు. 2023 లో మహిళా రిజర్వేషన్ బిల్లుకు కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటించిందని, 2026 తర్వాత జనాభా లెక్కల తర్వాత గెజిట్ ఆధారంగా మహిళా రిజర్వేషన్లు అమలు చేస్తామని చట్టం చేశారని గుర్తు చేశారు. 2026 జనభా లెక్కలు పూర్తి చేసి అమలు చేయకుండా 2011 జనాభా లెక్కల ఆధారంగా చట్టం ముందుకు తెస్తున్నారని, 2026 జనాభా లెక్కల ప్రకారం నిబంధనను సవరించుకుంటే 2029 లోక్ సభతో పాటు వివిధ రాష్ట్రాల జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో మహిళా రిజర్వేషన్లు అమలు చేయవచ్చన్నారు. మహిళా రిజర్వేషన్లు, పునర్విభజనను కలపడం వెనుక రాజకీయ కుట్ర ఉందన్నారు. 2026 జనాభా లెక్కల ప్రకారం మహిళా రిజర్వేషన్ల బిల్లు తీసుకొస్తే కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్దతు ఇవ్వడానికి కట్టుబడి ఉంటామని, మహిళల రాజకీయ సాధికారితకు కాంగ్రెస్ మొదటి నుంచి కట్టుబడి ఉందన్నారు.

**బిజెపి మహిళకు అవకాశం ఇచ్చిందా?**

బిజెపి ర్పడిన 46 ఏళ్లలో జాతీయ అధ్యక్షురాలిగా ఎప్పుడైనా ఒక మహిళకు అవకాశం కల్పించారా? లేదా ఇతర ముఖ్యమైన పదవులలో మహిళా నాయకురాలిని నియమించారా? అనే విషయంపై ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి బండి సంజయ్‌లను సిఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. తద్వారా బిజెపికి మహిళ పట్ల గౌరవం, చిత్తశుద్ధి ఉందో అర్థమౌతుందన్నారు. ఇందిరా గాంధీ, సోనియా గాంధీ నాయకత్వంలో అతి ఎక్కువ కాలం పనిచేసిన పార్టీ కాంగ్రెస్ మహిళలకు అన్యాయం చేస్తుందా? అని ప్రశ్నించారు. బిజెపి మహిళను అధ్యక్షురాలిగా నియమించుకున్న తర్వాత బండి సంజయ్ మాట్లాడాలన్నారు. బండి సంజయ్ వ్యాఖ్యలు దక్షణాది రాష్ట్రాల్లోని ఎస్సీ,ఎస్టీ, మహిళలకు వ్యతిరేకమైనవన్నారు. మహిళలను చిన్న చూపు చూడటమే బిజెపి లక్షణమని, ద్వితీయ శ్రేణి పౌరులుగా మహిళలను చూస్తు న్నారన్నారు. స్వాతం త్ర్యం తెచ్చింది, రాజ్యాంగాన్ని ఇచ్చింది, రిజర్వేషన్లు కల్పించింది కాంగ్రెస్ పార్టీ అని ఇప్పుడు దేశాన్ని కాపాడుకునే బాధ్యత కూడా కాంగ్రెస్‌దేనని సిఎం అన్నారు.

# దిగ్బంధించిన అమెరికా

(మొదటి పేజీ తరువాయి)

నియంత్రణలోనే ఉందని, ఈ జలసంధిని శాశ్వత ప్రాతిపదికపై నియంత్రించేందుకు వీలుగా ఖచ్చితమైన నిబంధనలను ఇరాన్ అమలు చేస్తుందని ఆయన ప్రకటించారు. తమ ఓడ రేవుల భద్రతకు, ఎగుమతులకు నష్టం కలిగితే గల్ఫ్ ప్రాంతంలో ఏ దేశంలోని ఓడరేవులకూ రక్షణ లేకుండా చేస్తామని, ప్రాంతీయంగా ఉన్న సముద్ర జలాల్లో పూర్తి స్థాయిలో రక్షణ కొరవడుతుందని ఇరాన్ హెచ్చరించిన నేపథ్యంలో ఐఆర్‌జిసి ఏ విధంగా స్పందిస్తుందో అని అంతా గమనిస్తున్నారు.హోర్ముజ్ జల సంధిలో కాల్పు ల విరమణ ఉల్లంఘన–యుద్ధ ఉద్రిక్తత పరిస్థితిపై ఉత్కంఠ కొనసాగుతోంది తప్ప ఎలాంటి దాడులూ నౌకలపై జరిగినట్లు సోమవారం రాత్రి నాటికి కడపటి వార్తలు అందలేదు.

హోర్ముజ్‌కు వచ్చిన శత్రు మూకలు తమ ట్రాప్‌లో చిక్కుకుపోతారని, తమ జోలికి వస్తే ఎవరికీ భద్రతలేకుండా చేస్తామని స్పష్టం చేసింది. కాగా ఇరాన్‌కు సుంకాలు చెల్లించి హోర్ముజ్‌ను దాటి వెళ్ళే నౌకలను వెతికి వెతికి అడ్డుకోవాలని ఆమెరికా సైనిక బలగాలకు ట్రంప్ సోమవారం ఆదేశం జారీ చేయడంతో ప్రపంచవ్యాప్తంగా మళ్ళీ చమురు సమస్య అతి ప్రధానాంశంగా అజెండాలోకి వచ్చింది. అత్యధికంగా 120 డాలర్లు (బ్యారెల్)కు చేరిన చమురు ధర, ఇస్లామాబాద్ చర్చల ప్రకటనతో ఏప్రిల్ 8వ తేదీ నుండీ 95 డాలర్లకు దిగి వచ్చింది. కానీ చర్చలు విఫలం కావడంతో చమురు ధరలు మళ్ళీ ఒక్కసారిగా 100 డాలర్లకు పైగా పెరిగింది. ఇతర దేశాల నౌకల జోలికి వెళ్ళబోమని, ఇరాన్ ఓడ రేవుల నుండి వెళ్ళే నౌకలను, వారికి సుంకాలు చెల్లించి వెళ్ళే నౌకలను లక్ష్యంగా చేసుకుంటామని అమెరికా సెంట్రల్ కమాండ్ ప్రకటించినప్పటికీ చమురు ధరలు భారీగా పెరిగాయి.

ఇదిలా ఉండగా, బ్లాకేడ్‌కు సహకరించేందుకు ట్రంప్‌కు మద్దతు ఇచ్చేందుకు నాటో మిత్రదేశాలు తిరస్కరించాయి.బ్రిటన్ సహా పలు దేశాలు ఈ బ్లాకేడ్‌లో పాల్గొంటాయని చర్చలు విఫలమైన తర్వాత ట్రంప్ ప్రకటించారు. కానీ ఈ బ్లాకేడ్‌కు సహకరించేదిలేదని బ్రిటన్ ప్రధానమంత్రి కీవ్ స్టార్‌మర్ పార్లమెంటు సమావేశంలో చెప్పారు .అమెరికా కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఆయన స్వాగతిస్తూ, ఇందులో లెబనాన్‌ను కూడా చేర్చాలని కోరా రు. ఈ వారం చివరిలో దజన్లకొద్దీ దేశాలు ఒక శిఖరాగ్ర సమావేశం నిర్వహిస్తాయ చెప్పారు. కాగా అమెరికా దిగ్బంధనాన్ని ఎదుర్కొనేందుకు నౌకలు సిద్ధంగా ఉండాలని బ్రిటన్ మారిటైమ్ ట్రేడ్ ఆపరేషన్స్ (యుకెఎంటిఒ) హెచ్చరించింది. ఇరాన్ చమురు ఎగుమతులకు అవకాశం లేకుండా నౌకలను దిగ్బంధనం చేయడం ద్వారా ఆ దేశ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీసేందుకు ట్రంప్ వ్యూహం పన్నారు. ప్రధానంగా ఇరాన్ చమురు ఖర్గ్ ద్వీపంలోని నిల్వ కేంద్రం ద్వారా జరుగుతుంది. తొలుత ఇరాన్ ప్రకటించిన వ్యూహాన్నే ట్రంప్ కాపీక్యాట్ చేశారు. అమెరికా,ఇజ్రాయెల్ శత్రుదేశాల నౌకలు తప్ప అన్ని దేశాల నౌకలకూ హోర్ముజ్ నుండి అనుమతులు ఉంటాయని మొదటి నుండీ ఐఆర్‌జిసి ప్రకటిస్తూ వచ్చింది. ట్రంప్ బ్లాకేడ్ విధానం ద్వారా ఇరాన్ చమురు ఆదాయాన్ని, తద్వారా దాని ఆర్థిక వ్యవస్థను దెబ్బ తీయాలని ఆలోచిస్తున్నారు.దీనివల్ల ప్రధానంగా భారత్,చైనా, జపాన్,దక్షిణ కొరియా దేశాల చమురు ఎగుమతులు స్తంభించిపోతాయి. భారత్ కూడా ఇరాన్ చమురు కొనుగోలు చేస్తోంది. 2019 తర్వాత మొదటిసారి కొద్ది రోజుల క్రితమే ఇరాన్ నుండి చమురు భారత్‌కు వచ్చింది. ఇప్పటికే 15 భారత్ నౌకలు హోర్ముజ్ వద్ద స్తంభించిపోయాయని వార్తలు వెలువడ్డాయి. ఈ దేశాల అవసరాలలో 50 శాతం చమురు హోర్ముజ్ ద్వారా రవాణా జరుగుతూ ఉంటుంది. ఐతే చైనా ఇప్పటికే బొగ్గు, ఇ–బైక్‌లు, స్వయంసమృద్ధి వంటి ప్రత్యామ్నాయ విధానాల ద్వారా చాలా స్థిరంగా ఆర్థిక వ్యవస్థను కొనసాగిస్తుండగా, గ్లోబల్ సౌత్ దేశాలు పాకిస్థాన్, బంగ్లాదేశ్,నేపాల్,శ్రీలంక, వియ త్నాం,సహా అనేక ఆఫ్రికా దేశాలు, చమురు దిగుమతులపై ప్రధానంగా బతికే దేశాలు ఇప్పటికే ప్రభుత్వ రవాణా వ్యవస్థలను స్తంభింపజేసి అనేక ప్రతాయమ్నాయ విధానాలు అమలు చేస్తున్నాయి. దీంతో ఈ దేశాలలో తీవ్ర సంక్షోభ పరిస్థితులు తలెత్తుతాయి. హోర్ముజ్ మూసి ఉన్నా, తెరచి ఉన్నా అమెరికాకు పెద్దగా ఒరిగేదీ ఏమీ లేదని, హోర్ముజ్ ద్వారా వచ్చే చమురు అమెరికాకు చాలా స్వల్పమని ట్రంప్ ఇప్పటికే ప్రకటించారు. కానీ గల్ఫ్‌లో అమెరికా మిత్రదేశాలైన సౌదీ అరేబియా,యునైటెడ్ అరబ్ ఎమి రేట్స్, కువైట్,ఖతార్ దేశాల చము రు ఎగుమతులకు కూడా తీవ్ర సమస్యలు ఎదురవుతాయి.

**కొనసాగుతున్న పరిష్కార యత్నాలు పాక్ ప్రధానమంత్రి షరీఫ్**

అమెరికా–ఇరాన్ మధ్య యుద్ధ పరిష్కార ప్రయత్నాలు కొనసాగుతున్నాయని పాకిస్థాన్ ప్రధాన మంత్రి షెహబాజ్ షరీఫ్ సోమవారం రాత్రి ప్రకటించారు.''యుద్ధ విరమణ ఇప్పటికీ కొనసాగుతోంది, వాస్తవానికి ఏప్రిల్ 22వ తేదీ వరకూ వైరి పక్షాలు కాల్పుల విరమణకు అంగీకరించాయి, నేను మాట్లాడుతున్న సమయానికి, మిగిలిన సమస్యల పరిష్కారానికి మరోవైపు నుండి ప్రయత్నాలు కొనసాగుతున్నాయి'' అని షరీఫ్ తన మంత్రివర్గ సభ్యులతో చెప్పారని ఎ.ఎఫ్.పి వార్తాసంస్థ పేర్కొంది. కేవలం రెండు మూడు సమస్యలపైన తప్ప అన్ని అంశాలమీదా ఒప్పందం కుదిరిందని ట్రంప్ కూడా చర్చల అనంతరం సోషల్ మీడియా పోస్టింగ్ ద్వారా ప్రకటించారు. అణు శుద్ధి కార్యక్రమాన్నిపూర్తిగా వదులుకోవాలని, ఆ మేరకు తమకు స్పష్టమైన హామీ ఉండాలని అమెరికా ప్రతినిధి బృందం చర్చల్లో కోరింది. తమపై విశ్వసనీయత పెంచుకునే బాధ్యత అమెరికాదే అని ఇరాన్ చెబుతున్నది. తమ దేశ ఇంధన అవసరాలు,శాంతియుత ప్రయోజనాల నిమిత్తం అణుశుద్ధి చేసే హక్కు తమకు ఉందని స్పష్టం చేసింది. ఇస్లాం మతం అణ్వాయుధానికి వ్యతిరేకమని ఇరాన్ మొదటినుండీ చెబుతున్నది. కానీ ఆలస్యం లేకుండా హోర్ముజ్‌ను తెరవాలని, శుద్ధి చేసిన 400 కేజీల యురేనియంను తమకు స్వాధీనం చేయాలని అమెరికా కోరుతున్నది. ఆరువారాలుగా సాగిన యుద్ధంలో ధ్వంసమైన దేశాన్ని పునర్నిర్మించేందుకు నష్టపరిహారం ఇవ్వాలని ఇరాన్ కోరుతున్నది. స్తంభించిన 27 బిలియన్ డాలర్ల ఆస్తులను తిరిగి ఇవ్వాలని, ఆంక్షలు ఎత్తివేయాలని ఇరాన్ కోరుతున్నది. వీటిమధ్య లెబనాన్‌లో హెజ్బొల్లాపై దాడులు ఆపాలని ఇరాన్ చేసిన డిమాండ్‌కూడా ఇంతవరకూ ఒక కొలిక్కి రాలేదు.

**అమెరికాతో విభేదాలు లేవు దిగ్బంధనానికి మద్దతు:నెతన్యాహూ**

హోర్ముజ్ జలసంధి నుండి బయటకు వచ్చే, లోపలకు వెళ్ళే రాకపోకల నౌకలన్నింటినీ దిగ్బంధనం చేస్తామన్న ట్రంప్ నిర్ణయానికి ఇజ్రాయెల్ మద్దతు ఇస్తుందని ఆ దేశ ప్రధానమంత్రి బెంజిమన్ నెతన్యాహూ చెప్పారు.సోమవారం సాయంత్రం మంత్రివర్గ సమావేశాన్ని ఆయన ప్రారంభిస్తూ, హోర్ముజ్ విషయంలో అమెరికా–ఇజ్రాయెల్ సమన్వయంతో పనిచేస్తున్నాయన్నారు. ఇస్లామాబాద్‌లో చర్చలపై అమెరికా–ఇజ్రాయెల్ మధ్య ఎలాంటి విభేదాలు లేవని, ఇవన్నీ పూర్తిఅవాస్తవాలని స్పష్టం చేశారు. ''మేం నిరంతర సమన్వయంతో వ్యవహరిస్తున్నాం,

అధ్యక్షుడితోపాటు వారి బృందంతో మేం రోజువారీ జరిపే చర్చల్లో పాల్గొనేవారికి ఎవరికైనా ఈ విషయం తెలుస్తుంది'' అని నెతన్యాహూ చెప్పారు. ''అమెరికాతో ఈ స్థాయి సమన్వయం మునుపు ఎన్నడూలేదు, ఇజ్రాయెల్ చరిత్రలో ఎన్నడూలేదు, యూదు ప్రజల చరిత్రలో లేదు'' అని ఉద్ఘాటించారు. ''ఇరాన్–అమెరికా మధ్య కాల్పుల విరమణ ఒప్పందం ఏ క్షణంలోనైనా మారిపోవచ్చు'' అని కూడా ఆయన అన్నారు.

ఇస్లామాబాద్‌లో చర్చల తర్వాత తిరిగి వస్తుండగా అమెరికా ఉపాధ్యక్షుడు జె.డి.వాన్స్ తనకు చర్చల వివరాలన్నీ తెలియజేశారన్నారు. కాల్పుల విరమణ ఒప్పంద ఉల్లంఘనను అమెరికన్లు సహించలేరు, వారు వెంటనే హోర్ముజ్ జలసంధిని తెరవాలి, కాల్పుల విరమణ పాటించాలి, కానీ దీనిని చేయలేదు, దీనిని అమెరికన్లు సహించరు అన్నారు.

## మహిళా బిల్లులో బిసి మహిళలకు రిజర్వేషన్ కల్పించకపోవడం దారుణం

ప్రధాని మోదీకి లేఖ రాసిన రాష్ట్ర బిసి కమిషన్ చైర్మన్ జి.నిరంజన్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మహిళా రిజర్వేషన్ ఒక చారిత్రాత్మక ముందడుగు అని, ఎస్‌సి, ఎస్‌టి మహిళలకు రిజర్వేషన్ అవకాశం కల్పిస్తూ జనాభాలో ప్రధాన భాగమైన బిసి మహిళలకు రిజర్వేషన్ కల్పించకపోవడం, వారిని విస్మరించడం ఆందోళన కలిగిస్తున్న అంశమని రాష్ట్ర బిసి కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ పేర్కొన్నారు. మహిళా బిల్లుతో పాటు దేశంలో జనగణనలో అనుసరిస్తున్న విధానాల ద్వారా బిసిలకు, బిసి మహిళలకు అన్యాయం జరగకుండా చూడాలని సోమవారం ప్రధాని మోదీకి రాష్ట్ర బిసి కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ లేఖ ద్వారా విజ్ఞప్తి చేశారు. అలాగే రానున్న పార్లమెంట్ సమావేశాల్లో ఈ మేరకు కృషి చేయాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ నాయకురాలు సోనియాగాంధీ, రాజ్యసభ, లోక్‌సభ ప్రతిపక్ష నాయకులు మల్లికార్జున్ ఖర్గే, రాహుల్‌గాంధీలకు కూడా వేర్వేరుగా లేఖలు రాసినట్లు ఒక ప్రకటనలో తెలిపారు.
తెలంగాణ రాష్ట్రంలోని బిసి జాబితాలో 130 బిసి కులాలుండగా, కేంద్ర ఓబిసి జాబితాలో కేవలం 90 కులాలు మాత్రమే చేర్చబడ్డాయని, మిగతా 40 కులాలు కేంద్ర జాబితాలో చేర్చబడనందున, వివిధ కులాల వారు కేంద్ర ప్రభుత్వ విద్యా, ఉపాధి అవకాశాల్లో రిజర్వేషన్లు పొందలేకపోతున్నారన్నారు. కాబట్టి 2027 జనగణన ప్రారంభానికి ముందే ఈ 40 కులాలు కేంద్రం ఓబిసి జాబితాలో చేర్చే విధంగా పార్లమెంట్‌లో సవరణ తీసుకురావాలని, లేకుంటే జనగణన సమయంలో ఈ 40 కులాల వారిని గణనలోకి తీసుకోనందున తెలంగాణ బిసిల సంఖ్య తక్కువగా చూపే ప్రమాదం ఉందని జి.నిరంజన్ తెలిపారు.

## విద్యుత్ ఆర్టిజన్ కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలి


సిఎం రేవంత్‌కు ఎంఎల్‌సి సత్యం లేఖ



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** విద్యుత్ ఆర్టిజన్ కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలి సిపిఐ ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఎంఎల్‌సి సత్యం ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. రాష్ట్రంలోని టిఎస్‌ట్రాన్స్‌కో, టిఎస్‌జెన్‌కో, టిజిఎస్‌పిడిసిఎల్, టిజిఎన్‌పిడిసిఎల్ విద్యుత్ సంస్థల్లో గత 25 నుంచి 30 ఏళ్లుగా అహర్నిశలు శ్రమిస్తున్న ఆర్టిజన్ కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న మొండి వైఖరిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఈనెల 8వ తేదీ నుంచి ఆర్టిజన్ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నామన్నారు. గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం 2017లో కార్మికులను క్రమబద్ధీకరిస్తామని హామీ ఇచ్చి, ప్రమోషన్లు, సెలవులు ఇవ్వకుండా మోసం చేసిందని, సంస్థలోని రెగ్యులర్ ఉద్యోగులకు వర్తించే 'ఎపిఎస్‌ఇబి రూల్స్' కాకుండా, ఆర్టిజన్ల కోసం ప్రత్యేకంగా 2020లో కొత్త సర్వీసు రూల్స్ తెచ్చి వారిపై రుద్దడం అన్యాయమన్నారు. త్రాగునీరు, లైటింగ్ వంటి కనీస సదుపాయాలు కూడా లేని సబ్ స్టేషన్లలో, తీవ్రమైన సిబ్బంది కొరతతో ప్రాణాలకు తెగించి పనిచేస్తున్న కార్మికుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి విద్యార్హతను బట్టి ఆర్టిజన్ కార్మికులందరికీ (జూనియర్ లైన్‌మెన్, జూనియర్ అసిస్టెంట్, సబ్ ఇంజనీర్ తదితర) కన్వర్షన్ చేయాలని, సంస్థలో పనిచేస్తున్న అందరికీ ఎలాంటి వివక్ష లేకుండా 'ఎపిఎస్‌ఇబి రూల్స్' అమలు చేయాలన్నారు. టిజిఎస్‌పిడిసిఎల్ తరహాలో టిజిఎన్‌పిడిసిఎల్ పరిధిలోని ఆన్ మ్యాన్‌డ్ వర్కర్స్‌ను, 2016 నుండి చిన్న చిన్న అభ్యంతరాలతో పక్కనపెట్టిన కార్మికులను సంస్థలో విలీనం చేసుకోవాలని, పీస్ రేట్ వర్కర్స్ (బిల్ రీడర్స్, బిల్ కలెక్టర్స్, హమాలీ తదితర) అందరికీ కనీస వేతన చట్టం అమలు చేయడంతో పాటు కార్మికులందరికీ ప్రతి నాలుగేళ్లకు ఒకసారి ఇచ్చే 'పిఆర్‌సి 2026'ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సామాన్య ప్రజలు ఇబ్బందులు పడకముందే, సిఎం రేవంత్‌రెడ్డి తక్షణమే జోక్యం చేసుకుని కార్మిక సంఘాలతో చర్చించి ప్రధాన డిమాండ్లను పరిష్కరించడం ద్వారా 20 వేల కార్మిక కుటుంబాలకు న్యాయం చేయాలని నెల్లికంటి సత్యం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

సిఎం రేవంత్‌రెడ్డికి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు విజ్ఞప్తి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** టిజిఎస్ ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీనం చేయడంతో పాటు గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సిఎం రేవంత్‌రెడ్డికి ఆదివారం లేఖ రాశారు. తమ డిమాండ్లను నేరవేర్చాలని సుదీర్ఘ కాలంగా ఆర్‌టిసి కార్మికులు అనేక రూపాల్లో ఉద్యమాలు నిర్వహించడంతో పాటు పలుసార్లు వినతి పత్రాలు సైతం సమర్పించారని, అయినప్పటికీ ప్రభుత్వం ఇప్పటి వరకు స్పందించకపోవడం భావ్యం కాదని సాంబశివరావు పేర్కొన్నారు. ఆర్‌టిసి కార్మికుల న్యాయబద్ధమైన ప్రధాన డిమాండ్‌లను పరిష్కరించడం ద్వారా ఆర్‌టిసి కార్మికులు నిరవధిక సమ్మెకు వెళ్లకుండా ప్రభుత్వం చొరవ తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం ఇచ్చిన హామీల మేరకు ఆర్‌టిసి ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయడం, రెండు వేతన సవరణల అమలు, ట్రేడ్ యూనియన్లపై ఆంక్షలు ఎత్తివేసి గుర్తింపు సంఘ ఎన్నికల నిర్వహించడం, కార్మికులకు ఉద్యోగ భద్రత, ప్రయాణీకుల సౌకర్యం కోసం కొత్త బస్సులు కొనుగోలు చేసి సంస్థను విస్తరించాలన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో ఇప్పటివరకు ఏ ఒక్క హామీ కూడా అమలు కాకపోవడంతో ఆర్‌టిసి కార్మికులు తీవ్ర ఆందోళనలో ఉన్నారన్నారు. మరో వైపు ఆర్‌టిసిలో కొత్తగా ఎలక్ట్రిక్ బస్సుల పేరుతో అద్దె వాహనాలను తీసుకొస్తున్నారని, ఈ బస్సుల్లో పనిచేస్తున్న డ్రైవర్లకు ఆర్‌టిసికి సంబంధం లేక పోగా, ఈ బస్సులపై ప్రభుత్వం ఇస్తున్న సబ్సిడీ ప్రైవేట్ వ్యక్తుల జేబులోకి వెళ్లుతోందన్నారు. ఈ నేపథ్యంలో ఎలక్ట్రిక్ బస్సులు ప్రభుత్వం తీసుకుని ఆర్‌టిసికి ఇవ్వడం వల్ల సంస్థకు ఆదాయం సమకూరడమే కాకుండా ప్రజారవాణా వ్యవస్థ మరింత విస్తరించడంతో ఆర్‌టిసిలో ప్రైవేట్ గుత్తాధిపత్యం కూడా తగ్గుతుందని వెల్లడించారు. గత 11 ఏళ్లుగా ఆర్‌టిసిలో నియామకాలు లేకపోవడంతో పని భారాన్ని ఉన్న ఉద్యోగులే భరించాల్సివస్తుందని, దీంతో కార్మికులు తీవ్ర అనారోగ్యాలకు గురతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పిఎఫ్‌కు సంబంధించి ఉద్యోగస్థుల నుంచి వసూలు చేసిన సుమారు రూ.1200 కోట్లను యాజమాన్యం రీజనల్ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్‌కు పంపకపోవడం వల్ల చాలా మంది ఉద్యోగులకు హయ్యర్ పెన్షన్లు గత ఐదేళ్లుగా విడుదల కాలేదని లేఖ ద్వారా సిఎం దృష్టికి తీసుకువచ్చారు. కార్మికుల సమస్యలను పరిష్కరించి సమ్మెను నివారించే విధంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకోవాలని సాంబశివరావు లేఖ ద్వారా విజ్ఞప్తి చేశారు.

## ప్రమాదాల నివారణ, ప్రాణ నష్టం ఉండొద్దనే అరైవ్‌‌–అలైవ్ లక్ష్యం

రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రోడ్డు ప్రమాదం జరిగినపుడు గంట (గోల్డెన్ అవర్)లోపు ఆసుపత్రిలో చేర్చితే రాహవీర్ అవార్డ్ ఇస్తామని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించారు. ప్రమాదాల నివారణ, ప్రాణ నష్టం లేకుండా చూడటమే 'అరైవ్ అలైవ్' కార్యక్రమ లక్ష్యమన్నారు. ఖైరతాబాద్ రవాణా శాఖ కార్యాలయంలో సోమవారం 'ప్రజా పాలన–ప్రగతి ప్రణాళిక'లో భాగంగా అరైవ్‌అలైవ్ కార్యక్రమాలకు సంబంధించిన పోస్టర్‌ను మంత్రి పొన్నం ప్రభాకర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో స్పెషల్ సిఎస్ వికాస్ రాజ్, రవాణా శాఖ కమిషనర్ ఇలాంబర్తి, ఆర్‌టిసి ఎండి నాగిరెడ్డి, జెటిసిలు చంద్రశేఖర్ గౌడ్, రమేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా సోమవారం నుంచి 18వ తేదీ వరకు రోడ్ సేఫ్టీ కోసం పోలీస్, రవాణా శాఖ సంయుక్త ఆధ్వర్యంలో అరైవ్ అలైవ్ కార్యక్రమం చేపడుతున్నామన్నారు. రవాణా నిబంధనలు, ప్రమాదాలకు కారణాలు చర్చించి, వాటిని తగ్గించే చర్యలు తీసుకోవడమే కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. పర్యావరణ పరిరక్షణ కోసం రవాణా శాఖ చర్యలు తీసుకుంటుందన్నారు. ట్రాఫిక్ నిబంధనలను కఠినంగా అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ఈ ఆరు రోజుల్లో అన్ని జిల్లాల్లో శాఖాపరంగా సమీక్షలు చేసుకుంటామన్నారు. చెక్ పోస్టులు ఎత్తివేసి కొత్త సంస్కరణలు తీసుకురావడంతో పాటు అన్ని స్కూళ్లలో విద్యార్థులకు రవాణా నిబంధనలు వివరించేలా చర్యలు చేపట్టామని తెలిపారు. ఆర్‌టిసిలో 30 ఏళ్ల సర్వీసులో ఉండి, ఒక్క ఆక్సిడెంట్ కూడా చేయని వారికి సన్మానం చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి వెల్లడించారు.

## ఆదివాసీ, గిరిజనుల సమగ్ర అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఆదివాసీ, గిరిజన ,ఏజెన్సీ ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. మౌలిక వసతుల కల్పనకు అడ్డంకిగా ఉన్న సమస్యల పరిష్కారం పైన ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని ఆయన తెలిపారు. ఆదివాసీ, గిరిజన,ఏజెన్సీ ప్రాంతాల్లో అభివృద్ధి పనుల పైన మంత్రి సీతక్క నేతృత్వంలో గిరిజన,ఆదివాసీ ఎంఎల్‌ఎల బృందం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని జూబ్లీ హిల్స్ నివాసంలో కలిసి పలు సమస్యల పరిష్కారం కోసం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతాల్లో చెక్ డ్యాంల నిర్మాణంపైన దృష్టి సారిస్తామని వారికి సిఎం హామీ ఇచ్చారు. వీటి ద్వారా తాగు, సాగు నీటి అవసరాలను తీర్చవచ్చన్నారు. చెక్ డ్యాం లు, రహదారుల నిర్మాణం కోసం అటవీ శాఖ నుంచి ఎలాంటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. వీలైనంత త్వరగా అటవీ శాఖ నుంచి అనుమతులు వచ్చేలా చూస్తానన్నారు. ఆదివాసీ,గిరిజన రైతులు సాగు చేస్తున్న భూముల్లో బోర్లు వేయడానికి అనుమతులు ఇవ్వాలని చేసిన విజ్ఞప్తికి ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారు. అటవీశాఖ అభ్యంతరాల వల్ల రహదారుల మరమ్మత్తులు ఆలస్యం అవుతాయని, కొన్ని చోట్ల కొత్త రహదారులకు అనుమతులు ఇవ్వడం లేదని వారు సిఎం దృష్టికి తీసుకువచ్చారు. వీలైనంత త్వరగా వీటిపైన నిర్ణయం తీసుకోవాలని ముఖ్యమంత్రి అటవీ శాఖ అధికారులను ఆదేశించారు. ఆదివాసీ, గిరిజన ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇళ్ల కోటా పెంచే విషయాన్ని పరిశీలిస్తామని సిఎం హామీ ఇచ్చారు.ఐటిడిఎ లను మరింత బలోపేతం చేస్తామన్న ముఖ్యమంత్రి ఆదివాసీ, గిరిజనులకు అన్ని విధాలుగా అండగా ఉంటామని స్పష్టం చేశారు. ఖానాపూర్ ఎంఎల్‌ఎ వెడ్మ బొజ్జు, పినపాక ఎంఎల్‌ఎ పాయం వెంకటేశ్వర్లు, మహబూబాబాద్ ఎంఎల్‌ఎ డాక్టర్ మురళి నాయక్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారిని కలిసిన వారిలో ఉన్నారు.

**మహనీయులు డాక్టర్ బిఆర్ అంబేద్కర్: సిఎం రేవంత్ రెడ్డి**

భారత రాజ్యాంగ రూపశిల్పి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఆ మహనీయునికి ఘన నివాళులు అర్పించారు. అణగారిన వర్గాల సంక్షేమం కోసం అంబేద్కర్ చేసిన కృషిని ఆయన కొనియాడారు. దళిత, గిరిజన, బడుగు, బలహీన వర్గాలు, మహిళల సాధికారతకు ఆయన నిరంతరాయంగా కృషి చేశారని గుర్తు చేశారు. దేశ భవిష్యత్తును తన ముందుచూపుతో ఊహించి, దార్శనికతతో రాజ్యాంగాన్ని రూపొందించిన అంబేద్కర్ భావి తరాలకు స్ఫూర్తిగా నిలిచారని స్మరించారు. అణగారిన వర్గాల ప్రజల హక్కులకు అంబేద్కర్ చేసిన పోరాటం యావత్ ప్రపంచానికి ఆదర్శమని చెప్పారు.
ఆ మహనీయుని ఆశయాల సాకారానికి మనమంతా కృషి చేయాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ప్రతి నియోజకవర్గానికి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణం చేపడుతుందని అన్నారు. దీంతో అన్ని వర్గాలు, అన్ని మతాల పిల్లలందరూ ఒకే చోట నాణ్యమైన విద్యాబోధనను అందుకుంటారని ఆశాభావం వ్యక్తం చేశారు.

## 'ఇన్ సర్వీస్ టీచర్ల'కు ప్రత్యేక టెట్ పరీక్షలు నిర్వహించండి

ఎస్‌టియు టిఎస్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తమిళనాడు రాష్ట్రం తరహాలోనే తెలంగాణ రాష్ట్రంలో కూడా 'ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు' సాధారణ టెట్ పరీక్షలతో పాటు సంవత్సరంలో మూడు సార్లు ప్రత్యేక టెట్ పరీక్షలను నిర్వహించాలని ఎస్‌టియు టిఎస్ రాష్ట్ర అధ్యక్షులు జి.సదానందంగౌడ్, ప్రధాన కార్యదర్శి జుట్టు గజేందర్, రాష్ట్ర పూర్వ అధ్యక్షులు ఎం.పర్వత్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు సోమవారం వారు పాఠశాల విద్యా సంచాలకులు నవీన్ నికోలస్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సదానందంగౌడ్ మాట్లాడుతూ గతంలో ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుండి మినహాయింపు ఉండేదని, తద్వారా గత కొన్నేళ్లుగా ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులు టెట్ పరీక్షలకు దూరంగా ఉన్నారన్నారు. సుప్రీం కోర్టు తీర్పునకు అనుగుణంగా ఉపాధ్యాయులందరికీ టెట్ పరీక్షకు అనుమతినిస్తూ పాఠశాల విద్యా శాఖ గత సంవత్సరంలో 'జిఒ 28'ను జారీ చేసిందని వివరించారు. ఉపాధ్యాయుల శ్రేయస్సు, వారు కోల్పోయిన అనేక అవకాశాలను దృష్టిలో పెట్టుకుని 'ఇన్ సర్వీస్' ఉపాధ్యాయులకు ప్రత్యేక టెట్ పరీక్షలు నిర్వహించాలని కోరారు.

## ఆ ఐదు గ్రామ పంచాయతీలను తెలంగాణకు ఇవ్వండి

ప్రధాని మోదీని ఇక్కడికి తీసుకొద్దాం
రాజ్యసభ సభ్యురాలు రేణుకా చౌదరి




**ప్రజాపక్షం/భద్రాచలం :** అశాస్త్రీయ పద్ధతిలో చోటు చేసుకున్న రాష్ట్ర విభజన ఆ ఐదు గ్రామపంచాయతీల ప్రజలకు శాపంగా మారిందని, దీంతో వారు అన్ని విధాలు నష్టాలకు గురవుతున్నారని, ఇప్పటికైనా కేంద్రం పునరాలోచన చేసి పోలవరం పేరుతో ఆంధ్రప్రదేశ్‌లో విలీనం చేసిన భద్రాచలం పూర్వ మండల గ్రామ పంచాయతీలైన కన్నాయిగూడెం, పిచుకలపాడు, ఎటపాక, పురుషోత్త పట్నం, గుండాలను తెలంగాణలో కలపాలని రాజ్యసభ సభ్యురాలు రేణుకా చౌదరి డిమాండ్ చేశారు. ఐదు గ్రామపంచాయతీల వితరణ కోసం భద్రాద్రి ఐక్యతా గళం పేరుతో ఉమ్మడి ఖమ్మం జిల్లా ఉద్యోగ జేఏసి ఆధ్వర్యంలో చేపట్టిన భద్రాద్రి పునరేకీకరణ విస్తృతస్థాయి అఖిలపక్ష సమావేశం సోమవారం పట్టణంలోని బ్రిడ్జీ సమీపంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆమె మాట్లాడారు. అనేక పోరాటాలతో సాధించుకున్న తెలంగాణలోని చివరి భూ భాగం భద్రాచల పుణ్య క్షేత్రం అని, పోలవరం ప్రాజెక్టు ముంపు ప్రాంతాల పేరుతో రాష్ట్ర విభజన సమయంలో ఏడు మండలాలను ఏపిలో విలీనం చేశారని, ఆ ఏడు మండలాల్లో ఒకటైన భద్రాచలం పట్టణం మినహా పూర్వ మండలం మొత్తం ఉందని చెప్పారు. దీంతో ఇక్కడ విద్యా, వైద్యపరమైన సమస్య తలెత్తిందని, ప్రజలు,విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. పాఠశాల విద్య మొత్తం తెలంగాణలో చదివిన విద్యార్థులు పై చదువులు కోసం పోటీ పరీక్షలు రాసి ఉత్తీర్ణ సాధిస్తే స్థానికత కారణంగా వారికి సీట్లు దక్కడం లేదని, అసలు మీ అడ్రస్ ఏంటి అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రంలో మూడో సారి అధికారంలోకి వచ్చిన బిజేపి ప్రభుత్వం ఈ సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తుందని ఇక్కడి ఆ పార్టీ నేతలు పలుమార్లు చెప్పారని, కానీ నేటికీ అది కార్యరూపం దాల్చలేదన్నారు. తాను కూడా చట్టసభలో దీనిపై ఎప్పటినుండో గళం విప్పుతున్నానని, అయినా పాలకులు పెడచెవిన పెడుతున్నారని మండిపడ్డారు. రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సైతం దీనిపై పలుమార్లు ప్రభుత్వానికి వినతి పత్రాలు సమర్పించారని, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పుడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో తాను ఈ ఐదు గ్రామపంచాయితీలో విషయంలో చర్చించగా ప్రాధాన్యతా అంశంగా తీసుకున్నారని తెలిపారు. ఆ ఐదు గ్రామ పంచాయతీలను సాధించే వరకు ఈ ప్రాంత ఆడ బిడ్డగా కలిసి వస్తానని, అవసరమైతే కేంద్రం మెడలు వంచి ఒప్పించి ఆ పంచాయితీలను తిరిగి తెలంగాణలో విలీనం చేసుకునే వరకు పోరాటాన్ని కొనసాగిద్దామని చెప్పారు. అంతకు ముందు బిఆర్‌ఎస్ రాష్ట్ర ప్రతినిధి ఏనుగుల రాకేష్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర విభజన సమయంలో చోటుచేసుకున్న అంశంతో ఐదు పంచాయితీల ప్రజలకు తీవ్ర నష్టాన్ని తెచ్చిపెడుతోందని, విభజన జరిగి 12 ఏళ్లు అవుతున్నా ఆ సమస్య ఓ కొలిక్కి రాకపోవడం దురదృష్ట కరమని స్పష్టం చేశారు. అనంతరం స్థానిక ఎంఎల్‌ఎ డా.తెల్లం వెంకట్రావు మాట్లాడుతూ భద్రాచలం పట్టణానికి ఆనుకుని ఉన్న ఆ ఐదు గ్రామ పంచాయతీల ప్రజలు ప్రతీ అవసరానికి భద్రాచలమే రావాలని, పరిపాలనాపరమైన సమస్యలు ఎవైనా ఉంటే వాటి కోసం ఏపిలోని సుదూర ప్రాంతానికి వెళ్లాల్సి వస్తోందని చెప్పారు. అనంతరం పలువురు అఖిలపక్షం నేతలు మెచ్చా వెంకటేశ్వర్లు, కెచ్చల కల్పన, కుంజా ధర్నా, మానె రామకృష్ణ తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అటవి అభివృద్ధి సంస్థ చైర్మన్ పొదెం వీరయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పసుపులేటి వీరబాబు. సర్పంచ్ పూనెం కృష్ణ, టిజిఓ నాయకులు ఏలూరి శ్రీనివాసరావు, గుంటుపల్లి శ్రీనివాసరావు, అమరనేని రామారావు, భార్గవ్ చైతన్య, పెన్షనర్ల జిల్లా అధ్యక్షులు చల్లగుళ్ల నాగేశ్వరరావు, ఖమ్మం జిల్లా అధ్యక్షులు కళ్యాణం నాగేశ్వరరావుతో పాటు యూటిఎఫ్ నాయకులు చావా రవి, రాజు, విలీన పంచాయతీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.




## మహిళల గురించి బిజెపి మాట్లాడడం సిగ్గుచేటు

మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మహిళల గురించి బిజెపి మాట్లాడడం సిగ్గుచేటు అని మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ అన్నారు. గాంధీభవన్‌లో సోమవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ మహిళా రిజర్వేషన్లకు కాంగ్రెస్ వ్యతిరేకం కాదని, మహిళా బిల్లు అవశ్యకతను మొదట గుర్తించిందే కాంగ్రెస్ అని అన్నారు. కానీ, ఎన్నికలు ఉండగా ఎందుకు ఇంత హడావిడి అని ప్రశ్నించారు. క్రెడిట్ కోసమే బిజెపి నేతలు డ్రామాలు ఆడుతున్నారనీ, పద్ధతి ప్రకారం అన్ని పార్టీలతో చర్చించిన తర్వాతనే మహిళా బిల్లు పెట్టాలని ఎర్రబెల్లి స్వర్ణ పేర్కొన్నారు.


**సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ :: చింతల్ సర్కిల్-54**

NIT No. 02/DB/EE/Chintal-54/CMC/2026-27, తేదీ: 13.04.2026
**పని పేరు:** డిజిల్టింగ్ వర్క్స్ & కంప్యూటర్ సరఫరా (2 నెం.లు), **అంచనా విలువ :** రూ.35.60 లక్షలు, ప్రారంభ తేదీ & సమయం: 15.04.2026న మ.3.00గం.ల నుండి, **బిడ్ స్వీకరణకు ఆఖరి తేదీ & సమయం:** 18.04.2026న మ.3.00గం.ల వరకు, టెండర్ ఆహ్వానించు అథారిటీ వివరాలు మరియు మొబైల్ నెం. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సెల్ నెం.9701414306, హెడ్ డ్రాఫ్ట్స్‌మెన్ సెల్ నెం. 8712034411. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @ www.tender.telangana.gov.in లో చూడవచ్చు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, చింతల్ సర్కిల్-54, సిఎంసి.
DIPR R.O. No. : 598-PP/CL/ADVT/2026-27, Date: 13-04-2026

**మంచిర్యాల నగరపాలక సంస్థ, జిల్లా: మంచిర్యాల**

EOI No. E1/253/MMC/2026 **E.O.I** తేదీ: 13-04-2026
మంచిర్యాల నగరపాలక సంస్థ పరిధిలోని వీధి కుక్కల స్టెరిలైజేషన్ కోసం ఎనిమల్ బర్త్ కంట్రోల్ రూల్స్ 2001 మరియు స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రోసిజర్ ప్రకారం కుక్కల కోసం ఎనిమల్ బర్త్ కంట్రోల్ కార్యకలాపాల కొరకు N.G.O / ఏజన్సీ ల నుండి కమీషనర్ మంచిర్యాల నగరపాలక సంస్థ ద్వారా సీల్డ్ కొటేషన్లు కోరబడుతున్నవి. **E.O.I షెడ్యూల్ దరఖాస్తు కోసం ఆఖరి తేదీ:** 17-04-2026 న పగలు 3.00గంటల వరకు, **E.O.I షెడ్యూల్ జారీ తేదీ:** 14-04-2026న పగలు 3.00 గంటల నుండి ఇవ్వబడును. షెడ్యూల్ దాఖలు కమిషనర్ నగరపాలక సంస్థ మంచిర్యాల గారి పేరున రూ. 2000.00లు డి.డి రూపేన సమర్పించవలెను. **అట్టి షెడ్యూల్ తేదీ:** 17.04.2026 రోజున సాయంత్రం 4.00గల తరువాత తెరవబడును.
తదుపరి వివరములకు కమిషనర్, మున్సిపల్ ఇంజనీర్, మంచిర్యాల నగరపాలక సంస్థ గారిని సంప్రదించు ఫోన్ నెం. 9849905886, 9849906721, 9505550340.
సం/- కమిషనర్, మంచిర్యాల నగరపాలక సంస్థ.
DIPR R.O. No. : 619-PP/CL/ADVT/2026-27, Date: 13-04-2026

**మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్**
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయం, ఘట్‌కేసర్ సర్కిల్-06, ఘట్‌కేసర్ పోలీస్ స్టేషన్ ఎదురుగా - 501301
ఇ-మెయిల్: ee.2.ghatkesar@gmail.com
**ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ నోటీసు**
ఎంఎంసి, ఉప్పల్ జోన్, ఘట్‌కేసర్ సర్కిల్-06లో టెండర్ నోటీస్ నెం. 12/EE/Ghatkesar Circle-06/MMC/Tenders/2025-26, తేదీ: 10.04.2026 నందు 04 పనుల కోసం ప్రచురణ. పూర్తి వివరాలకు https://tender.telangana.gov.in/login.htmlలో లాగిన్ అయి చూడవచ్చు. ఈవెంట్ల వివరాలు క్రింద వివరించబడ్డాయి:

| ఈవెంట్స్ | 4 పనులు మాత్రమే |
|---|---|
| ప్రారంభ తేదీ | 13.04.2026న సా.4.00గం.ల నుండి, |
| డౌన్‌లోడ్ ఆఖరి తేదీ | 15.04.2026న సా.4.00గం.ల వరకు, |
| బిడ్స్ స్వీకరణకు ఆఖరి తేదీ & సమయం | 15.04.2026న సా.4.00గం.ల వరకు, |
| ప్రైస్ బిడ్ ప్రారంభం | 15.04.2026న సా.4.30గం.లకు. |

**సంప్రదించవలసిన అధికారి చిరునామా:** శ్రీ కె.రమేష్ బాబు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఘట్‌కేసర్ సర్కిల్-06, ఎంఎంసి, హైదరాబాద్. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @ https://tender.telangana.gov.in/login.htmlలో చూడవచ్చు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఘట్‌కేసర్ సర్కిల్-06, ఎంఎంసి.
DIPR R.O. No. : 621-PP/CL/ADVT/2026-27, Date: 13-04-2026


## అరుదైన ఖనిజాల అన్వేషణతో ఆర్థికాభివృద్ధికి ఊతం

మంత్రి వివేక్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** అరుదైన ఖనిజాల అన్వేషణ దేశంతో పాటు రాష్ట్ర ఆర్థిక పరిస్థితులపై సానుకూల ప్రభావాన్ని చూపుతుందని రాష్ట్ర కార్మిక, ఉపాధి, గనుల శాఖ మంత్రి డాక్టర్ జి.వివేక్ వెంకటస్వామి పేర్కొన్నారు. ఈ ఖనిజాలకు అంతర్జాతీయ, దేశీయ మార్కెట్లలో విస్తృత విలువ ఉందని, భవిష్యత్ అభివృద్ధికి ఈ రంగం కీలకమని ఆయన అన్నారు.
హైదరాబాద్‌లోని హెచ్‌ఐసిసిలో సోమవారం కేంద్ర గనుల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో 'క్రిటికల్ మినరల్ బ్లాక్స్ వేలం', 'ఎక్స్‌ప్లోరేషన్ లైసెన్స్' అంశాలపై రోడ్‌షో నిర్వహించారు. కార్యక్రమానికి కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి, మంత్రి వివేక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వివేక్ మాట్లాడుతూ ఖనిజాల కేటాయింపులో పారదర్శకత కోసం కేంద్రం సహా రాష్ట్ర ప్రభుత్వాలు పలు చర్యలు తీసుకున్నాయని మంత్రి తెలిపారు. తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో అన్ని ఖనిజ వనరులను పారదర్శక వేలం విధానంలో కేటాయించే విధాన నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. గత రెండేళ్లలో ఈ విధానం అమలుతో రాష్ట్ర ఆదాయం గణనీయంగా పెరిగిందని, ప్రైవేట్ బిడ్డర్లు పెద్ద ఎత్తున వేలం పాటల్లో పాల్గొంటున్నారని తెలిపారు. క్రిటికల్ ఖనిజాల అన్వేషణ గతంలో తగిన ప్రాధాన్యం పొందలేదని, అయితే కేంద్ర ప్రభుత్వం ఈ రంగాన్ని ప్రోత్సహించేందుకు చర్యలు ప్రారంభించిందని మంత్రి తెలిపారు. రానున్న సంవత్సరాల్లో ఈ రంగంలో అన్వేషణలు పెరిగి, బిడ్డర్ల భాగస్వామ్యం విస్తరించి, మరిన్ని అవకాశాలు ఏర్పడతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.
చైనా ఈ రంగంలో ప్రస్తుతం భారత్ కంటే ముందంజలో ఉన్నప్పటికీ, భారత్‌కు విస్తృత అవకాశాలు ఉన్నాయని, ఈ వనరులను సమర్థంగా వినియోగించుకోవడం ద్వారా దేశ ఆర్థికాభివృద్ధిని మరింత బలోపేతం చేయవచ్చని మంత్రి వివేక్ స్పష్టం చేశారు.




## కల్వకుంట్ల కుటుంబం అంటేనే కుట్రల కుటుంబం

రాష్ట్ర ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కల్వకుంట్ల కుటుంబం అంటేనే కుట్రల కుటుంబం అని టిపిసిసి నాయకులు మెట్టు సాయికుమార్ ఆరోపించారు. గాంధీభవన్‌లో సోమవారం మీడియాతో ఆయన మాట్లాడుతూ బిఆర్‌ఎస్‌ను టిఆర్‌ఎస్‌గా మార్చినా ఒరిగేదేమీ లేదని, తెలంగాణ ప్రజలు ఇప్పటికే వాళ్లకు విఆర్‌ఎస్ ఇచ్చేశారని విమర్శించారు. గత పదేళ్లలో తెలంగాణ అమరులు, ప్రజాసంఘాలు, ఉద్యోగ సంఘాలను బిఆర్‌ఎస్ ప్రభుత్వం తీవ్ర ఇబ్బందులకు గురిచేసిందని, కొంగ జపం చేస్తున్న కెటిఆర్ గత పదేళ్లలో ప్రజలతో పాటు సొంత పార్టీ నేతలను కూడా పట్టించుకోలేదని విమర్శించారు. పాదయాత్ర కాదు పొర్లు దండాల యాత్ర చేసినా కెటిఆర్‌ను ఎవరూ పట్టించుకోరని మెట్టు సాయికుమార్ వ్యాఖ్యానించారు.



## సిసిటివి కమాండ్ కంట్రోల్ సెంటర్ ప్రారంభం

**ప్రజాపక్షం/సూర్యాపేట** : సూర్యాపేట పట్టణ పోలీస్ స్టేషన్‌లో 75 సీసీ కెమెరాల అనుసంధానంతో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను సోమవారం జిల్లా ఎస్‌పి కె. నరసింహ, మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిఘా నేత్రాలతో నేరాలకు అడ్డుకట్ట వేయవచ్చన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రజలు, వ్యాపారులు ముందుకు రావాలన్నారు. ప్రజల సంరక్షణలో పోలీస్ శాఖ నిరంతరం కృషి చేస్తుందన్నారు. నేరాల నివారణలో ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు. కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన ఒక్కొక్క సీసీ కెమెరా 100 నేత్రాలు, పోలీసులతో సమానమన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌టిఓ జయప్రకాష్ రెడ్డి, డిఎస్‌పి ప్రసన్న కుమార్, మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీ ఉల్లా, పట్టణ ఇన్‌స్పెక్టర్ వెంకట్, మున్సిపల్ కమీషనర్ హన్మంతరెడ్డి పాల్గొన్నారు.

## ప్రజావాణి ఫిర్యాదులపై సత్వర పరిష్కారం



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్** : ప్రజావాణిలో ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదులను ఆయా శాఖల అధికారులు సత్వరమే పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ కె. సీతారామారావు అన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి ఆయన అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజావాణి పెండింగ్ దరఖాస్తులకు అధిక ప్రాధాన్యత ఇస్తూ ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. భూ సమస్యకు సంబంధించి మొత్తం 40 దరఖాస్తులు రాగా, మున్సిపాలిటి 13, డిపిఓ 5, డిడబ్లుఓ 2, మిగిలిన 35 దరఖాస్తులు వివిధ శాఖలకు చెందినవని అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏఓ సుదర్శన్ రెడ్డి, ఆర్‌డిఓ వేణుమాధవ్, అడిషనల్ పిడి సురేష్ పాల్గొన్నారు.


## ప్రజా సంక్షేమం హక్కుల పరిరక్షణకు ఉద్యమాలు : లొడంగి



**ప్రజాపక్షం/చిట్యాల:** ప్రజా ఉద్యమాలలో ముందుండే భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) పార్టీకి విరాళాలు అందించి సహకరించాలని ఆ పార్టీ నల్లగొండ జిల్లా సహాయ కార్యదర్శి లొడంగి శ్రవణ్‌కుమార్ కోరారు. మున్సిపాలిటి కేంద్రంలో సోమవారం పార్టీకి నిధుల సేకరణ కోసం చేపట్టిన ఇంటింటికి సిపిఐ కార్యక్రమంలో ఆయన పార్టీ శ్రేణులతో కలిసి పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వాలు విద్య, వైద్యం,రవాణా వంటి కీలక రంగాలను ప్రైవేట్ సంస్థలకు అప్పగించడం వల్ల సాధారణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రజల సంక్షేమం, హక్కుల పరిరక్షణ కోసం సిపిఐ నిరంతరం ఉద్యమాలు కొనసాగిస్తుందని, ఈ పోరాటాలకు ప్రజలు ఆర్థికంగా సమకరించాలని విజప్తి చేశారు. అలాగే రైతులు కష్టపడి పండించిన వరి ధాన్యాన్ని తక్షణమే కొనుగోలు చేసి రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి ఎండి అక్బర్, సహాయ కార్యదర్శి జిల్లా సత్యం, పట్టణ కార్యదర్శి షేక్ షరీఫ్, నాయకులు బొలుగూరి లింగయ్య, పి దేవేందర్, సత్తయ్య, రవి, కృష్ణ పాల్గొన్నారు.


## కార్మికుల అక్రమ తొలగింపులు ఆపాలి

పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి: రామస్వామి



**ప్రజాపక్షం/చందంపేట:** నల్గొండ జిల్లా చందంపేట మండలం గ్రామ పంచాయతీ కార్మికుల అక్రమ తొలగింపులను ఆపాలని, పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే విడుదల చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు నూనె రామస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ కార్మికులతో కలిసి సోమవారం స్థానిక ఎంపిడివో కార్యాలయం ముందు నిరసన తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిపి కార్మికులపై అధికారుల, రాజకీయ నాయకుల వేధింపులు ఆపాలని, గత పదిహేను సంవత్సరాలుగా ఉన్న కార్మికులను తొలగించి కొత్త వారిని చేర్చుకోవడం అన్యాయం అని ఆయన అన్నారు. అధికారుల నిర్లక్ష్యంతో జిపి కార్మికులు జీతాలు కూడా సకాలంలో అందడం లేదని తక్షణమే జిపి కార్మికులకు పిఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత, కనీస వేతనం అమలు చేయాలని లేని పక్షంలో ఎప్రిల్ 25 నుండి నిరవధిక సమ్మె చేయడం జరుగుతుందని ఆయన హెచ్చరించారు. తక్షణమే కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఆయన ప్రభుత్వాన్ని, అధికారులను డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో మండల అధ్యక్షులు నల్ల దేవరాజ్, లక్ష్మ , ముత్తయ్య, అంజమ్మ, మల్లమ్మ, అలివేలు, రవి తదితరులు పాల్గొన్నారు.

## మంచినీటి కొరత లేకుండా ప్రణాళికలు



**ప్రజాపక్షం/దేవరకొండ:** దేవరకొండ ఎంపిడిఓ కార్యాలయంలో సోమవారం గ్రామాలలో మౌలిక సదుపాయాల కల్పనపై మండల అధికారులతో , ప్రజా ప్రతినిధులతో కలిసి దేవరకొండ ఎంఎల్‌ఏ నేనావత్ బాలు నాయక్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంఎల్ఏ బాలునాయక్ మాట్లాడుతూ బాధ్యతలు చేపట్టిన సర్పంచ్‌లు తమ తమ గ్రామాలలో క్షేత్ర స్థాయిలో పర్యటించి మౌలిక వసతులు , ప్రజల అవసరాలను సమగ్రంగా గుర్తించాలని సూచించారు. పంచాయతీ ఆదాయం , బడ్జెట్‌కు అనుగుణంగా గ్రామాలలో ఉన్న సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మండలానికి సంబంధించి 15 మంది లబ్దిదారులకు కళ్యాణలక్ష్మి చెక్కులను ఎంఎల్ఏ పంపిణి చేశారు. ఈ సమావేశంలో ఎంపిడివో పార్వతి, తహాశీల్దార్ మధుసూధన్‌రెడ్డి, సర్పంచ్‌లు, ప్రతినిధులు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రతపై ప్రజల్లో చైతన్యం పెంచాలి

నల్లగొండ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్




**ప్రజాపక్షం/నల్లగొండ** : రోడ్డు భద్రతపై ప్రజల్లో చైతన్యం పెంపొందించేందుకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రోడ్ సేఫ్టీ అవేర్నెస్ ట్రీ అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభించిన నల్లగొండ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ సోమవారం క్లాక్ టవర్ సెంటర్లో రవాణా శాఖ ఆధ్వర్యంలో ప్రజా పాల ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న రోడ్డు సేఫ్టీ అవగాహన కార్యక్రమాన్ని సందర్శించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించాలని సూచించారు.జీవితం విలువైనది అనే సందేశంతో రోడ్డు సేఫ్టీ వృక్షాన్ని ప్రతీకగా చూపిస్తూ, మనిషి జీవితాన్ని రక్షించుకోవడం ఎంత ముఖ్యమో వివరిస్తూ అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ బాధ్యతతో వ్యవహరిస్తేనే రోడ్డు ప్రమాదాలను తగ్గించవచ్చని తెలిపారు. హెల్మెట్ ధరించినప్పుడు ప్రమాదం జరిగినా ఎలా రక్షణ లభిస్తుందో, హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తే ఎలాంటి ప్రమాదకర పరిస్థితులు ఎదురవుతాయో ప్రదర్శన ద్వారా ప్రజలకు స్పష్టంగా వివరించారు.ఈ కార్యక్రమంలో రవాణా శాఖ డిప్యూటీ కమిషనర్ వాణి,డిటిఓ లావణ్య,వన్ టౌన్ సిఐ రాజశేఖర్ రెడ్డి,మోటారు ఇన్‌స్పెక్టర్లు కొండయ్య ,మల్లికార్జున్, భాస్కర్ రెడ్డి,ఉషశ్రీ,సోనిప్రియ,చిరంజీవి,గోపీనాథ్, నరేందర్ రెడ్డి, రవి పాల్గొన్నారు.

**కొనుగోలు కేంద్రాలను సందర్శించాలి** : మండలాల ప్రత్యేక అధికారులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను తప్పనిసరిగా సందర్శించాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆయన కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ప్రజల వద్ద నుండి ఫిర్యాదులను స్వీకరించారు.అనంతరం జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్ష సందర్భంగా రబి ధాన్యం సేకరణ పై మాట్లాడుతూ రబీ ధాన్యం కొనుగోలు ప్రక్రియ ప్రారంభమైన నేపథ్యంలో అన్ని మండలాల్లో అధికారులు క్రమం తప్పకుండా ఫీల్డ్ విజిట్ చేయాలని సూచించారు. రైతులకు ఎలాంటి నష్టం కలగకుండా చూడాలని,ధాన్యం అన్‌లోడింగ్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని తెలిపారు.

**వనమహోత్సవంలో మొక్కలు నాటే లక్ష్యం** : వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా ఈవాన కాలం పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అన్నారు. అలాగే 2027 సంవత్సరానికి గాను ఆయా శాఖల వారీగా మొక్కలు నాటే లక్ష్యాన్ని నిర్దేశించుకుని మొక్కలు పెంచాలని చెప్పారు. సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో వనమహోత్సవం కింద ఈ సంవత్సరం నాటనున్న మొక్కలు ,2027 వన మహోత్సవానికి అవసరమైన మొక్కల పెంపకంపై ప్రణాళికతో సిద్ధంగా ఉండాలన్నారు. జిల్లాలో మొక్కల పెంపకం కార్యక్రమం వేగంగా కొనసాగుతున్నదని ,2025 /26 సంవత్సరం జిల్లాలో మొత్తం 68 లక్షల మొక్కలకు గాను 90 శాతం మొక్కలు నాటడం జరిగిందని, 2026/27కు సంబంధించి డిఆర్డిఓ ద్వారానే 32 లక్షల 12 వేల మొక్కలు నాటినట్లు వెల్లడించారు.

# అగ్నిమాపక శాఖ నియమాలు పాటించాలి

జిల్లా అదనపు కలెక్టర్ కె. సీతారామారావు



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్** : అగ్నిమాపక శాఖ నియమాలను పాటిస్తూ ప్రమాదాలు జరగకుండా హోటల్ నిర్వాహకులు తగిన జాగ్రత్తలు పాటించాలని జిల్లా అదనపు కలెక్టర్ కె. సీతారామారావు అన్నారు. సోమవారం అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో అగ్నిమాపక నివారణ పట్ల ముద్రించిన అవగాహన పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హోటల్స్‌లో అగ్నిమాపక పరికరాలు అన్ని వేళలా పనిచేసేలా ఉంచాలన్నారు. ప్రతి అంతస్తులో మొదటి ద్వారాలు అగ్నిమాపక పరికరాలు తెరిచే ఎస్కేప్ ప్లాన్ ఉండాలని చెప్పారు. ఎయిర్ కండీషన్ ద్వారా మంటలు వ్యాప్తి చెందకుండా డ్యాంపర్స్ ఏర్పాటు చేయాలని వాటిని ఆటోమెటిక్ డిటెక్టవ్ సిస్టమ్‌కు అనుసంధానం చేయాలని సూచించారు. విద్యుత్ వైరింగ్, స్విచ్‌లు, ఇతర పరికరాలు క్రమం తప్పకుండా చెక్ చేసుకోవాలని ఏదైనా లోపాలు ఉంటే వెంటనే సరి చేసుకోవాలన్నారు. హోటల్ సిబ్బంది అందరికి ఎక్విప్మెంట్‌పై శిక్షణ ఇవ్వాలన్నారు. తరచు మాక్‌డ్రిల్స్ నిర్వహించాలని, అగ్నిమాపక లాంటి అత్యవసర సమయాలలో ఏ విధంగా ప్రవర్తించాలో శిక్షణ ఇవ్వాలన్నారు. వంట గదిలో అగ్నిప్రమాదం జరగకుండా ప్రత్యేక శ్రద్ధ చూపాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక శాఖ అధికారి జానయ్య, ముఖ్య ప్రణాళిక అధికారి కిషన్, జిల్లా సంక్షేమ అధికారి నర్సింహారావు, అడిషనల్ పిడి సురేష్, డిఎంఓ నాగేశ్వర శర్మ, ఏఓ సుదర్శన్ రెడ్డి, జిల్లా స్పోర్ట్స్ అధికారి వెంకట్ రెడ్డి పాల్గొన్నారు.

# దళారులు రైతులను మోసం చేస్తే చర్యలు

ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య



**ప్రజాపక్షం/మోటకొండూర్** : రైతుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తుందని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అన్నారు. ఆయన సోమవారం మండల కేంద్రంలో వంగపల్లి పిఎసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సర్పంచ్ భూమండ్ల జయమ్మ శ్రీనివాస్‌లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు. కొనుగోలు కేంద్రాలలో పారదర్శకంగా ధాన్యం కొనుగోలు నిర్వహించడంతోపాటు, రైతులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రంలో తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయడంతో పాటు, విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్‌ను కూడా వెంటనే ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు తెలియజేశారు. దళారులు రైతులను మోసం చేయకుండా కఠిన చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. ధాన్యం అమ్మిన రైతుల ఖాతాల్లో డబ్బులు త్వరిత గతిన జమ అయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సబ్ రిజిస్టర్ తహసిల్దార్ రాజేంద్రప్రసాద్, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు కొంతం మోహన్ రెడ్డి, సర్పంచులు పచ్చిమట్ల జయమ్మ మదార్ గౌడ్, ప్రదీప్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మల్లేష్ పాల్గొన్నారు.



## రోడ్డు ప్రమాదాల నివారణకు భద్రత కమిటీలు

**ప్రజాపక్షం/సూర్యాపేట** : రోడ్డు ప్రమాదాల నివారణకు జిల్లాలో గ్రామ, వార్డుల వారీగా రోడ్డు భద్రత కమిటిలను ఏర్పాటు చేశామని జిల్లా ఎస్‌పి కె. నరసింహ తెలిపారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా సోమవారం అరైవ్ అలైవ్ రోడ్డు భద్రత కార్యక్రమాన్ని సూర్యాపేట పట్టణ పోలీస్ స్టేషన్‌లో నిర్వహించారు. దీనికి ముఖ్య అతిధిగా హాజరైన ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించడం జరిగిందన్నారు. కమిటిల వారీగా బాధ్యతగా పనిచేసి పనిచేయాలన్నారు. ప్రతి ప్రయాణం సురక్షిత గమ్యం చేరాలే ఉండాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు జాగ్రత్తలు పాటిస్తామని అన్ని కమిటీలు తీర్మానం చేసుకోవాలని సూచించారు. సామాజిక సేవలో, ప్రజల భద్రతలో జిల్లా పోలీసులు పటిష్టంగా పనిచేయడం జరుగుతుందన్నారు. సూర్యాపేట జిల్లాలో 2024 రోడ్డు ప్రమాదాల్లో 278 మంది మరణించగా 2025లో ఆ సంఖ్యని 230కి తగ్గించామన్నారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది, వైస్ చైర్మన్ షఫీ ఉల్లా, డిఎస్‌పి ప్రసన్న కుమార్, ఆర్‌టిఓ జయప్రకాష్ రెడ్డి, పట్టణ ఇన్‌స్పెక్టర్ వెంకట్‌తోపాటు పలువురు పాల్గొన్నారు.

## అంబేద్కర్ జయంతి వేడుకలను విజయవంతం చేద్దాం : ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేద్కర్ జయంతి సందర్భంగా నేడు నిర్వహించే ఉత్సవాలను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. సోమవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో వివిధ ప్రజా సంఘాలు, కుల సంఘాల నాయకులతో ఎమ్మెల్యే ప్రత్యేక సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. అంబేద్కర్ ఆశయాలు కేవలం ఒక్క వర్గానికే పరిమితం కావని, సమాజంలోని అన్ని వర్గాల అభివృద్ధికి ఆయన వేసిన పునాదులే నేడు మనకు మార్గదర్శకాలని కొనియాడారు. నేడు నిర్వహించే అంబేద్కర్ జయంతి ఉత్సవాలకు ముఖ్య అతిధులుగా ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి, నకిరేకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ వేముల వీరేశం, ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్‌లు హాజరుకానున్నట్లు తెలిపారు. రాజకీయాలకు, కులమతాలకు అతీతంగా ప్రజా సంఘాలు, కుల సంఘాల నాయకులు కలిసికట్టుగా ఉండి జయంతి వేడుకలను వైభవంగా, విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో వివిధ సంఘాల ప్రతినిధులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యారంగ సమస్యలపై టిఎస్‌యుటిఎఫ్ రాజీలేని పోరాటం

**ప్రజాపక్షం/కోదాడ:** విద్యారంగ సమస్యలపై టిఎస్‌యుటిఎఫ్ రాజీలేని పోరాటం చేస్తుందని టిఎస్ యూటిఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగేశ్వర రావు, పాండురంగచారి లు అన్నారు. సోమవారం కోదాడ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో టిఎస్‌యుటిఎఫ్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. యూటిఎఫ్ ఆవిర్భావం నుండి నేటి వరకు విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికై కృషి చేస్తుందన్నారు. ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు యూటిఎఫ్ సభ్యులు పోరాటాలకు సిద్దం కావాలన్నారు. ఈ సందర్భంగా అనంతగిరి ఎంఈవో తల్లాడ శ్రీనివాసరావు, చిలుకూరు ఎంఈవో నర్సింహారెడ్డిలు యూటిఎఫ్ చేస్తున్న పోరాటాలను అభినందించారు. టిఎ జనార్ధన్ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళ కార్యదర్శి జ్యోతి, సీనియర్ నాయకులు చందా శ్రీనివాసరావు, సనత్‌కుమార్, పిడతల శ్రీనివాస్, ఉపేందర్, రామారావు, లక్ష్మి నారాయణ, శ్రీదేవి, మండవ ఉపేందర్, సత్తార్, బాబు, విక్రమ్‌రెడ్డి, శ్రీపాల్‌రెడ్డి, బాలరాజు, శ్రీనివాసచారి, శ్రీరంగారాజు, సైదిరెడ్డి, నందా, కిషోర్ పాల్గొన్నారు.





## మున్సిపల్ కోఆప్షన్ సభ్యుల ఎన్నికలో బిసిలకు స్థానం కల్పించాలి

**ప్రజాపక్షం/నేరేడుచర్ల:** మున్సిపల్ కోఆప్షన్ ఎన్నికల్లో బిసిలకు సముచిత స్థానం కల్పించాలని బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దూళిపాళ ధనుంజయనాయుడు విజ్ఞప్తి చేశారు. సోమవారం నేరేడుచర్లలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు తీరని అన్యాయం జరిగిందని, కాంగ్రెస్ పార్టీ తరుపున 42 శాతం సీట్లు కేటాయిస్తామని మాట ఇచ్చినప్పటికీ అది అమలు కాలేదని అన్నారు. కనీసం మున్సిపల్ కోఆప్షన్ ఎన్నికల్లోనైనా బిసిలకు గౌరవప్రధంగా సీట్లు కేటాయించాలని, జనాభాలె 56శాతం ఉన్న బిసిలకు వారి అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోవాలని, బిసి సంఘం రాష్ట్ర బాధ్యుడిగా డిమాం డ్ చేస్తున్నామని అన్నారు. కోఆప్షన్ ఎంపికతో పాటు నామిటెడ్ పోస్టులో కూడా బిసిలకు 42శాతం పదవులు దక్కేలా చూడాలన్నారు. కాంట్రాక్టర్‌లలో కూడా రిజర్వేషన్ పాటించి బిసిల అభివృద్ధికి ప్రభుత్వం చేయూతనివ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో వెంకట్, వెంకన్న, భరత్, రామకృష్ణ, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

## బైకు అదుపుతప్పి వ్యక్తి మృతి

**ప్రజాపక్షం/త్రిపురారం:** మండలంలోని మాటూరు గ్రామ పరిధిలో ఆదివారం సాయంత్రం బైకు అదుపుతప్పి వ్యక్తి మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం మిర్యాలగూడ మండలంలోని రామన్నపేట గ్రామానికి చెందిన బొద్దుపల్లి భద్రయ్య అడవిదేవులపల్లినుండి మిర్యాలగూడ వెళుతుండగా బైక్ అదుపుతప్పి కింద పడగా తలకు తీవ్రంగా గాంయ కావడంతో స్థానికులు వెంటనే 108 వాహనానికి సమాచారం అందించి మిర్యాలగూడ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా వైద్యులు మృతి చెందినట్లు తెలిపారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

## పోచంపల్లి మున్సిపాలిటీ కో-ఆప్షన్ మెంబర్ల ఎన్నికకు నోటిఫికేషన్

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి** : పోచంపల్లి మున్సిపాలిటీ నూతన పాలకవర్గం ఏర్పడిన తర్వాత ప్రభుత్వ ఆదేశాల మేరకు నలుగురు కోఆప్షన్ మెంబర్ల ఎన్నికకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు మున్సిపల్ కమిషనర్ అంజన్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇద్దరు జనరల్ అభ్యర్థులలో ఒకరు స్త్రీ, మరొకరు పురుషుడు, మైనార్టీ వర్గంలో ఒకరు స్త్రీ, ఇంకొకరు పురుషుడు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు. అర్హత ఆసక్తి గల దరఖాస్తు చేసుకునే అభ్యర్థులకు నియమాలు వెల్లడించారు. మున్సిపల్ పరిపాలనలో ప్రత్యేక పరిజ్ఞానం లేదా అనుభవం కలిగి యున్న జనరల్ కోఆప్షన్ సభ్యుల ఎన్నికకు మున్సిపల్ కౌన్సిల్ యొక్క ఓటరు జాబితాలో రిజిష్టర్ ఓటరు అయి ఉండాలి , వారి యొక్క వయస్సు 21 సం. తక్కువ కాకుండా ఉండాలి.మున్సిపల్ కౌన్సిల్ యొక్క చైర్ పర్సన్/వైస్ చైర్ పర్సన్/వార్డు మెంబర్ పదవి కలిగి ఉన్న లేదా ఈ పదవులన్నిటి కలిపి మొత్తం 5 సంవత్సరములకు తక్కువ కాకుండా కాల వ్యవధితో పదవిని కలిగి ఉండాలి లేదా మున్సిపాలిటీ ఉన్నటువంటి రెవెన్యూ మండల్ పరిధిలోని గ్రామ పంచాయతీ యొక్క సర్పంచ్/ఉప సర్పంచ్/ వార్డు మెంబర్ పదవి కలిగి ఉన్న లేదా ఈ పదవులన్నిటి కలిపి మొత్తం (5) సంవత్సరములకు తక్కువ కాకుండా కాల వ్యవధితో పదవిని కలిగి ఉండాలి.లేదామున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ (3) సంవత్సరముల కాల వ్యవధితో పని చేసిన అడ్వకేట్ అయి ఉండాలి. లేదా కేంద్ర ప్రభుత్వం లేదా రాష్ట్ర ప్రభుత్వం లేదా స్థానిక సంస్థలలో గెజిటెడ్ పోస్ట్ యందు పని చేసి రిటైర్ అయిన మున్సిపల్ పరిపాలనలో మరియు పురపాలక శాఖ యందు ప్రత్యేక పరిజ్ఞానం లేదా అనుభవం కలిగి ఉన్న వారై ఉండాలి. ఇక అల్ప సంఖ్యాక వర్గములకు అభ్యర్థి ఎన్నికకు..మున్సిపల్ కౌన్సిల్ యొక్క ఓటరు జాబితాలో రిజిష్టర్ ఓటరు అయి ఉండాలి. వారి యొక్క వయసు 21 సం. తక్కువ కాకుండా ఉండాలి. వారు అల్ప సంఖ్యాక వర్గములకు చెందిన వారై ఉండాలి. పోచంపల్లి పురపాలక సంఘ పరిధిలోని అభ్యర్థులు వారి వారి దరఖాస్తులతో పాటు పై సూచించిన అర్హతలకు సంబంధించిన రుజువు పత్రములను జతపరచి ఈనెల21,సాయంత్రం గం. 4ల లోగా కార్యాలయంలో సమర్పించాలని తెలిపారు.

## ప్రజల భాగస్వామ్యంతో రోడ్డు ప్రమాదాలు తగ్గించడమే లక్ష్యం

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి** : ప్రజల భాగస్వామ్యంతో రోడ్డు ప్రమాదాలు మరణాలను గణనీయంగా తగ్గించడమే లక్ష్యంగా పోలీస్ యంత్రాంగం పని చేస్తుందని పోచంపల్లి సీఐ చౌటుప్పల్ రాములు స్పష్టం చేశారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా సోమవారం అరైవ్ అలైవ్ రోడ్ సేఫ్టీ కార్యక్రమం 18 వరకు నిర్వహించబడుతుందని తెలిపారు. గ్రామ స్థాయిలో రోడ్ సేఫ్టీ కమిటీ ఏర్పాటు చేసి, ఇందులో సభ్యులుగా 8 నుండి 9 మందిని(3 మహిళలు), గ్రామ సర్పంచ్, కౌన్సిలర్లు, వార్డు మెంబర్లు ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు రోడ్ సేఫ్టీపై ప్రమాణం చేయించారు. రోడ్లలో గుంతలు పూడ్చడం పాడుబడిన బావులు మూయడం వీధి లైట్‌లు, చెట్లు/పొదలు తొలగించడం, ఇతర శాఖల భాగస్వామ్యంతో రోడ్ సేఫ్టీ ప్రచారం కోసం వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేయడం పూర్తి అవగాహన కల్పించడం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆయన ఎస్సై భాస్కర్ రెడ్డితో కలిసి ప్రజలకు అవగాహన కల్పించారు.

## ప్రమాదాల నివారణలో భాగస్వాములవ్వాలి




**ప్రజాపక్షం/హాలియా:** రోడ్డు ప్రమాదాల నివారణలో అందరూ భాగస్వాములు కావాలని హాలియా ఎస్ఐ బండి సాయి ప్రశాంత్ పిలుపునిచ్చారు. 99 రోజుల ప్రణాళికలో భాగంగా నల్గొండ జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా సోమవారం కొత్తపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన అవగాహన సమావేశంలో పలువురు వక్తలు మాట్లాడారు. హాలియా ఎస్ఐ సాయి ప్రశాంత్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రమాదాల నివారణకు చేపట్టాల్సిన చర్యల గురించి జిల్లా ఎస్పీ సూచించిన సూచనలను వివరించారు. ప్రమాదాలు జరగడానికి గల కారణాలను ఆయన వివరిస్తూ ప్రజలు రహదారులపై ధాన్యాన్ని ఆరబోయడం వలన రాత్రి వేళలు పలు ప్రమాదాలు జరుగుతున్నాయని గుర్తు చేశారు. కొత్తపల్లి వద్ద నేషనల్ హైవే లో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని పలువురు వక్తలు ఈ సమావేశంలో జాతీయ రహదారి ఏఈ కి విన్నవించారు. దీనిపై ఆమె స్పందిస్తూ ఉన్నతాధికారులతో మాట్లాడి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బ్రహ్మానంద రెడ్డి, వార్డ్ మెంబర్లు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్‌కౌంటర్‌లో మహిళా మావోయిస్టు మృతి

## మృతురాలిపై రూ. 5 లక్షల రివార్డు



**కాంకేర్ :** ఛత్తీస్‌గఢ్‌లో మరోసారి ఎన్‌కౌంటర్ జరిగింది. కాంకేర్ జిల్లాలో సోమవారం భద్రతా సిబ్బందితో జరిగిన ఎదురు కాల్పుల్లో రూ. 5 లక్షల రివార్డు ఉన్న ఒక మహిళా మావోయిస్టు మరణించినట్లు పోలీసులు తెలిపారు. మృతురాలిని రూ పిగా గుర్తించారు. ఆమె మావోయిస్టుల ఏరియా కమి టీ సభ్యురాలని, కాంకేర్‌తో సహా ఏడు జిల్లాలు ఉన్న ఛత్తీస్‌గఢ్ బస్తర్ ప్రాంతంలో చురుకుగా ఉన్న చివరి సీనియర్ తెలుగు కేడర్ ఆమెనే అని భావిస్తున్నట్లు వారు తెలిపారు. మార్చి 31న ఛత్తీస్‌గఢ్‌ను సాయుధ మావోయిస్టులు లేని రాష్ట్రంగా ప్రభుత్వం ప్రకటించిన 12 రోజుల తర్వాత ఈ ఘర్షణ జరిగింది. లొంగిపోయి పునరావాస ప్రయోజనాలను పొందాలని మావోయిస్టులకు ప్రభుత్వం నిరంతరం విజ్ఞప్తి చేస్తోందని, దీని ఫలితంగా ఇటీవలి నెలల్లో గణనీయ సంఖ్యలో మావోయిస్టులు తిరిగి ప్రధాన స్రవంతిలోకి వస్తున్నారని బస్తర్ రేంజ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్, సుందర్‌రాజ్ తెలిపారు. అయినప్పటికీ, రూపితో సహా కొందరు కేడర్లు హింసా మార్గంలోనే కొనసాగారని, ఇది చివరికి ఇలాంటి పరిణామాలకు దారితీసిందని ఆయన పేర్కొన్నారు. ఛోటేబెతియా-పార్తాపూర్ పోలీస్ స్టేషన్ల సరిహద్దులోని మచ్చపల్లి గ్రామానికి సమీపంలో ఉన్న అడవిలో, కేడర్ల ఉనికి గురించి అందిన నిర్దిష్ట నిఘా సమాచారం ఆధారంగా భద్రతా సిబ్బంది బృందం నక్సల్ వ్యతిరేక ఆపరేషన్ చేపట్టినప్పుడు, ఉదయం కాల్పులు జరిగాయని కాంకేర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ నిఖిల్ రాఖేచా తెలిపారు. కాల్పులు ఆగిపోయిన తర్వాత, సంఘటనా స్థలం నుండి రూపి మృతదేహంతో పాటు ఒక పిస్టల్, పేలుడు పదార్థాలు, ఇతర సామాగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. ఆ ప్రాంతంలో గాలింపు చర్యలు ఇంకా కొనసాగుతున్నాయని ఆయన అన్నారు. పోలీసుల ప్రకారం, రూపి గత సంవత్సరం మాన్‌పూర్-మొహ్లా-అంబరఘ్ చౌకీ జిల్లా ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మరణించిన దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడు విజయ్ రెడ్డి భార్య. శాంతియుత, గౌరవప్రదమైన జీవితాన్ని ఎంచుకోవడానికి వారికి పరిమిత సమయం మాత్రమే మిగిలి ఉందని పేర్కొంటూ, మిగిలిన మావోయిస్టు కేడర్లు హింసను విడనాడి ప్రధాన స్రవంతిలో తిరిగి చేరాలని ఐజీ సుందర్‌రాజ్ పి విజ్ఞప్తి చేశారు. తాజా చర్యతో, ఈ ఏడాది ఛత్తీస్‌గఢ్‌లో ఇప్పటివరకు జరిగిన వేర్వేరు ఎన్‌కౌంటర్లలో కనీసం 28 మంది మావోయిస్టులు హతమయ్యారు. గత సంవత్సరం, రాష్ట్రవ్యాప్తంగా జరిగిన ఎన్‌కౌంటర్లలో భద్రతా దళాలు 285 మంది మావోయిస్టులను హతమార్చాయి. దేశం నుండి వామపక్ష తీవ్రవాదాన్ని నిర్మూలించడానికి కేంద్రం మార్చి 31, 2026ను గడువుగా నిర్ణయించింది.

# అశ్రునయనాల మధ్య ఆశా భోస్లే అంత్యక్రియలు



**న్యూఢిల్లీ :** ప్రముఖ బాలీవుడ్ గాయని ఆశా భోస్లే అంత్యక్రియలు అభిమానుల అశ్రునయనాల మధ్య జరిగాయి. ఆశా భోస్లే ఆదివారం తుదిశ్వాస విడవగా సినీ ప్రముఖులు, అభిమానుల సందర్శనార్థం ఆమె పార్థివదేహాన్ని ముంబయిలోని నివాసంలో సోమవారం మధ్యాహ్నం వరకూ ఉంచారు. పలువురు ప్రముఖులు తరలివచ్చి ఆశా భోస్లేకు తుది వీడ్కోలు పలికారు. ప్రముఖ సంగీత దర్శకుడు ఎఆర్ రెహమాన్, క్రికెట్ దిగ్గజం సచిన్ తెందూల్కర్ అంజలి ఘటించారు. మహారాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, మాజీ సిఎం సుశీల్ కుమార్ షిండే, ఉపముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే, శివసేన ఉద్ధవ్ థాక్రే పార్టీ అధినేత ఉద్ధవ్ థాక్రే ఆశా భోస్లే పార్థీవ దేహం వద్ద నివాళులు అర్పించారు. అనంతరం ముంబయిలో ఆశా భోస్లే అంతిమయాత్ర నిర్వహించారు. తుది విడ్కోలు పలికేందుకు పలువురు ప్రముఖులతో భారీగా అభిమానులు తరలివచ్చారు. సాయంత్రం 4 గంటలకు శివాజీ పార్క్ శ్మశానవాటికలో ప్రభుత్వం లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. ఇదిలా ఉండగా, మహారాష్ట్ర ప్రభుత్వం ప్రముఖ గాయని ఆశా భోస్లే కలలు కన్న సంగీత సంస్థ నిర్మాణాన్ని ముందుకు తీసుకెళ్లనున్నట్లు ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ తెలిపారు. ఆశా భోస్లే ప్రతిపాదించిన సంగీత విద్యా సంస్థ నిర్మాణాన్ని ప్రభుత్వం త్వరలో ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటుందని చెప్పారు. రాష్ట్ర కేబినెట్ సమావేశంలో ఆమెకు ఘన నివాళులు అర్పించారు.

## మహిళా రిజర్వేషన్ చట్ట సవరణ

# దశాబ్దాల నిరీక్షణకు ముగింపు

### మహిళా కోటా చట్ట సవరణకు మూడు రోజుల పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు : ప్రధాని మోదీ

**న్యూఢిల్లీ :** 21వ శతాబ్దపు అత్యంత కీలకమైన నిర్ణయాలలో ఒకదానిని తీసుకునే అంచున భారతదేశం నిలిచి ఉందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. మహిళా రిజర్వేషన్ల చట్టాన్ని సవరించి 2029 నాటికి అమలు చేయడం ద్వారా దశాబ్దాల నిరీక్షణకు ముగింపు పలికేందుకు పార్లమెంటు సమావేశమవుతోందని ఆయన తెలిపారు. ఈనెల 16న ప్రారంభమయ్యే మూడు రోజుల ప్రత్యేక పార్లమెంటు సమావేశాలకు ముందు సోమవారం ఢిల్లీలో జరిగిన మహిళల సదస్సును ఉద్దేశించి మోదీ ప్రసంగించారు. 'నారీ శక్తి వందన్ అధినియం'కు చేసే సవరణలు గత తరం ఆశయాలను సాకారం చేస్తాయని, భవిష్యత్తు సంకల్పాలను నెరవేరుస్తాయని ఆయన పేర్కొన్నారు. పాలనలో మహిళల సేవలను కొనియాడుతూ, వారిలో చాలామంది మరింత కీలకమైన బాధ్యతలను స్వీకరించడానికి సిద్ధంగా, ఉత్సాహంగా ఉన్నారని ఆయన ఉద్ఘాటించారు. 'మన దేశ పార్లమెంటు ఒక కొత్త చరిత్రను సృష్టించే దిశగా అడుగులు వేస్తోంది. గత తరం ఆశయాలను సాకారం చేసే, భవిష్యత్తు సంకల్పాలను నెరవేర్చే ఒక కొత్త చరిత్ర అది. సమానత్వంతో కూడిన భారతదేశం కోసం, సామాజిక న్యాయం కేవలం ఒక నినాదంగా కాకుండా, మన పని సంస్కృతిలోనూ,



నిర్ణయాలు తీసుకునే ప్రక్రియలోనూ ఒక సహజ భాగంగా ఉండే భారతదేశం కోసం తీసుకున్న సంకల్పం ఇది' అని ఆయన అన్నారు. 2023లో ఈ చట్టాన్ని ప్రవేశపెట్టినప్పుడు అన్ని రాజకీయ పార్టీలు ఏకగ్రీవంగా ఆమోదించాయని, ముఖ్యంగా ప్రతిపక్షాల నుండి 2029 నాటికి దీనిని అమలు చేయాలనే సామూహిక డిమాండ్ వినిపించిందని కూడా ఆయన గుర్తుచేశారు. రాష్ట్ర శాసనసభల నుండి దేశ పార్లమెంటు వరకు దశాబ్దాల నిరీక్షణకు ముగింపు పలికే సమయం ఈనెల 16, 17, 18 తేదీలేనని ప్రధానమంత్రి తెలిపారు. ఈ తేదీలలోనే, చట్ట సవరణలను పరిశీలించి ఆమోదించేందుకుగాను బడ్జెట్ సమావేశాల పొడిగింపు షెడ్యూల్ చేయబడిందని ఆయన పేర్కొన్నారు. మహిళల భాగస్వామ్యం దేశ ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసేలా, 'నారీ శక్తి వందన్ అధినియం'ను సకాలంలో అమలు చేయాలని ప్రధానమంత్రి పేర్కొన్నారు. ఈ అంశంపై దేశవ్యాప్తంగా మహిళల్లో నెలకొన్న ఉత్సాహాన్ని ప్రస్తావిస్తూ, దేశవ్యాప్తంగా ఉన్న మహిళలు శాసనసభలు, లోక్‌సభలో స్థానం సంపాదించాలనే తమ ఆకాంక్షలను గట్టిగా వినిపిస్తున్నారని మోదీ అన్నారు. వారి కలలకు కొత్త రెక్కలు వచ్చాయని, దేశంలో ఒక సానుకూల వాతావరణం ఏర్పడిందని ఆయన పేర్కొన్నారు. 'రాష్ట్రపతి నుండి ప్రధానమంత్రి వరకు, మహిళలు ఏ స్థానంలో ఉన్నా సరే, వారు తమదైన ఒక ప్రత్యేక వారసత్వాన్ని సృష్టించుకున్నారు' అని ఆయన అన్నారు. 'నారీ శక్తి వందన అధినియమ్‌ను అమలు చేయడం అనేది అటువంటి మహిళలందరి జీవితాల్లో ఒక గొప్ప అవకాశంగా మారుతుంది. పంచాయతీ నుండి పార్లమెంటు వరకు వారి ప్రయాణం మరింత సులభతరం కాబోతోంది' అని ఆయన అన్నారు. పుట్టిన మొదటి శ్వాస నుండి చివరి శ్వాస వరకు, ప్రభుత్వం వివిధ పథకాలతో సోదరీమణులకు, కుమార్తెలకు సేవ చేయడానికి సిద్ధంగా ఉందని మోదీ తెలిపారు. '

## మహిళా రిజర్వేషన్ల చట్టానికి

# కాంగ్రెస్ వ్యతిరేకం కాదు

### 15న తమ పార్టీ ఆధ్వర్యంలో అఖిలపక్ష భేటీ
### ఈ బిల్లుపై సమగ్ర సంప్రదింపులకు కేంద్రం సిద్ధంగా లేదు : ఖర్గే



**న్యూఢిల్లీ :** మహిళా రిజర్వేషన్ల చట్టం గురించి చర్చించేందుకు ఏప్రిల్ 15న తమ పార్టీ ఒక అఖిలపక్ష సమావేశం నిర్వహిస్తుందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తెలిపారు. ఈ బిల్లుపై సంబంధిత వర్గాలన్నింటితోనూ సమగ్ర సంప్రదింపులు జరపడానికి కేం ద్ర ప్రభుత్వం సిద్ధంగా లేదని ఆరోపించారు. మహిళా రిజర్వేషన్ల చట్టానికి కా ంగ్రెస్ పార్టీ పూర్తి మద్దతు ఇస్తుందని స్పష్టం చేశారు. అయితే జాతీయ స్థా యిలో దీని ప్రభావం విస్తృతంగా ఉన్నందున, మహిళా రిజర్వేషన్ల చట్టం అమలుపై విస్తృత చర్చలు జరగాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. మ హిళా రిజర్వేషన్ల చట్టానికి తమ పార్టీ వ్యతిరేకం కాదని వెల్లడించారు. కర్ణాటకలోని బెంగళూరులో విలేకరులతో మాట్లాడుతూ ఖర్గే ఈ వ్యాఖ్యలు చేశారు. 'మహిళా రిజర్వేషన్ల చట్టంపై చర్చించేందుకు కేంద్రం అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేస్తే కాంగ్రెస్ పార్టీ పాల్గొంటుంది. తగు సూచనలను అందిస్తుంది. కా నీ కేంద్రం అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయడానికి సిద్ధంగా లేదు. అoదుకే మేము ఏప్రిల్ 15న అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహిస్తున్నాం. మహిళా రిజర్వేషన్లకు కాంగ్రెస్ ఎల్లప్పుడూ మద్దతు ఇస్తూనే ఉంది. మహిళా రిజర్వేషన్ల చ ట్టాన్ని వ్యతిరేకిస్తున్నామని చేస్తున్న ఆరోపణలు అవాస్తవం. అంతేకాకుండా నా రీ శక్తి వందన్ అధినియంకు మేం వ్యతిరేకం కాదు. పార్లమెంట్‌లో ఇది ఏకగ్రీవంగా ఆమోదించిన చట్టం. మోదీ సర్కార్ కేవలం ఈ చట్టం ద్వారా రాజకీయ లబ్ధి పొందడానికి ప్రయత్నిస్తోంది. మేము ఇప్పటికే పంచాయతీలు, జిల్లా పరిషత్తులు, కార్పొరేషన్లలో ఈ చట్టాన్ని దీనిని అమలు చేశాము. కాబట్టి మాకు ఎ వరూ నీతులు చెప్పాల్సిన అవసరం లేదు. దేశానికి సంబంధించిన ఒక నిర్ణయం తీసుకున్నప్పుడు, దానికి విస్తృతమైన పర్యవసానాలు ఉంటాయి' అని ఖర్గే పేర్కొన్నారు.

# లాలూకు సుప్రీంలో చుక్కెదురు...

### వ్యక్తిగత హాజరు నుంచి మాత్రం మినహాయింపు



**న్యూఢిల్లీ :** భూములు తీసుకుని ఉద్యోగాలు ఇచ్చారనే కేసులో ఆర్‌జెడి చీఫ్ లాలూ ప్రసాద్ యాదవ్‌కు సుప్రీంకోర్టులో నిరాశ ఎదురైంది. తనపై, తన కుటుంబ సభ్యులపై సిబిఐ నమోదు చేసిన ఎఫ్‌ఐఆర్‌ను కొట్టివేయాలంటూ లాలూ వేసిన పిటిషన్‌ను అత్యున్నత న్యాయస్థానం సోమవారం నాడు తోసిపుచ్చింది. జస్టిస్ ఎంఎం సుందరేశ్, జస్టిస్ ఎన్.కోటేశ్వర సింగ్‌తో కూడిన ధర్మాసనం ఈ మేరకు తీర్పునిచ్చింది. కేసులో మెరిట్స్‌ను పరిశీలించే అధికారాన్ని ట్రయిల్ కోర్టుకే విడిచిపెడుతూ, చట్టప్రకారం విచారణ కొనసాగించవచ్చని ధర్మాసనం పేర్కొంది. అయితే ట్రయల్ కోర్టు విచారణకు వ్యక్తిగత హాజరు నుంచి లాలూకు మినహాయింపు ఇచ్చింది. ఈకేసులో ఇంతకుముందు లాలూ ప్రసాద్‌కు హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. సిబిఐ తమపై నమోదు చేసిన ఎఫ్‌ఐఆర్‌ను కొట్టివేయాలంటూ లాలూ వేసిన పిటిషన్‌ను హైకోర్టు తోసిపుచ్చింది. పిటిషన్‌లో ఎలాంటి మెరిట్ లేదని కోర్టు పేర్కొంది. ఈ నిర్ణయాన్ని లాలూ సుప్రీంకోర్టులో సవాలు చేశారు. దీనిపైనే సుప్రీం తాజా తీర్పు చెప్పింది. లాలూ ప్రసాద్ యాదవ్ 2004-2009 మధ్య కేంద్ర రైల్వే మంత్రిగా ఉన్నప్పుడు ఉద్యోగాల కేటాయింపులో అవినీతి ఆరోపణలు వచ్చాయి. ఆ సమయంలో రైల్వేలోని వివిధ జోన్లలో అనేక మందిని గ్రూప్‌డి పోస్టుల్లో నియమించారు. దీనికి బదులుగా వారి భూములను లాలూ ప్రసాద్ కుటుంబ సభ్యులతో పాటు ఒక ప్రైవేటు కంపెనీకి బదిలీ చేశారని సిబిఐ ఆరోపణగా ఉంది. 2022 మే 18న లాలూ, ఆయన భార్య, ఇద్దరు కుమార్తెలు, గుర్తు తెలియని ప్రభుత్వ అధికారులు, ప్రైవేటు వ్యక్తులపై కేసు నమోదైంది. 77 ఏళ్ల లాలూ, ఇతర నిందితులు ప్రస్తుతం బెయిలుపై ఉన్నారు. కాగా, సిబిఐ తనపై నమోదు చేసిన ఎఫ్‌ఐఆర్, ఇన్వెస్టిగేషన్, చార్జిషీట్లలో చట్టపరమైన లోపాలున్నాయని లాలూ వాదనగా ఉంది. ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 17ఏ కింద సిబిఐ ముందస్తు అనుమతి తీసుకోలేదని, ఇందువల్ల సిబిఐ ప్రొసీడింగ్స్ చెల్లనేరవని లాలూ వాదించారు. అయితే ఈ వాదనను తాజాగా సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. దీంతో ఈ కేసులో లాలూ కుటుంబానికి న్యాయపరంగా మరిన్ని చిక్కులు తప్పేలాలేవు.

## కనీస మద్దతు ధర పిటిషన్‌పై...

# కేంద్రం, ఇతరుల నుంచి స్పందనలు కోరిన 'సుప్రీం'

- గత ఐదేళ్లలో ఒక్క మహారాష్ట్రలోనే 17,000 మందికి పైగా రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని పిటిషన్ వెల్లడి
- పిటిషనర్ల తరపున వాదనలు వినిపించిన న్యాయవాది ప్రశాంత్‌భూషణ్

**న్యూఢిల్లీ :** కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి)ను నిర్ణయించేటప్పుడు సాగుకు అయ్యే కచ్చితమైన ఖర్చుపై రాష్ట్రాల ప్రతిపాదనను పరిగణనలోనికి తీసుకోవాలంటూ దాఖలైన పిటిషన్‌పై మంగళవారం సుప్రీంకోర్టు కేంద్రం, ఇతరుల నుంచి స్పందనలను కోరింది.ప్రధానన్యాయమూర్తి సూర్యకాంత్, జస్టిస్ జాయ్‌మాల్యా బాగ్చిలతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌ను విచారించడానికి అంగీకరించింది. దానిపై స్పందన కోరుతూ కేంద్రానికి, విదేశీ వాణిజ్య, వ్యవసాయ వ్యయాలు, ధరల కమిషన్ డైరెక్టరేట్ జనరల్‌కు నోటీసులు జారీ చేసింది. పిటిషనర్ల తరపున హాజరైన న్యాయవాది ప్రశాంత్ భూషణ్ ఈ పిటిషన్ దేశంలోని రైతులకు సంబంధించిన చాలా ముఖ్యమైన సమస్యను లేవనెత్తుతుందని ధర్మాసనానికి తెలిపారు. భారతీయ రైతులు తమ పంటను అసలు ధరకు కూడా అమ్ముకోలేక తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారని, ఇది రైతులు పెద్ద యెత్తున ఆత్మహత్యలకు దారితీసిందని, ఒక్క మహారాష్ట్రలోనే గత ఐదేళ్లుగా 17,000 మందికి పైగా రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని పిటిషన్‌లో పేర్కొన్నారు. కనీస మద్దతు ధర సాగు ఖర్చుకు సమానంగా లేదా అంతకంటే తక్కువగా ఉందని తన వాదనల సందర్భంగా ప్రశాంత్ భూషణ్ అన్నారు. పిటిషన్‌లో చాలా గణిత సూత్రాలను ఉదహరించడం వల్ల రాష్ట్రాల వారీగా మారే ఖర్చులు, మూలధనం విషయంలో ఇబ్బంది తలెత్తవచ్చని ధర్మాసనం గమనించింది. ఈ లెక్కలను ప్రభుత్వం చేసిందని ప్రశాంత్ భూషణ్ ధర్మాసనానికి చెప్పారు. 'మీరు మమ్మల్ని ఆర్థిక విధానాన్ని తిరిగి రాయమని అడుగుతున్నారు' అని ధర్మాసనం వ్యాఖ్యానించింది.పెద్ద మొత్తంలో భూమి ఉన్న రైతులు కూడా ఉన్నందున, బహుశా అందరికీ ఒకే విధమైన విధానం ఉండటం సాధ్యం కాదని ధర్మాసనం పేర్కొంది. కాగా ధర్మాసనం పిటిషన్‌ను విచారించడానికి అంగీకరించినప్పటికీ దానిపై ఎటువంటి ఉత్తర్వు జారీచేయలేదు. ప్రభుత్వం దాని సంస్థలు రాష్ట్రాల వారీగా వివిధ వ్యవసాయ ఉత్పత్తులు సహా ఉత్పత్తిని లెక్కిస్తాయని అది పేర్కొంది. దేశంలో వ్యవసాయాన్ని లాభదాయకంగా మార్చేందుకు రైతులకు వారి ఖర్చుతో పాటు అదనంగా 50శాతం చెల్లించాలని, 2006 నాటి ఎం.ఎస్.స్వామినాథన్ కమిషన్ నివేదిక సిఫార్సు చేసిందని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ సిఫార్సును ప్రభుత్వం ఎన్నడూ ప్రశ్నించలేదని కూడా పిటిషనర్ తెలిపారు. ప్రభుత్వం ఏటా పంటల వారీగా నిర్ణయిస్తున్న కనీస మద్దతు ధర ఉత్పత్తి సగటు వ్యయం కంటే గణనీయంగా తక్కువగా ఉందని పిటిషన్ తెలిపింది. సాగుకు అయ్యే కచ్చితమైన ఖర్చు ఆధారంగా లెక్కించిన ఎంఎస్‌పి కింద నోటిఫైడ్ పంటల పూర్తి సేకరణను నిర్ధారించాలని అధికారులను ఆదేశించాలని కోరింది. దేశవ్యాప్తంగా ప్రతీ తహసీల్, బ్లాక్, గ్రామం, జిల్లాలో సమర్థవంతమైన, అందుబాటులో ఉండే క్రియాశీలమైన సేకరణ కేంద్రాలను ఏర్పాటు చేయాలని, అలాగే సమర్థవంతమైన సేకరణను కేవలం ఎంపిక చేసిన పంటలకు లేదా ప్రాంతాలకు మాత్రమే పరిమితం చేయకుండా ఎంఎస్‌పి విధానం కింద నోటిఫై చేయబడిన అన్ని పంటల సేకరణకు హామీ ఇచ్చేలా పారదర్శకమైన, ఏకరీతి సేకరణ యంత్రాంగాన్ని అమలు చేయాలని కూడా ఈ పిటిషన్‌లో కోరారు. సాగు ఖర్చుల వసూలును నిర్ధారించడంలో ఎంఎస్‌పి చట్రం నిరంతరం విఫలం అవుతోందని, తత్ఫలితంగా వ్యవసాయంలో అసమతౌల్యం ఏర్పడుతోందని ఆరోపిస్తూ, రైతులకు చెల్లించాల్సిన బకాయిలను అన్నింటినీ మాఫీ చేయాలని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు ఆదేశాలు జారీచేయాలని కూడా పిటిషనర్లు కోర్టును అభ్యర్థించారు.



# ఢిల్లీ బలగాలతో బిజెపి గెలుపు అసాధ్యం

### నన్ను ఎదుర్కొనేందుకు 19 రాష్ట్రాలు, కేంద్రం ఏకమయ్యాయ్
### పశ్చిమబెంగాల్ సిఎం మమతా బెనర్జీ

**సూరి/గల్సి :** తనను ఎదుర్కోవడానికి 19 రాష్ట్రాలు, కేంద్రం ఏకమయ్యాయని, తాను సామాన్య ప్రజల కోసం ఒంటరిగా పోరాడుతున్నానని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సోమవారం పేర్కొన్నారు. బీర్‌భూమ్ జిల్లాలోని సూరిలో సోమవారం జరిగిన ఒక ర్యాలీలో ప్రసంగిస్తూ, ఢిల్లీ బలగాలతో బిజెపి పశ్చిమ బెంగాల్ ఎన్నికల్లో గెలవలేదని టిఎంసి అధినేత్రి అన్నారు. పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో తృణమూల్ కాంగ్రెస్ 226కు పైగా సీట్లు కైవసం చేసుకుంటుందని ఆమె దీమా వ్యక్తం చేశారు. యువతను ప్రభావితం చేసేందుకే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 'మన్ కీ బాత్' కార్యక్రమాన్ని ప్రసారం చేస్తున్నారని కూడా బెనర్జీ ఆరోపించారు. వారు (బిజెపి) డబ్బు పంచిపెడుతున్నారు... ఎవరూ పట్టుకోకుండా ఉండేందుకు అధికారులు, పోలీసులతో సహా అందరినీ ఇతర రాష్ట్రాలకు బదిలీ చేశారు. పశ్చిమ బెంగాల్‌లోకి డబ్బు, మత్తుపదార్థాలు, ఆయుధాలు, ఓటర్లను అక్రమంగా తరలిస్తున్నారు. బిహార్ నుండి ఓటర్లను రైళ్లు, బస్సుల్లో తీసుకువచ్చి ఓటు వేయిస్తున్నారు. మొత్తం 19 రాష్ట్రాలు, కేంద్ర ప్రభుత్వం నాకు వ్యతిరేకంగా ఏకమయ్యాయి... వారికి నేను ఒక్కరినే చాలు. నేను ఒంటరినని అనుకోవడం లేదు కాబట్టి సామాన్య ప్రజల కోసం నా పోరాటాన్ని కొనసాగిస్తాను. నాకు ప్రజల ఆశీస్సులు ఉన్నాయి' అని ఆమె అన్నారు. అన్ని స్థానాల్లోనూ తానే అభ్యర్థినని మోదీ చేసిన వ్యాఖ్యకు ప్రతిస్పందనగా ఆయనకు పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి కావాలనుకుంటున్నారా అని ప్రశ్నిస్తూ టిఎంసి అధినేత్రి ఎద్దేవా చేశారు. 294 అసెంబ్లీ స్థానాలన్నింటిలోనూ తానే అభ్యర్థినని మోదీ చేసిన ప్రకటన, 2021 నుంచి ఎన్నికల ప్రచారాల్లో తాను పదేపదే చెబుతున్న విషయాన్నే ప్రతిబింబిస్తోందని బెనర్జీ అన్నారు. ఆదివారం సిలిగురిలో జరిగిన ఒక ర్యాలీలో ప్రసంగిస్తూ, పశ్చిమ బెంగాల్‌లోని 'అన్ని నియోజకవర్గాల్లోనూ తానే బిజెపి అభ్యర్థినని' ప్రధాని అన్నారు. 'మోదీజీ తానే 294 స్థానాల్లో అభ్యర్థినని చెబితే, ఆయన ప్రధాన మంత్రి పదవికి రాజీనామా చేసి, పశ్చిమ బెంగాల్



ముఖ్యమంత్రి కావాలనుకుంటున్నానని చెప్పాలి. అన్ని నియోజకవర్గాల్లోనూ ఓట్లు అడగనివ్వండి' అని ఆమె అన్నారు. ముందు, మీరు దేశానికి ప్రధానమంత్రి కావాలనుకుంటున్నారా లేక పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి కావాలనుకుంటున్నారా అని నిర్ణయించుకోండని సూచించారు. మీరు ఇక్కడ బయటి వ్యక్తి, ముందు ఢిల్లీని చక్కదిద్దండి, ఆ తర్వాతే పశ్చిమ బెంగాల్ గురించి ఆలోచించండి అని చురకలంటించారు. ఉద్యోగ కల్పన హామీలపై మోదీపై విమర్శలు గుప్పిస్తూ, రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామన్న మీ పాత హామీ ఏమైంది? అని బెనర్జీ ప్రశ్నించారు. మోదీ 'మన్ కీ బాత్' కార్యక్రమాన్ని కూడా టిఎంసి అధినేత్రి విమర్శించారు. పిల్లలను ప్రభావితం చేయడానికి దీనిని వాడుకుంటున్నారని ఆమె ఆరోపించారు. పశ్చిమ బెంగాల్‌లో బుల్డోజర్లు దూసుకొస్తాయని ఆదివారం నాడు ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ, తమ ప్రభుత్వం అటువంటి విధానాన్ని కాకుండా ప్రేమ ఆధారిత విధానాన్ని విశ్వసిస్తుందని బెనర్జీ ఎదురుదాడి చేశారు. 'మేము బుల్డోజర్ విధానాన్ని విశ్వసించము. మేము ప్రేమ విధానాన్ని విశ్వసిస్తాము' అని ఆమె అన్నారు. బిజెపి నుంచి డబ్బులు తీసుకోవడం భవిష్యత్తులో చట్టపరమైన చిక్కులకు దారితీయవచ్చని బెనర్జీ ప్రజలను హెచ్చరించారు. బొగ్గు, పోర్టు కార్యకలాపాలకు సంబంధించిన అవినీతిపై బిజెపి నాయకులను నిందిస్తూ, ఆ పార్టీ 'ఛార్జ్ షీట్' ప్రచారాన్ని బెనర్జీ తీవ్రంగా విమర్శించారు. అదే సమయంలో తృణమూల్ కాంగ్రెస్‌ను లక్ష్యంగా చేసుకోవద్దని ఆ పార్టీని హెచ్చరించారు.

# మూడు రాష్ట్రాల్లో రోడ్డు ప్రమాదాలు

**న్యూఢిల్లీ :**సోమవారం మహారాష్ట్ర, ఉత్తర్‌ప్రదేశ్, గుజరాత్ రాష్ట్రాల్లో జరిగిన రోడ్డుప్రమాదాల్లో 24 మంది మృతిచెందారు, 13 మంది గాయపడ్డారు. పోలీసుల వివరాల ప్రకారం మహారాష్ట్ర, థాణే జిల్లాలోని గోవిలి గ్రామం రైతా బ్రిడ్జి దగ్గర వ్యాన్, సిమెంట్ మిక్సర్ లారీ ఢీకొన్న ఘటనలో 11 మంది మృతిచెందగా, ఇద్దరు గాయపడ్డారు.వ్యాన్ మురాబాద్ నుంచి కల్యాణ్‌కు వెళ్తుండగా ఎదురుగా వస్తున్న సిమెంట్ మిక్సర్ లారీని ఢీకొట్టడంతో ఘటన జరిగినట్లు పోలీసులు తెలిపారు. మృతుల్లో 8మంది పురుషులు, ముగ్గురు మహిళలు ఉన్నారన్నారు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని హర్పూర్ జిల్లాలో బస్సు, ట్రక్కు ఢీకొన్న ఘటనలో ఆరుగురు మృతిచెందగా, ఏడుగురు గాయపడ్డారు. వివాహ వేడుకకు వెళ్లి తిరిగి వస్తుండగా ఘటన జరిగినట్లు పోలీసులు వెల్లడించారు. ప్రమాదంలో పెళ్లికొడుకు తండ్రి కూడా మరణించాడు.అలాగే గుజరాత్‌లోని సురేంద్రనగర్ జిల్లాలో జరిగిన మరో ఘటనలో ఏడుగురు మృతిచెందగా, నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. పత్తి లోడుతో వెళ్తున్న ట్రక్కు అదుపుతప్పి, రాజ్‌కోట్ నుంచి బహుచరాజికి నడుచుకుంటూ వెళ్తున్న యాత్రికుల బృందాన్ని ఢీకొట్టడంతో ప్రమాదం జరిగింది. 500 మంది యాత్రికుల బృందం చరాద్ గ్రామం నుంచి బయలుదేరారని, భాస్కరపరా గ్రామం ఆగినప్పుడు ప్రమాదం జరిగినట్లు తెలిపారు.

## ప్రత్యేక పార్లమెంట్ సమావేశానికి...

# లోక్‌సభ పార్టీ ఎంపీలందరూ హాజరుకావాలి

### కాంగ్రెస్ విప్ జారీ

**న్యూఢిల్లీ :** మహిళా రిజర్వేషన్ చట్టానికి సవరణలను ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న పార్లమెంట్ ప్రత్యేక సమావేశానికి లోక్‌సభ పార్టీ ఎంపీలు అందరూ సభకు హాజరుకావాలని సోమవారం కాంగ్రెస్ విప్ జారీచేసింది. గురువారం, శుక్రవారం, శనివారం సభలో కొన్ని చాలా ముఖ్యమైన అంశాలను చర్చకు, ఓటింగ్ చేపట్టనున్నట్లు కాంగ్రెస్ తన లోక్‌సభ ఎంపీలు అందరికీ తెలియజేసింది. 'లోక్‌సభలోని పార్టీ ఎంపీలందరూ ఏప్రిల్ 16 (గురువారం), 17 (శుక్రవారం), 18 (శనివారం) తేదీలలో ఉదయం 11గంటల నుంచి సభ వాయిదా పడేవరకూ తప్పనిసరిగా సభలో హాజరై పార్టీ వైఖరికి మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తున్నాం' అని పార్టీ తెలిపింది. 'దీనిని అత్యంత ముఖ్యమైనదిగా పరిగణించవచ్చు' అని పార్టీ జారీచేసిన మూడులైన్ల విప్‌లో తెలిపింది. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలను పొడిగించారు. ఏప్రిల్ 16 నుంచి 18 తేదీల మధ్య మూడు రోజుల పాటు సభ ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు.'నారీ శక్తి వందన అధినియమ్' కు సవరణలను 2029లో అమలు చేసేందుకు తీసుకురానున్నారు.

## పోలింగ్ కేంద్రాల్లో వేలిముద్ర, ఐరిస్ బయోమెట్రీ అమలు విజ్ఞప్తిపై...

# కేంద్రం, ఇసికి 'సుప్రీం' నోటీసులు

### పిటిషన్ విచారణకు ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ బెంచ్ అంగీకారం
### ప్రస్తుత రాష్ట్ర శాసనసభ ఎన్నికలకు ఈ విధానాన్ని వర్తింపచేయలేమని స్పష్టీకరణ

**న్యూఢిల్లీ:** డూప్లికేట్ ఓటింగ్‌ను నివారించడానికి పోలింగ్ కేంద్రాలలో వేలిముద్ర, ఐరిస్ బయోమెట్రిక్ వ్యవస్థను అమలు చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై సోమవారం సుప్రీంకోర్టు కేంద్రం, ఎన్నికల స ంఘం, ఇతరుల నుంచి స్పందనను కోరింది. ఈ పిటిషన్‌ను విచారించడానికి అంగీకరిస్తూ ప్రధాన న్యా యమూర్తి సూర్యకాంత్ జస్టిస్ జాయ్‌మాల్యా బాగ్చిలతో కూడిన ధర్మాసనం పిటిషన్‌లో కోరిన విధానాన్ని కొన్ని రాష్ట్రాలలో ప్రస్తుత రాష్ట్ర శాసనసభ ఎన్నికలకు పరిగణించలేమని స్పష్టం చేసింది. 'అయితే త దుపరి పార్లమెంట్ ఎన్నికలు లేదా రాష్ట్ర శాసనసభ ఎ న్నికలకు ముందు అటువంటి చర్య తీసుకోవడం స ముచితమేనా అనేది పరిశీలించాలి. నోటీసు జారీచేయండి అని బెంచ్ ఆదేశించింది. అశ్వినికుమార్ ఉ పాధ్యాయ్ దాఖలు చేసిన పిటిషన్‌పై స్పందన కోరుతూ కేంద్రానికి, ఎన్నికల సంఘానికి, పలు ఇతర రాష్ట్రాలకు అత్యున్నత న్యాయస్థానం నోటీసులు జారీచేసింది. స్వయంగా హాజరైన అశ్వినికుమార్ ఉపాధ్యాయ్ పిటిషన్‌లో కోరిన ప్రార్థన, లంచగొండితనా న్ని, ప్రాక్సీ ఓటింగ్‌ను నిరోధిస్తుందని ధర్మాసనానికి తెలిపారు. దీనికి నిబంధనలలోని పెద్ద మార్పులు అ వసరం అవుతాయని, అంతేకాకుండా భారీ ఆర్థిక భా రం పడుతుందని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఓ టరు గుర్తింపును బలోపేతం చేయడానికి, లంచగొండితనం, అక్రమ ఓటింగ్, నకిలీ, దొంగ ఓటింగ్‌లను నిర్మూలించడానికి ఎన్నికల సంఘం తన సంపూర్ణ అ ధికారమైన 324 ఆర్టికల్‌ను ఉపయోగించి వేలిము ద్ర, ఐరిస్ ఆధారిత బయోమెట్రిక్ ధృవీకరణను అమ లు చేయవచ్చని పిటిషన్‌లో పేర్కొన్నారు. విచారణ సందర్భంగా తాను ఐదు రాష్ట్రాలలో రాష్ట్ర శాసనసభ లో సభ్యుడిగా లేనని ఉపాధ్యాయ్ తెలిపారు. ఎన్నికలలో పోలింగ్ బూత్‌ల వద్ద వేలిముద్ర, కంటి పాప ( ఐరిస్) బయోమెట్రిక్ ధృవీకరణను అమలు చేయడం ద్వారా నిజమైన, సక్రమంగా నమోదు చేసుకున్న ఓటర్లు మాత్రమే తమ ఓట్లను వేయడానికి అనుమతించబడతారని నిర్ధారించవచ్చని పిటిషన్‌లో పేర్కొన్నారు. 'లంచం, అనుచిత ప్రభావం, ఒకరికి బదులు మరొకరు ఫోటోలు మార్చిడి, డూప్లికేట్ ఓటింగ్, దొంగ ఓట్ల వంటివి ఇప్పటికే పౌరులను ప్రభావితం చేస్తున్నందున ఎన్నికల ప్రక్రియ, స్వచ్ఛత, సమగ్రతకు కలిగే నష్టం అత్యంత తీవ్రమైనది' అని పిటిషన్ సమర్పించింది. ప్రస్తుతం ఓటరు గుర్తింపు అనేది ఐడి కార్డు, మాన్యువల్ వెరిఫికేషన్ ద్వావరా జరుగుతోందని, ఇవి కాలం చెల్లిన ఫోటోలు, గుమస్తా పొరపాట్లు, రియల్ టైమ్ సమాచారం లేకపోవడం వంటి వాటికి గురయ్యే అవకాశం ఉందని అది పేర్కొంది. 'ఇది ఒకే వ్యక్తిగా నటి స్తూ ఓటు వేయడానికి లేదా అనధికార వ్యక్తుల ద్వా రా బహుళ ఓటింగ్‌లకు ఆస్కారం కల్పిస్తుంది. ప్రతీ వ్యక్తికీ ప్రత్యేకంగా ఉండే వేలిముద్ర, కనుపాప ఆధారిత ప్రామాణీకరణ, నకిలీ ఓటింగ్‌లను /దొంగ ఓటింగ్‌లను తొలగించి 'ఆన్ ఓట్' నిబంధనలను కచ్చితంగా పాటించేలా చేస్తుంది' అని పిటిషన్ తెలిపింది. జనాభాలో గణనీయమైన భాగం వలస వెళ్లడం వల్ల నియోజకవర్గాల ఓటర్ల జాబితాలో తరుచూ వ్యత్యాసాలు ఏర్పడుతున్నాయని పిటిషన్‌లో పేర్కొన్నారు.

**పాసుబుక్ పోయినది**

హనుమకొండ జిల్లా, వేలేరు మండలం, కన్నారం గ్రామానికి చెందిన **సందెబోయిన లచ్చమ్మ భర్త కొమురయ్య**కు సంబంధించిన తెలంగాణ పట్టాదారు పాస్ బుక్ పోయినది. తెలంగాణ పట్టాదారు **పాసు బుక్కు ఖాతా నెంబర్ : 398,** పట్టా పాసు బుక్ నెం. **T21100020232** నెంబర్ గల సంబంధిత పట్టాదారు ఫిబ్రవరి నెలలో కన్నారం నుండి హనుమకొండ కు బస్ లో ప్రయాణం చేయుచుండగా పోయినది, ఇట్టి పట్టాదారు పాసు బుక్కు దొరికినవారు ఈ క్రింది చిరునామాకు అందించగలరు.

ఇట్లు
**సందెబోయిన లచ్చమ్మ,**
**భర్త : కొమురయ్య ,**
ఇంటి నెంబర్ : 2-33,
గ్రామం : కన్నారం,
మండలం : వేలేరు,
జిల్లా : హనుమకొండ,
పిన్ నెం : 505471.
**ఫోన్ నెంబర్ : 9701006631**

ప్రజాపక్షం
Telugu National Daily

ఖమ్మం
మంగళవారం
14-04-2026
www.prajapaksham.in

ఎడిట్
PEOPLE'S VIEWS

# శాంతిమార్గం విడనాడితే మిగిలేది వినాశమే!

పాకిస్థాన్ మధ్యవర్తిగా ఇస్లామాబాద్‌లో అమెరికా – ఇరాన్ ప్రతినిధుల మధ్య ఏకబిగిన 21గంటలపాటు జరిగిన చర్చలు ఒప్పందం లేకుండా ముగిసినప్పటికీ వాటి ప్రాధాన్యత వాటికుంది. 38 రోజులపాటు హోరాహోరీ గగనతల మిస్సైలీ, డ్రోన్ బాంబుల యుద్ధం తర్వాత కాల్పుల విరమణ ప్రకటించిన వెనువెంటనే చర్చలు జరగటమే విశేషం. అంతేగాక, 1979లో ఇరానియన్ ఇస్లామిక్ విప్లవం తర్వాత అమెరికా–ఇరాన్ ముఖ్య నాయకుల మధ్య ముఖాముఖీ చర్చలు ఇదే ప్రథమం అని గుర్తుచేసుకున్నప్పుడు వాటి ప్రాధాన్యత స్పష్టం. అధ్యక్షుడు ట్రంప్ రెండు వారాలపాటు కాల్పుల విరమణ ప్రకటనకు ముందు చేసిన భీకర ప్రకటనలు ఎట్టి ఉపద్రవానికి దారితీస్తాయో అని ప్రపంచదేశాలు తీవ్రంగా కలతపడిన నేపథ్యం కూడా గుర్తు చేసుకోదగింది. పాకిస్థాన్ ద్వారా ప్రతిపాదించబడిన శాంతి చర్చల ప్రతిపాదనను ట్రంప్ అంగీకరించటంతో ప్రపంచం ఊపిరిపీల్చుకున్నా, ఆ అంగీకారం ఆయనకు పరాజయంతో సమానం. పాకిస్థాన్ వంటి అప్రధాన దేశం మధ్యవర్తిత్వం ఏమిటి? ప్రపంచదేశాల నుంచి ట్రంప్ అంతగా ఏకాకి అయినట్లు ఇది చెప్పకనే చెబుతున్నది. గతంలో ఇరాక్, అఫ్ఘానిస్థాన్‌లపై దురాక్రమణ యుద్ధాల సందర్భంలోలాగా అమెరికా సైన్యాలు దిగగానే నాటో సైన్యాలు ఇప్పుడు అనుసరించలేదు. యూరప్ రాజ్యాలను 'పిరికి పందలు' అని దూషించినా, హెచ్చరించినా నాటోలో చలనం లేదు. గల్ఫ్‌లోని మిగతా అరబ్ రాజ్యాలు, ఇస్లామిక్ రాజ్యాలు అమెరికా తొత్తులుగా ఉన్నందున, వాటి భూభాగాల్లోని అమెరికా సైనిక స్థావరాలు, వసతులపై ఇరాన్ బాంబులు వర్షిస్తున్నా అవి నోరెత్తే స్థితిలో లేవు. మరోవైపున, హోర్ముజ్ జలసంధిని ఇరాన్ నియంత్రిస్తున్నందున ఆయిలు, ఇతర కీలకమైన వస్తు రవాణా నిలిచిపోయి మిగతా ప్రపంచ దేశాలు ఆర్థిక మాంద్యం, ద్రవ్యోల్బణం అంచుకు చేరుకున్నాయి. కాబట్టి అవేవీ ట్రంప్‌కు మద్దతుగా నోరెత్తే స్థితిలో లేవు. అంతెందుకు, ట్రంప్‌ను ప్రియమిత్రునిగా చెప్పుకునే మన ప్రధానమంత్రి నరేంద్రమోదీ, ఈ యుద్ధం మొదలు కావటానికి రెండ్రోజులముందే ఇజ్రాయెల్ సందర్శించి ఆ దేశ యుద్ధోన్మాది నెతన్యాహును ఆలింగనం చేసుకుని వచ్చి, ఖమేనీ హత్యను ఖండించలేని దుస్థితిలో అమెరికా–ఇజ్రాయెల్ పక్షపాతిగా ముద్రపడి పశ్చిమాసియా యుద్ధం గూర్చి పల్లెత్తుమాట మాట్లాడలేక మౌనముని అయినారు. దేశంలో ఆయిలు, గ్యాస్ సంక్షోభం ఆయన్ను ఆవరించింది. 140కోట్ల జనాభా కలిగిన అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా భారత్ మాటకు ప్రపంచం విలువ ఇచ్చేది. ఆ మర్యాదను మోదీ మంటగలిపాడు. పాకిస్థాన్ మధ్యవర్తి పాత్రలోకి రావటం మింగుడుపడని ఆయన వందిమాగధులు 'బ్రోకర్' దేశంగా నోరుపారేసుకుని పరువు తీసుకున్నారు.

ట్రంప్ రెండవసారి అధ్యక్ష పీఠం ఎక్కగానే 'మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్' అంటూ, మిత్ర, అమిత్ర దేశాలనే తేడా లేకుండా సుంకాల యుద్ధంతో అందరినీ అమిత్రుల్ని చేసుకున్నారు. లాటిన్ అమెరికాలో ప్రభుత్వాలు మార్చే పనిలో పడ్డాడు. అది సాధ్య పడనందున వెనిజులా అధ్యక్షుణ్ణి బందీగా పట్టుకొచ్చాడు. ఇజ్రాయెల్‌ను గాఢంగా విశ్వసించే ట్రంప్ తొలి అధ్యక్ష పదవీకాలంలోనే ఒబామా కాలంలో ఇరాన్‌తో కుదిరిన అణుశక్తి నిరోధక అంతర్జాతీయ ఒప్పందాన్ని రద్దు చేస్తానని ప్రకటించాడు. దాన్ని ఈ పదవీకాలంలో నెరవేర్చటమేగాక 2025 జూన్‌లో – అధికారం చేబట్టిన ఐదు మాసాలకే ఇజ్రాయెల్‌తో కలిసి ఇరాన్ అణు పదార్థాల పరీక్షల భూగర్భ కేంద్రాలపై బాంబుదాడులు చేసి ఇరాన్ అణుశక్తి కార్యక్రమం కోలుకోలేని విధంగా ధ్వంసం చేశామని ప్రకటించాడు. మరి ఇప్పుడు – అదే కారణంగా ఎందుకు యుద్ధానికి దిగినట్లు? ఇది అమెరికన్‌లు అడుగుతున్న ప్రశ్న. ద్రవ్యోల్బణం పెరిగి అమెరికన్‌ల బాధలు మొదలైనాయి. ప్రజలు 'అమెరికాలో రాచరికం లేదు' అనే నినాదాలతో ట్రంప్ వ్యతిరేక ప్రదర్శనలు చేస్తున్నారు. నవంబర్‌లో కాంగ్రెస్ మధ్యంతర ఎన్నికలు రానున్నాయి. యుద్ధం నుంచి బయటపడటానికి ట్రంప్‌కు ఏదోక హేతువు కావాలి. ఇరాన్‌తో సత్సంబంధాలు కలిగిన పాకిస్థాన్‌ని బహుశా వారే ప్రోత్సహించి ఉంటారు. ఇరాన్ ఇచ్చిన 10 అంశాల ప్రతిపాదనను మార్చి అమెరికాకు పంపారనే ఆరోపణకు గురైంది పాకిస్థాన్ ప్రభుత్వం.

ఏమైతేనేం, చర్చలకు ప్రాతిపదికలపై ఎటువంటి ముందస్తు చర్చలు లేకుండా ఉపాధ్యక్షుడు వాన్స్ నాయకత్వంలో ఉన్నతస్థాయి ప్రతినిధి బృందాన్ని పంపాడు ట్రంప్. నోట్స్ మార్చుకునే పద్ధతిలో ప్రారంభమైన చర్చలు చివరకు ముఖాముఖీ జరిగాయి. చాలావాటిపై అంగీకారం కుదిరిందని, అయితే హోర్ముజ్ జలసంధి ద్వారా స్వేచ్ఛారవాణా, ఎన్నటికీ అణుబాంబు తయారు చేయబోమన్న హామీ ఇరాన్ నుంచి రాలేదని అమెరికా అంటున్నది. అమెరికా మా నుంచి సద్భావాన్ని పొందలేకపోయిందని ఇరాన్ అంటున్నది. ఒక్క సమావేశంతోనే గంభీరమైన సమస్యలన్నీ పరిష్కారమై శాంతి పుష్పాలు విరబూస్తాయని ఎవరూ ఆశించరు. చర్చలు కొనసాగాలి – అందుకోసం కాల్పుల విరమణ పొడిగించాలని కోరుకుంటారు. కాని ట్రంప్ దారే వేరు. హోర్ముజ్ జలసంధిని తెరవకపోతే దాన్ని దిగ్బంధనం చేస్తామని గడువు పెట్టాడు. ఇరాన్‌కు సుంకం చెల్లించి సంధి దాటిన ఓడలను సముద్రంలో పేల్చివేస్తామంటున్నాడు. గల్ఫ్‌లో ఇరాన్ నౌకాశ్రయాలను నాశనం చేస్తామని కాలిగాలిన పిల్లిలా ఎగిరిపడుతున్నాడు. ఇరాన్ దీటుగా జవాబిచ్చింది.

అణుబాంబు తయారు చేయబోమని ఈ యుద్ధానికి ముందే ఇరాన్ ఒమన్ మధ్యవర్తిత్వంలో జరిగిన చర్చల్లో అమెరికాకు హామీ ఇచ్చింది. హోర్ముజ్ జలసంధి ఆ దేశ సార్వభౌమత్వంతో ముడిపడిన అంశం అయినందున తన ఆధిపత్యం వదులుకోదు. 'గల్ఫ్‌లోని ఓడరేవులు అందరికీ చెందుతాయి – కాదంటే ఎవరికీ చెందవు' అని ఘాటుగా సమాధానమిచ్చింది. హోర్ముజ్‌ను నౌకలతో దిగ్బంధించే ట్రంప్ పిలుపును బ్రిటన్ తదితర దేశాలు తిరస్కరించాయి. విధ్వంసానికి పాల్పడి ప్రపంచం ఆగ్రహానికి గురై చరిత్ర హీనుడిగా మిగలటమా లేక సంయమనం పాటించి చర్చలు కొనసాగించి పశ్చిమాసియాలో శాంతి నెలకొల్పటమా? బంతి ట్రంప్ కోర్టులో ఉంది. ●



## విచారణ నుంచి స్వర్ణ తప్పుకోవాలి

**ఆర్ఎస్ఎస్ అనుబంధ సంస్థ కార్యక్రమాలకు ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి స్వర్ణ కాంత శర్మ నాలుగు సార్లు హాజరయ్యారు. దీంతో ఢిల్లీ లిక్కర్ పాలసీ కేసు విచారణ నిష్పక్షపాతంగా జరుగదు. ఈ నేపథ్యంలో ఈ కేసు విచారణ నుంచి ఆమె తప్పుకోవాలి. ఢిల్లీ లిక్కర్ కేసు రాజకీయ కోణంతో ముడిపడి ఉన్నది. నేను ఈ రోజు ఇక్కడ నిందితుడిగా నిలబడలేదు. నన్ను ఇప్పటికే నిర్దోషిగా విడుదల చేశారు. సిబిఐ విచారణను ట్రయల్ కోర్టు తప్పుపట్టినప్పటికీ దాని వాదనలను న్యాయమూర్తి స్వర్ణ కాంత శర్మ చాలా వరకు సమర్థించారు. మార్చి 9 నాటి ఉత్తర్వులతో తన గుండె జారిపోయింది.**

– ఆప్ అధినేత, ఢిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్



# అంతరించే అంచున డాల్ఫిన్ జలచరం

సిటేసియన్ క్షీరదాల జాతికి చెందిన డాల్ఫిన్‌లు సామాజిక చైతన్యం, స్నేహపూర్వక స్వభావం, మంచి అవగాహన శక్తిగల జలచరాలుగా మనుగడ సాగించే జంతువుగా మనందరి దృష్టిని, ప్రేమను, విలక్షణ ప్రవర్తనతో ఆకర్షిస్తున్నాయి. సాధారణంగా డాల్ఫిన్లు 4 నుంచి 30 అడుగుల పొడవును కలిగి జలచర జంతువులుగా లోతు తక్కువగా ఉన్న సముద్ర ప్రాంతాల్లో మనుగడ సాగిస్తాయి. చేపలు, స్కిడ్స్ లాంటి జంతువులను తిని బతుకులను కొనసాగించే మాంసాహారులుగా పేరు తెచ్చుకున్నాయి. ఆడ డాల్ఫిన్‌ను 'కౌ' అని, మగ వాటిని 'బుల్' అని, యువ డాల్ఫిన్‌లను 'కాఫ్', డాల్ఫిన్ల సమూహాన్ని 'స్కూల్' లేదా 'పోడ్' అని పిలుస్తారు. నీటిలో కాకుండా నేల పైన కూడా స్పష్టంగా చూడగలగడం, వినగలగడంతో పాటు డాల్ఫిన్లు మంచి స్పర్శ జ్ఞానాన్ని కూడా ప్రదర్శిస్తాయి. డాల్ఫిన్లు కొంతమేరకు శబ్దాలను కూడా చేయగలుగుతాయి. మొత్తంగా 36 రకాల లేదా ఉపజాతులుగా డాల్ఫిన్‌లు ప్రపంచవ్యాప్తంగా కనిపిస్తున్నాయి.

**మానవులకు మంచి స్నేహితులు డాల్ఫిన్స్:**

డజన్ల నుంచి వేల సంఖ్యల్లో సమూహాలుగా (పోడ్) జీవనాలను కొనసాగిస్తూ తమ ఆహారం విరివిగా దొరికే జల వనరుల ప్రదేశాల్లో నివసిస్తాయి. తమ సమూహంలో ఉన్న డాల్ఫిన్లు మంచి స్నేహితులుగా, ఒకరినొకరు సహాయం చేసుకునే స్వభావాలను కలిగి ఉంటాయి. శిక్షణ పొందిన డాల్ఫిన్లు సామాజిక ప్రదర్శనలు, కొట్లాటలు, సైగలు, ఈలలు లాంటి శబ్దాలతో చూపరుల దృష్టిని ఆకర్షిస్తాయి. మానవులు అనుభవిస్తున్న మధుమేహ రుగ్మతలు డాల్ఫిన్లకు కూడా వర్తిస్తాయి.

**భారత్‌లో గంగా ప్రాజెక్ట్ డాల్ఫిన్ :**

1801లో గంగా నదిలో డాల్ఫిన్లను గుర్తించారు. డాల్ఫిన్లు భారత జాతీయ జలచరంగా గుర్తింపు పొందింది. డాల్ఫిన్ జలచరాలను కాపాడుకునే పటిష్ట చర్యలు తీసుకోని యెడల ఆ జాతి అంతరించే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. భారత ప్రభుత్వం 05 అక్టోబర్ రోజు జాతీయ గంగా నది డాల్ఫిన్ దినోత్సవం జరుపుకోవాలని నిర్ణయం కూడా చేయడం సంతోషదాయకం. ఆరోగ్యకర జల జీవావరణ వ్యవస్థలు మాత్రమే జీవ వైవిధ్యానికి ఉపకరిస్తాయని తెలుసుకోవాలి. సమతుల్య సముద్ర పర్యావరణానికి డాల్ఫిన్లు అద్భుతమైన సూచనలాగా కూడా పనిచేస్తున్నాయి. డాల్ఫిన్‌ల శాస్త్రీయ నామం 'ప్లాటానిస్టా గాంగెటికా' అని తెలుసుకోవాలి. ఇవి భారత్, బంగ్లాదేశ్, నేపాల్ ప్రాంతాల్లో కనిపిస్తాయి. డాల్ఫిన్ల సగటు జీవిత కాలం 18–22 ఏండ్లు ఉంటూ, దాదాపు 150–170 కిలోల బరువును కలిగి ఉంటాయి. అమాయక, స్నేహపూర్వక, సామాజిక, అందమైన డాల్ఫిన్ల మనుగడను కాపాడుకుంటూ, జీవ వైవిధ్యానికి పట్టం కడదాం, డాల్ఫిన్ జలచరాలతో ఆటలు ఆడుకుందాం.

*(14 ఏప్రిల్ జాతీయ డాల్ఫిన్ దినోత్సవం సందర్భంగా)*



డాక్టర్ రామ్ పునియాని

# ఆర్ఎస్ఎస్ వ్యతిరేక పోరాటానికి అంబేడ్కర్ జయంతి సందర్భోచితం

మనమంతా ఏప్రిల్ 14న బాబాసాహెబ్ అంబేడ్కర్ జయంతిని జరుపుకోబోతున్న తరుణంలో 'కుల నిర్మూలన' గురించి బాబాసాహెబ్ బోధించిన ప్రధాన సిద్ధాంతం 'కుల నిర్మూలన' ప్రస్తుత స్థితి గురించి కూడా ఆలోచించాల్సిన సమయం ఇది. 'హిందూ' అనే పదం వాడకంలోకి రాకముందే కులవర్ణ వ్యవస్థ హిందూ సమాజ ఆచారాలలో ప్రధాన భాగంగా ఉంది. మన పవిత్ర గ్రంథాలు, వేదాల నుండి మనుస్మృతి వరకు, ఇక్కడ గౌరవించబడే అనేక ఇతర గ్రంథాలు కఠినమైన వర్ణజాతి నియమాలను నిర్దేశించాయి. ఈ వ్యవస్థకు వ్యతిరేకంగా గళం విప్పిన మొదటి ప్రధాన స్వరం గౌతమ బుద్ధుడు. దీనినే బాబాసాహెబ్ 'విప్లవం' అని పిలిచారు. ఆ తరువాత, పుష్యమిత్ర శుంగ నుండి మొదలుకొని, బౌద్ధమతం, అది బోధించిన విలువలు వ్యతిరేకించబడ్డాయి. ప్రతీకార విప్లవం అని పిలువబడే ఈ కాలం వర్ణ–కుల వ్యవస్థను దూకుడుగా పునరుద్ధరించడానికి దారితీసింది. భారతదేశం నుండి బౌద్ధమతం తుడిచిపెట్టుకుపోయింది. అయితే ఇది అనేక దక్షిణ, తూర్పు ఆసియా దేశాలలో వర్ధిల్లింది.

కుల వ్యవస్థకు తదుపరి ప్రధాన వ్యతిరేకత కబీర్, రవిదాస్, దాదు వంటి సంతుల నుండి వచ్చింది. ఈ సంతులు ఆచారాలు, పురోహిత వర్గం ప్రాధాన్యతకు విరుద్ధంగా మానవతావాదాన్ని సమర్థించారు, సమాజంలో సమానత్వం గురించి మాట్లాడారు. వారి వాక్చాతుర్యం చాలా శక్తివంతమైనది. కానీ కుల వ్యవస్థ ప్రధాన లబ్ధిదారులైన భూస్వాములతో పొత్తు పెట్టుకున్న పురోహిత వర్గం నుండి వారు బలమైన వ్యతిరేకతను ఎదుర్కొన్నారు. బ్రిటీష్ వలస పాలన కాలంలో అన్ని రకాల లోపాలు ఉన్నప్పటికీ, ఈ అమానవీయ వ్యవస్థకు వ్యతిరేకంగా ఆధునిక విద్యా వ్యవస్థతో పోరాటం ప్రారంభమైంది. ఆధునిక కాలంలో సమానత్వ భావన జ్యోతిరావు పూలేతో ప్రారంభమైంది. ఆయన నిమ్న కులాల వారి విద్య పట్ల ఉన్న వ్యతిరేకతను ఎదుర్కొని, దళిత— ఒబిసిలకు విద్య, సమాన హోదాను అందించడంలో విజయం సాధించారు. ఆధునిక పారిశ్రామికీకరణ దీనికి మరింత ఊపునిచ్చింది. సమానత్వంతో కూడిన సమాజం కోసం జరిగిన పోరాటం ఇక్కడే పాతుకుపోయింది.

మహిళలను పురుషుల కంటే తక్కువగా చూసే వ్యవస్థ కాఠిన్యానికి వ్యతిరేకంగా జరిగిన పోరాటానికి, జ్యోతిరావు, సావిత్రిబాయి పూలే ప్రారంభించిన మహిళా విద్యా ఉద్యమం ఒక ఆదర్శవంతమైన వేదికగా నిలిచింది. ఈ ప్రక్రియను ముందుకు తీసుకెళ్లడంలో సావిత్రిబాయితో ఫాతిమా షేక్ దృఢంగా నిలబడ్డారు. సామాజిక న్యాయం కోసం సాగే ఈ ప్రస్థానంలో బాబాసాహెబ్ అంబేడ్కర్ ఒక ప్రధాన ముందడుగు వేశారు. ప్రజల తాగునీటి కోసం (చావదార్ తలావ్), ఆలయ ప్రవేశం కోసం (కలారం మందిర్) ఆయన చేసిన ఉద్యమాలన్నీ ఇందుకు నిదర్శనం. కుల వ్యవస్థకు మతపరమైన ఆమోదాన్ని వ్యతిరేకిస్తూ మనుస్మృతిని దహనం చేయబడింది. ఆత్మగౌరవం కోసం పెరియార్ రామస్వామి నాయకర్ చేసిన ఉద్యమం సమాజ మనస్సాక్షిని కదిలించేంత శక్తివంతమైనది. ఈ ప్రయత్నాలన్నీ మహాత్మా గాంధీ నేతృత్వంలోని స్వాతంత్ర్య ఉద్యమానికి సమాంతరంగా సాగి, చివరికి భారత రాజ్యాంగం కోసం రాజ్యాంగ సభలో చర్చలు జరగడంతో పరాకాష్టకు చేరుకున్నాయి. అంబేడ్కర్ ముసాయిదా కమిటీకి ఛైర్మన్ కావడం కేవలం ప్రతీకాత్మకం కాదు, అది సమానత్వ విలువల కోసం ఈ మహనీయుడు పోషించిన కీలక పాత్రను ప్రతిబింబించింది.



నేడు డాక్టర్ అంబేడ్కర్ 135వ జయంతి

సమానత్వం వైపు సాగే ఈ సామాజిక మార్పు ప్రక్రియకు వ్యతిరేకత బీజాలు సమాజంలోనే ఉన్నాయి. అవి మొదట హిందూ మహాసభలో, ఆ తర్వాత ఆర్ఎస్ఎస్‌లో ప్రతిఫలించాయి. ఆర్ఎస్ఎస్ సిద్ధాంతానికి మూలమైన కుల, లింగ భేదాల పాతుకుపోయి నిచ్చెన మెట్ల పద్ధతిని కదిలించిన ప్రధాన ముందడుగు దళిత – ఒబిసి ఉద్యమం. సమాజంలో సమానత్వం కోసం పోరాడుతున్న దళితులకు వ్యతిరేకంగా ఆర్ఎస్ఎస్ ఆవిర్భవించింది. క్రమంగా తన అధికారాన్ని పటిష్టం చేసుకునేందుకు, అది ముస్లింలను ఒక బాహ్య శత్రువుగా వెతుక్కుంది. మనుస్మృతి దాని కేంద్ర బిందువుగా ఉండగా, ఇస్లాం, ముస్లింల పట్ల వ్యతిరేకత దాని ఎదుగుదలకు ఒక ముసుగుగా పనిచేసింది. ప్రచారక్‌లుగా (పూర్తికాల కార్యకర్తలుం, బ్రహ్మచారులు), స్వయంసేవక్‌లుగా మారిన యువకులకు తన శిక్షణా విధానాన్ని అందించడం ద్వారా అది తనను తాను బలోపేతం చేసుకుంటూ వచ్చింది.

రాజ్యాంగం ఎస్‌సి / ఎస్‌టిలకు రిజర్వేషన్లు కల్పించినప్పటికీ, దానికి వ్యతిరేకంగా అంతర్లీనంగా మౌఖిక ప్రచారం కొనసాగింది. ఇది 1980లో దళితులపై, 1985లో ఒబిసిలపై అహ్మదాబాద్ పరిసర ప్రాంతాల్లో జరిగిన హింసాకాండకు దారితీసింది. మండల్ సిఫార్సుల అమలు సామాజిక న్యాయం వైపు ప్రయాణానికి మరింత ఊతమిచ్చింది. మండల్ సిఫార్సుల అమలు ప్రక్రియ నుండి ప్రజల దృష్టిని మళ్లించడానికి హిందూ జాతీయవాదులు తమ కమండల్, రామ మందిరం, గోవు, లవ్ జిహాద్ వంటి వాటిని బలోపేతం చేసుకున్నారు. 'యూత్ ఫర్ ఈక్వాలిటీ' వంటి సంస్థలు మండల్‌కు వ్యతిరేకతను మరింత బలపరిచాయి.

భూ సంస్కరణల ప్రక్రియ అసంపూర్తిగా మిగిలిపోవడం, మత పెద్దలు, భూస్వాములు తమ రూపాన్ని మార్చుకుంటూనే ఉండటం, వారు కనుమరుగవకపోవడంతో, ఈ రిజర్వేషన్ల ప్రక్రియను పాతుకుపోయిన వర్గాలు అంగీకరించలేదు. కుల ఆధారిత రిజర్వేషన్ల ప్రక్రియను నీరుగార్చడానికి, వారు ఆర్థిక ప్రమాణాలను ప్రవేశపెట్టారు. విద్యా రంగంలోని రిజర్వుడు పోస్టులు, 'తగిన అభ్యర్థి దొరకలేదు' అని పక్షపాత ధోరణి గల ఎంపిక కమిటీల వల్ల భర్తీ కాలేదు. హిందూ జాతీయవాద భావజాలం, ఆలోచనలు పెరగడంతో, సామాజిక న్యాయం వైపు సాగే ప్రయాణాన్ని అడ్డుకోవడానికి కొత్త కొత్త శక్తులు పుట్టుకొస్తున్నాయి.

చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న కుల గణన డిమాండ్‌కు వ్యతిరేకత వచ్చింది. ఇప్పుడు అది ఆమోదించబడింది. దాని ఫలితాలతో మనం కులాల స్థితి, వారి దుస్థితి గురించి తెలుసుకుంటాము. మరో సమస్య సూక్ష్మ స్థాయిలో పనిచేస్తోంది. అది ముఖ్యంగా విద్యాసంస్థలలో, సాధారణంగా సమాజంలో ఎస్‌సి/ఎస్‌టిలను అవమానించడం. సమాజంలోని అణగారిన వర్గాలకు జరిగే ఈ సూక్ష్మ అవమానాలు దళిత/ఎస్‌టి అభ్యర్థుల ఆత్మహత్యల సంఖ్య పెరగడానికి దారితీశాయి. రోహిత్ వేముల సంస్థాగత హత్య మానవతా విలువలున్న ఎంతో మందిని తీవ్రంగా కలచివేసింది. సైన్స్ రచయిత కావాలనుకున్న ఒక దళిత యువకుడు హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో అత్యంత దారుణమైన ప్రవర్తనకు గురై ఆత్మహత్య చేసుకున్నాడు. రోహిత్ చట్టం రూపొందించబడింది కానీ అమలు కాలేదు. ముంబైలోని నాయర్ ఆసుపత్రిలో పాయల్ తడ్వి ఉదంతం మనల్ని తీవ్రంగా కదిలించింది. ఎందుకంటే డాక్టర్ పాయల్ తడ్వి తన పై అధికారుల చేత నిత్యం అవమానాలకు గురై, ఆత్మహత్య చేసుకునేలా ఒత్తిడి చేశారు. ముంబై ఐఐటిలో దర్శన్ సోలంకిని తోటి విద్యార్థులు పలు సందర్భాల్లో ఎగతాళి చేయడంతో, అతను ఆత్మహత్య చేసుకున్నాడు. ఇవి కేవలం కొన్ని ఉదాహరణలు మాత్రమే; ఇలాంటి కేసులు లెక్కలేనన్ని ఉన్నాయి.

ఈ నేపథ్యంలో 2026 జనవరి 13న యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (ఉన్నత విద్యా సంస్థలలో సమానత్వాన్ని ప్రోత్సహించడం) నిబంధనలు–2026ను నోటిఫై చేసింది. ఇది భారతదేశంలోని అన్ని విశ్వవిద్యాలయాలలో కఠినమైన వివక్ష వ్యతిరేక చర్యలను తప్పనిసరి చేసింది. కుల, లింగ, వైకల్య వివక్షలను లక్ష్యంగా చేసుకుని, సమానత్వాన్ని నిర్ధారించడమే దీని ఉద్దేశ్యం. సమాన అవకాశాల కేంద్రాలు (ఇఒసి), ఈక్విటీ కమిటీలు, 24/7 హెల్ప్‌లైన్‌లు ఏర్పాటు చేయడం, ఈక్విటీ అంబాసిడర్లను నియమించడం వంటివి దీనిలోని ముఖ్య ఆదేశాలు. దీనికి భారీ వ్యతిరేకత, నిరసనలు వెల్లువెత్తాయి. ఈ విషయం కోర్టుకు వెళ్లగా, కోర్టు ఈ యుజిసి ఆదేశాన్ని కొట్టివేసింది. నేడు మనం డాక్టర్ అంబేద్కర్ ను స్మరించుకుంటున్నప్పుడు, సామాజిక సమానత్వం వైపు సాగే ప్రయాణానికి ప్రధానమైన, అంతర్లీన వ్యతిరేకత బలంగా పాతుకుపోయిన ఆర్ఎస్ఎస్ నుండే వస్తోందనే విషయాన్ని మనం గమనించాలి. అది తన తిరోగమన ఎజెండాను పలు మార్గాల ద్వారా వ్యాప్తి చేస్తోంది. ఆర్ఎస్ఎస్ యొక్క ముస్లిం వ్యతిరేక ఎజెండా స్పష్టంగా కనిపిస్తున్నప్పటికీ, దాని దళిత వ్యతిరేక ఎజెండా మరింత అంతర్లీనమైనది. కుల నిర్మూలన అనే స్వప్నాన్ని సాకారం చేసుకోవడానికి దీనిని ఎదుర్కోవలసి ఉంది. **(ఐపిఎ సర్వీస్)**



**సోనియాగాంధీ**
కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్

# మహిళా రిజర్వేషన్ కాదు..నియోజకవర్గాల పునర్విభజనే అసలు సమస్య

తమిళనాడు, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలలో ఎన్నికల ప్రచారం ఉధృతంగా సాగుతున్న సమయంలో కేంద్ర ప్రభుత్వం పార్లమెంటు ప్రత్యేక సమావేశంలో బలవంతంగా ఆమోదింపజేయాలని భావిస్తున్న బిల్లులకు మద్దతు ఇవ్వాలని ప్రధానమంత్రి ప్రతిపక్ష పార్టీలకు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ అసాధారణమైన తొందరపాటుకు ఒకే ఒక కారణం ఉండొచ్చు. అదేమిటంటే రాజకీయ లబ్ధి పొందడం, ప్రతిపక్షాన్ని ఆత్మరక్షణలో పడేయడం. ప్రధానమంత్రి ఎప్పటిలాగే నిజాన్ని మితంగానే చెబుతున్నారు.

2023 సెప్టెంబర్‌లో జరిగిన ప్రత్యేక సమావేశంలో నారీ శక్తి వందన్ అధినియమ్, 2023ను పార్లమెంటు ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ అధినియమ్ రాజ్యాంగంలో ఆర్టికల్ 334 ఎను ప్రవేశపెట్టింది. ఇది లోక్‌సభ, విధాన(శాసన)సభలలో మహిళలకు మూడింట ఒక వంతు రిజర్వేషన్‌ను తప్పనిసరి చేసింది. తదుపరి జనాభా లెక్కలు, జనాభా లెక్కల ఆధారిత నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) ప్రక్రియ పూర్తయిన తర్వాత ఇది అమల్లోకి రావాల్సి ఉంది. ప్రతిపక్షం ఈ షరతును కోరలేదు. వాస్తవానికి, రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున్ ఖర్గే, 2024 లోక్‌సభ ఎన్నికల నుంచే రిజర్వేషన్ నిబంధనను అమలు చేయాలని గట్టిగా డిమాండ్ చేశారు. ప్రభుత్వానికి మాత్రమే తెలిసిన కారణాల వల్ల, ఆ ప్రతిపాదనను అంగీకరించలేదు.

ఇప్పుడు 2029 నుంచే మహిళా రిజర్వేషన్‌ను వర్తింపజేసేందుకు ఆర్టికల్ 334ఎను సవరించనున్నారని మాకు అవగతమైంది. ఈ విధంగా యూ టర్న్ తీసుకునేందుకు ప్రధానమంత్రికి 30 నెలలు ఎందుకు పట్టింది? ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయడానికి ఆయన కొన్ని వారాలు కూడా ఎందుకు ఆగలేకపోయారు? పశ్చిమ బెంగాల్‌లో ఏప్రిల్ 29న చివరి దశ ఎన్నికలు ముగిసిన తర్వాత, ప్రభుత్వ కొత్త ప్రతిపాదనలపై చర్చించడానికి అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయాలని కోరుతూ ప్రభుత్వానికి ప్రతిపక్ష నాయకులు ఒకసారి కాదు, మూడుసార్లు లేఖలు రాశారు. కానీ, ఆ అత్యంత ఉచితమైన అభ్యర్థనను తిరస్కరించారు. దానికి బదులుగా, ప్రధానమంత్రి సంపాదకీయ వ్యాసాలు రాయడం, రాజకీయ పార్టీలకు విజ్ఞప్తులు చేయడం, సమ్మేళనాలు నిర్వహించడం వంటి వాటికి పాల్పడ్డారు. ఇది ప్రధానమంత్రి ఆధిపత్య ధోరణిని, నిర్ణయాలు తీసుకునే విషయంలో ఆయన 'అయితే నాదారి లేదంటే రహదారి' అనే వైఖరిని ప్రతిబింబించే ఒక కుత్సిత ఎత్తుగడ.

### గతం నుండి పాఠాలు

పార్లమెంటులో 73వ, 74వ రాజ్యాంగ సవరణ బిల్లులు వరుసగా 1993 ఏప్రిల్, 1993జూన్‌లో ఆమోదం పొందాయి. ఈ బిల్లులపై దాదాపు ఐదేళ్ల చర్చలు, వాదోపవాదాలు జరిగాయి. ఆ తర్వాత పంచాయతీలు, నగరపాలికల ఎన్నికలలో మహిళలకు రిజర్వేషన్ చట్టంగా మారింది. ఇది దివంగత ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ సాధించిన ఒక అద్భుతమైన విజయం. నేడు గ్రామీణ, పట్టణ స్థానిక సంస్థలలో సుమారు 15లక్షల మంది ఎన్నికైన మహిళా ప్రతినిధులు ఉన్నారు. ఇది మొత్తం ప్రతినిధుల సంఖ్యలో 40 శాతం కంటే ఎక్కువ. నారీ శక్తి వందన అధినియమ్, 2023 ఈ ఘనత భుజాలపై నిలబడింది.

గత దశాబ్ది జనాభా లెక్కలు 2021లో జరగాల్సి ఉంది. మోదీ ప్రభుత్వం దానిని వాయిదా వేస్తూ వచ్చింది. పర్యవసానంగా, ప్రధాన మంత్రి గరీబ్ కళ్యాణ్ అన్న యోజనకు ఆధారమైన జాతీయ ఆహార భద్రతా చట్టం, 2013 ప్రకారం పది కోట్లకు పైగా ప్రజలు తమ చట్టపరమైన హక్కులను కోల్పోయారు. ఐదేళ్ల పాటు వివరించలేని జాప్యం తర్వాతే జనాభా లెక్కల కార్యకలాపాలు ప్రారంభమయ్యాయి. ఇది డిజిటల్ జనగణన అని గర్వంగా చెప్పుకుంటున్నారు. దీని డిజిటల్ స్వభావం కారణంగా, చాలా వరకు జనాభా గణన సంఖ్యలు 2027లోనే అందుబాటులోకి వస్తాయని ఉన్నతాధికారులే స్వయంగా బహిరంగంగా ప్రకటించారు. ఈ సమావేశాన్ని ఏర్పాటు చేయడానికి, నియోజకవర్గాల పునర్విభజన చేయడానికి ప్రభుత్వం చూపుతున్న తొందరపాటుకు, చెప్పే సాకులు స్పష్టంగా డొల్లగా ఉన్నాయి.

2027 జనగణనలో కులగణన కూడా ఉంటుందని దాదాపుగా సరిగ్గా ఏడాది క్రితం ప్రధానమంత్రి ప్రకటించారు. కుల గణన నిర్వహించాలనే ఆలోచనను తిరస్కరిస్తూ సుప్రీం కోర్టులో అఫిడవిట్లు దాఖలు చేసి, పార్లమెంటులో ప్రశ్నలకు సమాధానమిచ్చిన తర్వాత ఆయన ఈ ప్రకటన చేశారు. కుల గణన కోసం పిలుపునిస్తున్న కాంగ్రెస్ నాయకులు 'అర్బన్ నక్సల్ మనస్తత్వం'తో బాధపడుతున్నారని ప్రధానమంత్రి ఆరోపించిన తర్వాత కూడా ఇది సంభవించింది.

ఏది ఏమైనప్పటికీ, సామాజిక న్యాయానికి, సాధికారతకు మరింత అర్థం చేకూర్చేందుకు 2027 జనాభా లెక్కలు కులాల వారీగా జనాభాను లెక్కించనున్నాయి. బిహార్, తెలంగాణ రాష్ట్రాలు తమ తమ రాష్ట్రాల్లో సమగ్ర కుల సర్వేలను నిర్వహించాయి. ఈ మొత్తం ప్రక్రియకు ఆరు నెలలకు మించి సమయం పట్టలేదు.

కాబట్టి, కుల గణన కారణంగా 2027 జనాభా లెక్కల ప్రచురణ ఆలస్యం అవుతుందన్న ప్రచారం ఎంతమాత్రం నిజం కాదని స్పష్టమవుతోంది. వాస్తవానికి, కుల గణనను మరింత ఆలస్యం చేసి, పట్టాలు తప్పించడమే ఇప్పుడు ప్రధానమంత్రి అసలు ఉద్దేశం. ప్రత్యేక సమావేశం ఏప్రిల్ 16న ప్రారంభం కానుంది.

అయినప్పటికీ, ఈ సమావేశంలో ప్రభుత్వం కచ్చితంగా ఏ అంశాలను పరిశీలించాలనుకుంటుందో అనే విషయంపై ఎంపిలతో ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రతిపాదనను పంచుకోలేదు. నియోజకవర్గాల పునర్విభజన కోసం ఏదో ఒక ఫార్ములాను సూచిస్తున్నట్లు కనిపిస్తోంది. గతంలో మాదిరిగానే, ఏ పునర్విభజనకైనా ముందుగా జనాభా గణన జరగాలి. అంతేకాకుండా, లోక్‌సభ సభ్యుల సంఖ్యను పెంచే ఏ పునర్విభజన అయినా కేవలం గణాంకపరంగానే కాకుండా రాజకీయంగా కూడా సమానంగా ఉండాలనేది చెప్పనవసరం లేదు. కుటుంబ నియంత్రణలో పథనిర్దేశకులుగా ఉన్న రాష్ట్రాలు, చిన్న రాష్ట్రాలు సంపూర్ణంగా గానీ, సాపేక్షంగా గానీ నష్టానికి గురికాకూడదు. వాస్తవానికి, ప్రపోర్షనేట్ (దామాషా) పెరుగుదల రిలేటివ్ (సాపేక్ష) ప్రభావాన్ని కోల్పోవడానికి దారితీయవచ్చు. ఎందుకంటే సంఖ్యాపరమైన వ్యత్యాసం చాలా ఎక్కువగా ఉంటుంది.

### నిశిత పరిశీలన అవసరం

నారీ శక్తి వందన అధినియమ్, 2023 రిజర్వేషన్‌లలోనే రిజర్వేషన్‌ను కల్పిస్తుంది. దీని ప్రకారం, షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల కోసం కేటాయించిన మూడింట ఒక వంతు సీట్లను మహిళలకు కూడా రిజర్వ్ చేస్తారు.

2023 సెప్టెంబర్‌లో జరిగిన చర్చ సందర్భంగా, రాజ్యసభలోని ప్రతిపక్ష నాయకుడు ఇతర వెనుకబడిన తరగతులకు (ఒబిసిలకు) చెందిన మహిళలకు కూడా ఇదే విధమైన రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. ఉన్నత విద్య, ప్రభుత్వ ఉద్యోగాలలోఒబిసిలకు ఇప్పటికే రిజర్వేషన్ కల్పించబడింది.

పార్లమెంటు వర్షాకాల సమావేశాలు జూలై మధ్యలో ప్రారంభమవుతాయి. ఒకవేళ ప్రభుత్వం ఏప్రిల్ 29 (ఐదు శాసనసభల ఎన్నికల) తర్వాత అఖిలపక్ష సమావేశం పిలిచి, ప్రతిపక్షాలతో తమ ప్రతిపాదనలపై చర్చించి, జనబాహుళ్యంలో చర్చకు సమయం ఇచ్చి, ఆ తర్వాత వర్షాకాల సమావేశాల్లో రాజ్యాంగ సవరణ బిల్లులను ఆమోదానికి పెడితే ఆకాశం ఏమీ కూలిపోదు.

మన రాజకీయ వ్యవస్థలో అత్యంత సుదూర ప్రభావం చూపే మార్పులను బలవంతంగా రుద్దడానికి పడుతున్న ఈ తొందరపాటుకు, క్లిష్ట సమయాల్లో వృత్తాంతాన్ని సృష్టించడమే తప్ప మరే సమర్థనా లేదు.

ఈ ప్రక్రియ తీవ్ర లోపాలతో కూడుకున్నది, ప్రజాస్వామ్య వ్యతిరేకమైనది. ఇక్కడ మహిళలకు రిజర్వేషన్ సమస్య కాదు. అది ఇప్పటికే పరిష్కరించబడింది. అసలు సమస్య నియోజకవర్గాల పునర్విభజన. అనధికారికంగా అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం, ఇది అత్యంత ప్రమాదకరమైనది, రాజ్యాంగంపైనే దాడి లాంటిది.

(ది హిందూ సౌజన్యంతో )

## ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు కలెక్టర్ అభినందన



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** ఇంటర్మీడియట్ పరీక్షల్లో ప్రతిభ కనబర్చిన జిల్లాలోని మైనారిటీ విద్యాలయాల విద్యార్థులను జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సోమవారం అభినందించారు. ఇంటర్మీడియట్ మొదటి, రెండవ సంవత్సరం ఫలితాలు విడుదల కాగా, తంగళ్ళపల్లి, వేములవాడ లోని మైనార్టీ సంక్షేమ గురుకుల విద్యాలయాలకు చెందిన విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చి మార్కులు సాధించారు. ఈ సందర్భంగా ఆ విద్యార్థులు జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో కలెక్టర్ ను కలువగా, వారిని అభినందించారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుంటూ తమ లక్ష్యాలను స్పష్టంగా నిర్ణయించుకుని, పట్టుదలతో కృషి చేస్తే విజయాన్ని సాధించడం సాధ్యమవుతుందని ఆమె సూచించారు. ద్వితీయ సంవత్సరం బీపీసీ విభాగంలో ఎం.నందిని 1000 మార్కులకు గాను 977 మార్కులు, సుబియ తబస్సుం 969 మార్కులు సాధించారు. ఎంపీసీ విభాగంలో బుస్ర కౌసర్ 1000 మార్కులకు గాను 985 మార్కులు కే.నమిత 979 మార్కులు సాధించి తమ ప్రతిభ చూపారు. అలాగే ప్రథమ సంవత్సరం ఎంఎల్ టీ విభాగంలో 500 మార్కులకు గాను సీహెచ్.మనోజ్, కే.నిరంజన్ 488 మార్కులు సాధించి జిల్లాస్థాయిలో మొదటి ర్యాంకును సాధించారు. బి.సుకుమార్ 481 మార్కులు సాధించారు. ఎల్ ఎం అండ్ డీటీ విభాగంలో 500 మార్కులకు గాను ఎస్ ప్రణయ్ 491 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంకును సాధించారు. ఇ.రాహుల్ 490 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో రెండవ ర్యాంకును సాధించారు. డీ రామ్ చరణ్ 488 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో మూడవ ర్యాంకును సాధించారు. అలాగే ద్వితీయ సంవత్సరం ఎం ఎల్ టీ విభాగంలో 1000 మార్కులకు యు.హేమంత్ గాను 982 మార్కులు, ఎండీ శాదుల్ 973 మార్కులు ఎల్ మునీందర్ 967 మార్కులు సాధించారు. ఎల్ ఎం అండ్ డీటీ విభాగంలో 1000 మార్కులకు గాను ఎస్.కే ఆదిల్ 977 మార్కులు, జే అభిషేక్ 959 మార్కులు, పీ రాజు 924 మార్కులు సాధించి ప్రతిభ చూపారు. ఈ కార్యక్రమంలో ఎం.ఎ.భారతి, పాఠశాల ప్రిన్సిపాల్ ఉరుస ఫాతిమా, లక్ష్మీ నారాయణ, పాల్గొన్నారు.

## ప్రజల కృషితోనే రోడ్డు ప్రమాదాల నివారణ




**ప్రజాపక్షం/జగిత్యాల :** అన్ని వర్గాల ప్రజల కృషితోనే రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చుననని జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాలను నియంత్రించే కార్యక్రమంలో భాగంగా సోమవారం జగిత్యాల పట్టణంలోని ఓల్డ్ బస్ స్టాండ్ ప్రాంతంలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్, జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తో కలిసి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. వాహనదారులు జాగ్రత్తగా, నియమ నిబంధనలు పాటిస్తూ ప్రయాణిస్తే ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని అన్నారు. రోడ్డు భద్రత ఒక్క పోలీస్ శాఖ బాధ్యత కాకుండా ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత అని స్పష్టం చేశారు. "వేగం ప్రాణం తీస్తుంది" అనే విషయాన్ని గుర్తుంచుకుని అధిక వేగంతో ప్రయాణించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ముఖ్యంగా తల్లిదండ్రులు తమ పిల్లలకు హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పించాలని కోరారు.అనంతరం జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో ఇతర ప్రమాదాల కంటే రోడ్డు ప్రమాదాల వల్లనే ఎక్కువ మంది ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రమాదాలను గణనీయంగా తగ్గించేందుకు గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు రోడ్డు భద్రతా వ్యవస్థలను బలోపేతం చేయడం, ప్రజల్లో డిఫెన్సివ్ డ్రైవింగ్ సంస్కృతిని పెంపొందించడం 'అరైవ్–అలైవ్' కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, డీఎస్పీ రఘు చందర్, ఆర్టీఓ శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ సమిండ్ల వాణి శ్రీనివాస్, ఇన్స్పెక్టర్ కరుణాకర్ తదితరులు ఉన్నారు.

## హామీలు నెరవేర్చితేనే ప్రజాపాలన



**ప్రజాపక్షం/సిద్దిపేట:** ప్రజలకు ఇచ్చిన హామీలను నేరేవేర్చితేనే అది ప్రజాపాలన ప్రభుత్వమవుతుందని..కాని కాంగ్రెస్ ది ప్రజాపాలన కాదని.. తుగ్లక్ రాక్షస పాలన సాగిస్తున్నారని మాజీ మంత్రి హరీష్‌రావు అన్నారు. సోమవారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని విద్యుత్ డిఈ కార్యాలయంలో తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ విద్యుత్ ఆర్టిజన్ ఉద్యోగులు గత 6రోజులుగా చేపట్టిన నిరవదిక సమ్మెకు మాజీ మంత్రి హరీష్ రావు సంఘీభావం ప్రకటించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరాగాంధీ రాజ్యం వస్తుందని సిఎం రేవంత్‌రెడ్డి అన్ని వర్గాలకు హామీనిచ్చి రెండున్నర ఏండ్లలో ఏ వర్గానికి ఏ ఒక్క హామీ:నేరవేర్చలేదన్నారు. గత బిఆర్ఎస్ కెసిఆర్ ప్రభుత్వ హయాంలో 26వేల మందిని ఆర్టిజన్లుగా గుర్తించి మంచి వేతనం అందించినట్లు తెలిపారు. సర్వశిక్ష అభియాన్ ఉద్యోగులు సమ్మె చేస్తే వారి వద్దకు వెళ్లి రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే చాయ్ తాగినంత సేపట్లో మీ సమస్యను పరిష్కరిస్తానని చెప్పాడని. రెండున్నర ఏండ్లలో ఎన్ని చాయ్‌లు తాగిన సమస్యను ఎందుకు పరిష్కరించలేదని ఎద్దేవా చేశారు. సర్వశిక్ష ఉద్యోగులతో పాటు ఉపాధి హామీ ఉద్యోగులు, అంగన్‌వాడి, ఆశా వర్కర్లును కాంగ్రెస్ ప్రభుత్వం సిఎం రేవంత్‌రెడ్డి మోసం చేశారన్నారు. వెంటనే వారి డిమాండ్లు పరిష్కరించకుంటే ఆర్టిజన్ల పక్షాన బిఆర్ఎస్ ప్రత్యక్ష పోరాటానికి దిగుతుందని, ఆ తర్వాత జరిగే పరిణామాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

## ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలి: కలెక్టర్

**ప్రజాపక్షం/కరీంనగర్:** ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని కలెక్టర్ చిత్రా మిశ్రా అన్నారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి కలెక్టర్ దరఖాస్తులు స్వీకరించారు. మొత్తం 229 మంది అర్జీదారులు ప్రజావాణిలో దరఖాస్తులు సమర్పించారు. కొన్ని దరఖాస్తులను అక్కడికక్కడే పరిష్కరించగా మరికొన్నింటిని అధికారులకు బదిలీ చేశారు. త్వరితగతిన దరఖాస్తులు పరిష్కరించాలని, పెండింగ్ దరఖాస్తులు క్లియర్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, లక్ష్మీ కిరణ్, ఆర్డీవోలు మహేశ్వర్, రమేష్ బాబు పాల్గొన్నారు.

# శ్రీపాదరావు ఆశయ సాధనే మా లక్ష్యం

### మంత్రి శ్రీధర్ బాబు



**ప్రజాపక్షం/ముత్తారం:** తన జీవితాంతం ప్రజా సేవకే అంకితమైన మహోన్నత వ్యక్తి మా నాన్న దివంగత శ్రీపాద రావు ఆయన చూపిన బాటల్లో నడవడమే ఆయనకు మనం ఇచ్చే నిజమైన నివాళి అని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు అన్నారు. శ్రీపాదరావు వర్ధంతి సందర్భంగా ముత్తారం మండలంలోని కేషనపల్లి లోని శ్రీపాదరావు విగ్రహానికి మంత్రి శ్రీధర్ బాబు పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం ముత్తారం మండల కేంద్రంలోని వెంకటలక్ష్మి ఫంక్షన్ హాల్ లో నిర్వహించిన కంటి అద్దాలు పంపిణీ కార్యక్రమంలో పాల్గొని చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూప్రజా క్షేమమే పరమావధి: పదిమందికి మేలు చేస్తే పది తరాల పాటు ప్రజల గుండెల్లో నిలిచిపోతామని నాన్న ఎప్పుడూ చెబుతుండేవారు. ఆయన అడుగుజాడల్లోనే మంథని నియోజకవర్గాన్ని, రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నాం.పేదల పక్షపాతి నిరుపేదలు, అణగారిన వర్గాల సంక్షేమం కోసం శ్రీపాదరావు చేసిన కృషి చిరస్మరణీయమని, వారి ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.ముత్తారం మండలంలోని అడవి శ్రీరాంపూర్ గ్రామంలో చిల్డ్రన్ పార్క్, బస్సు షెల్టర్లు కేసినపల్లి,అడవి శ్రీరాంపూర్, దర్యాపూర్, సీతంపల్లి గ్రామాలలో 10 లక్షల రూపాయలతో ఏర్పాటుకు నిధులు మంజూరు. అనంతరం మాజీ జెడ్పిటిసి నాగినేని జగన్ మోహన్ రావు అదే గ్రామానికి చెందిన మిన్నపురం వరలక్ష్మి ,గుడి కందుల మంజుల కి తలకందుల వరలక్ష్మి కి భూమిని విరళంగా అందించారు.కాగా పుష్పగిరి ఆస్పత్రి నిర్వాహకులు మహేందర్ యాదవ్,ఆస్పత్రి వైద్యులను, ఉచిత వైద్య శిబిరానికి సహకరించిన అందరిని ఈ సందర్భంగా మంత్రి సన్మానించారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు,శ్రీపాదరావు అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని ఆయన సేవలను స్మరించుకున్నారు.శ్రీపాదరావు వర్ధంతి సందర్భంగా కస్తూర్బా గాంధీ పాఠశాలకు చెందిన 70 మంది విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, నోటుబుక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్, రామగుండం మున్సిపల్ మేయర్ మహంకాళి, ఆరెల్లి మోహన్, మృత్యుంజయ్, జిల్లా గ్రంథాలయం చైర్మన్ అన్నయ్య గౌడ్,రాజ బాబు,మాజీ జెడ్పిటిసి చొప్పరి సదానందం,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దొడ్డ బాలాజీ,నాగినేని జగన్ మోహన్ రావు,ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు మద్దెల రాజయ్య తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా పదవ తరగతి పరీక్షల నిర్వహణ

### కలెక్టర్ సత్య ప్రసాద్

**ప్రజాపక్షం/జగిత్యాల టౌన్ :** పదవ తరగతి పరీక్షల నిర్వాహణ ప్రశాంతంగా నిర్వహించినట్లు జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రలోని పురాణీ పేటలో నిర్వహిస్తున్న పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. భద్రతా ఏర్పాట్లను, విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో, నిబంధనల ప్రకారం నిర్వహించాలని ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. డీఈవో రాము, తహసీల్దార్ రాంమోహన్ ఉన్నారు.



## ప్రమాదాల సమయంలో 'గోల్డెన్ అవర్'ను వినియోగిస్తే ప్రాణాలు సంరక్షితం



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** ప్రమాదాల సమయంలో గోల్డెన్ అవర్‌ను సద్వినియోగం చేసుకుంటే ప్రాణాలను రక్షించవచ్చని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.సోమవారం సుల్తానాబాద్ మండలం గర్రెపల్లి గ్రామంలో నిర్వహించిన ఏరైవ్ ఏలైవ్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ హిట్ అండ్ రన్ కేసులు,ఇతర రోడ్డు ప్రమాదాల్లో బాధితులకు ప్రభుత్వం రూ.2 లక్షల ఆర్థిక సహాయం అందిస్తున్నదని తెలిపారు.గత సంవత్సరం జిల్లాలో సుమారు 30 మంది బాధితులకు ఈ సహాయం అందించినట్లు పేర్కొన్నారు.రోడ్డు ప్రమాదం జరిగినప్పుడు బాధితులను ఆసుపత్రికి తరలిస్తే పోలీస్ కేసుల్లో చిక్కుకుంటామనే అపోహలు ప్రజల్లో ఉన్నాయని, అలాంటి భయాలు అవసరం లేదని స్పష్టం చేశారు.ప్రమాద బాధితులను ఆసుపత్రికి తరలించిన వారికి రహ వీర్ పథకం క్రింద రూ.25 వేల ప్రోత్సాహకం అందజేయనున్నట్లు తెలిపారు . రోడ్డు ప్రమాదాల నివారణ కోసం పోలీస్ శాఖ నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో తహశీల్దార్ బషిరోద్దీన్, ట్రాఫిక్ ఏ.సి.పి.శ్రీనివాస్, అధికారులు, పాల్గొన్నారు.

## పదవ తరగతి పరీక్షలు ప్రశాంతం

### జిల్లా విద్యాశాఖ అధికారి జి. శారద

**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** జిల్లాలో పదవ తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని జిల్లా విద్యాశాఖ అధికారి జి. శారద సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.జిల్లాలో పదో తరగతి సాంఘిక శాస్త్రం పరీక్షలు జరిగాయని, ఈ పరీక్షకు (7495) మంది హాజరు కావాల్సి ఉండగా, (7485) మంది హాజరు కాగా,(10) మంది విద్యార్థులు గైర్హాజరు అయ్యారని,99.9 శాతం హాజరు నమోదు కావడం జరిగిందని ఇట్టి పరీక్షకు సంబంధించి ఎలాంటి మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని జిల్లా విద్యాశాఖాధికారి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# పేద ప్రజలకు ముఖ్యమంత్రి సహాయనిధి వరం



### ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** పెద్దపల్లి జిల్లా ప్రధాన వైద్యశాల లో సేవలను సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు కోరారు.పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ఆర్ ఆర్ గార్డెన్స్ లో సోమవారం రోజున ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఎనిమిదవ పోషణ పక్షం 2026 కార్యక్రమంలో పాల్గొని పలువురు మహిళలకు ప్రభుత్వం తరుపున సీమంతం చేసి వారిని ఆశీర్వదించి మరియు 304 మంది అంగన్వాడీ టీచర్లకు రూ. 42.28 లక్షల విలువ గల స్మార్ట్ ఫోన్లు పంపిణీ చేసి అనంతరం 13 మంది దివ్యాంగులకు రూ. 8.60 లక్షల విలువ గల ల్యాప్ టాప్స్, టాబ్స్ పంపిణీ చేసి నియోజవర్గంలోని 513 మంది లబ్ధిదారులకు రూ. 1.62 కోట్ల విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి (సీ.ఎం.ఆర్.ఎఫ్) చెక్కులను పంపిణీ చేసిన అనంతరంమాట్లాడుతూ పేద ప్రజలకు ముఖ్యమంత్రి సహాయనిధి అనేది ఒక ఊరట అని అన్నారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో అన్ని రకాల వసతులు, పూర్తిస్థాయిలో డాక్టర్లు, మందులు, కార్పొరేట్ స్థాయిలో సేవలు అందించి రాష్ట్రంలోనే పెద్దపల్లి జిల్లా ప్రభుత్వ ప్రధాన వైద్యశాల గుర్తింపు తెచ్చుకున్నదని చెప్పారు. ప్రజలు మాత శిశు సంక్షేమం, ఇతరత్రా వైద్య సేవలకు ఆసుపత్రి సేవలను వినియోగించుకోవాలని కోరారు. ఒకవేళ ఈ ఆసుపత్రిలో సేవల కంటే మెరుగైన వైద్య సేవలు అవసరమైన పక్షంలో హైదరాబాద్ లోని నిమ్స్ లో వైద్య సేవలు అందించే బాధ్యత తనదన్నారు. దివ్యాంగులకు ల్యాప్ టాప్స్ మరియు టాబ్స్ పంపిణీ చేసి వారి జీవనోపాధికి ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సంక్షేమ శాఖ జిల్లా అధికారి వేణు గోపాల్, అన్నయ్య గౌడ్, రాధాకృష్ణ, ముస్కాన్ నాజ్ నయ్యర్, అంతటి పుష్పలత, కౌన్సిలర్లు, వ్యవసాయ మార్కెట్ చైర్మన్లు, డైరెక్టర్లు, పలు గ్రామాల సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అంగన్వాడీ టీచర్లు మరియు పాల్గొన్నారు.

# మెడికవర్ ఆసుపత్రిని సీజ్ చేయాలి

### ఎఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి యుగంధర్ ఫిర్యాదు

**ప్రజాపక్షం/కరీంనగర్:** కరీంనగర్ జిల్లా కేంద్రంలో ఉన్న మెడికల్ ఆసుపత్రిని సీజ్ చేయాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత యువజన సమైక్య ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ప్రజావాణిలో జిల్లా అడిషనల్ కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు. అనంతరం ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి భావండ్లపల్లి యుగంధర్ మాట్లాడుతూ, జిల్లా కేంద్రంలోని మెడికవర్ ఆసుపత్రిలోకి రోగులు రోగులుగా వెళ్లి మిగతాజీవులై వస్తున్నటువంటి ఘటనలపై క్షేత్రస్థాయిలో విచారణ జరిపించాలని అదే విధంగా ప్రతి నెలలో వరుసగా ఇద్దరు లేక ముగ్గురు చనిపోతున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు కనీసం పట్టించుకున్న దాఖాలలు లేవన్నారు. తనిఖీలు నిర్వహించాల్సిన డిఎంహెచ్ వో కార్పోరేట్ ఆసుపత్రుల యాజమాన్యాలు ఇచ్చే డబ్బులకు కక్కుర్తి పడి తనిఖీలు నిర్వహించడం లేదని ఆరోపించారు. మేడికవర్ ఆస్పత్రిలో అనుకోకుండా ఎదైన ఫైర్ యాక్సిడెంట్ జరిగిన రోగులు కనీసం బయటకు పరుగేత్త టానికి సైతం వీలు లేకుండా ఆస్పత్రి బిల్డింగ్ నిర్మాణం చేపట్టినారని, అదే విధంగా ఆసుపత్రికి సరైన పార్కింగ్ సౌకర్యం కూడా లేదన్నారు. ఆస్పత్రులకు వచ్చిన రోగులకు వైద్యం చేసే వైద్యులే నిర్లక్ష్యంగా వైద్యం బిపి, షుగర్ కంట్రోలు లేదని లేక వైద్యం చేసే క్రమంలో హార్ట్ స్ట్రోక్ వచ్చిందంటు పిట్ట కథలు చేప్తున్నారని అన్నారు. గతంలో మెడికవర్ ఆస్పత్రిలో జరిగిన మరణాలపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. వినతి పత్రం సమర్పించిన వారిలో ఏఐవైఎఫ్ నగర కార్యదర్శి చెంచాల మురళి, రఘు ,చరణ్, రాజు తదితరులు పాల్గొన్నారు.



# అతివేగం, నిర్లక్ష్యంతోనే రోడ్డు ప్రమాదాలు

### కలెక్టర్ చిత్రా మిశ్రా

**ప్రజాపక్షం/కరీంనగర్:** ప్రస్తుత సమాజంలో అతివేగం, నిర్లక్ష్యంతో వాహనాలు నడిపి ఎందరో విలువైన తమ ప్రాణాలను కోల్పోతున్నారని.. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నిబంధనలు పాటిస్తూ ప్రమాదాల నివారణకు చేయాలని కలెక్టర్ చిత్రా మిశ్రా పేర్కొన్నారు. ప్రజాపాల ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా రోడ్డు ప్రమాదాలను నివారించే ఉద్దేశంతో రెండో విడత అరైవ్ అలైవ్ కార్యక్రమాన్ని తిమ్మాపూర్ మండలం రామకృష్ణ కాలనీలో ప్రారంభించారు. ఈనెల 13 నుంచి 18 వరకు అరైవ్ అలైవ్ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. మొదటి రోజైన సోమవారం పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన గ్రామసభకు కరీంనగర్ సీపీ గౌస్ ఆలం, మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, అదనపు కలెక్టర్ (రెవెన్యూ)లక్ష్మి కిరణ్, రవాణా శాఖ, వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మనం తీసుకునే జాగ్రత్తలతోనే రోడ్డు ప్రమాదాల బారిన పడకుండా ఉంటామన్నారు.



అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా ప్రజల్లో చైతన్యం పెంచి రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు సర్పంచ్ అధ్యక్షతన గ్రామానికి రోడ్డు కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. గ్రామ సభలో రోడ్డు భద్రత నిబంధనలు ప్రజలకు వివరించాలన్నారు. పంచాయతీరాజ్, ఆర్ అండ్ బీ, రవాణా శాఖ అధికారులు, రోడ్డు ప్రమాదాల నివారణకు స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటు చేయాలన్నారు. ప్రాణాల కంటే ఏది విలువైంది కాదని చిన్న చిన్న జాగ్రత్తలు ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. క్షతగాత్రుల కోసం జీజీహెచ్ లో ట్రామా కేర్ ఏర్పాటు చేసినట్లు వివరించారు. గ్రామాల్లో అత్యవసర వేళ సంప్రదించాల్సిన అంబులెన్స్, పోలీసుల నెంబర్ పై అవగాహన కల్పించాలని సూచించారు. అందరి భాగస్వామ్యంతోనే రోడ్డు ప్రమాదాలు తగ్గుముఖం పడతాయని.. ప్రతి ఒక్కరూ రోడ్డుపైకి వచ్చినప్పుడు బాధ్యతతో మెలగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రవాణా శాఖ అధికారి శ్రీకాంత్ చక్రవర్తి, స్థానిక సర్పంచి గుజ్జుల శ్వేతా రెడ్డి, ఉప సర్పంచ్ మల్లేష్ యాదవ్, రోడ్డు రవాణా శాఖ, వివిధ శాఖల అధికారులు సర్పంచులు, పలు ప్రజా ప్రతినిధులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## వడదెబ్బ నుండి రక్షణకు విధిగా వైద్య ఆరోగ్య సూచనలు పాటించాలి



**ప్రజాపక్షం/ సిద్దిపేట:** వేసవికాలంలో వడదెబ్బ నుండి రక్షణ పోందేందుకు వెద్య ఆరోగ్య శాఖ సూచనల మేరకు తప్పనిసరిగా పాటించాలని జిల్లా కలెక్టర్ హైమావతి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయం సమావేశ మందిరంలో వైద్య ఆరోగ్య శాఖ రూపోందించిన అవగాహన పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం ఎండ తీవ్రతతో పాటు వడగాల్పులు ఎక్కువగా వీస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వడదెబ్బ లక్షణాలైన తీవ్రమైన తలనొప్పి, నాలుక ఎండిపోవటం, నాడివేగంగా కొట్టుకోవటం, అధిక దాహం, శరీరంలో నీరు తగ్గిపోవటం, వాంతులు, విరోచనాలు అపస్మారక వంటి లక్షణాలు కనిపించిన వెంటనే బాధితున్ని నీడ ప్రదేశానికి తరలించి చల్లని నీటితో శరీరాన్ని తుడవాలన్నారు. అందుబాటులో ఉన్న మజ్జిక. నిమ్మరసం, కొబ్బరినీళ్లు,ఇవ్వటం ద్వారా శరీరానికి తేమ అందించాలన్నారు. అనంతరం ఆలస్యం చేయకుండ సమీప ఆరోగ్య కేంద్రానికి తరలించాలన్నారు. ప్రజలు సాధ్యమైనంతవరకు ఉదయం. సాయంత్రం వేళల్లో పనులు నిర్వహించుకోవాలన్నారు. ప్రజలల్లో అవగాహన పెంచేందుకు విస్తృత ప్రచార కార్యక్రమాలు న్విహించాలని సూచించారు. ఈకార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి ధనరాజ్, డిఎఫ్ఓ పద్మజారాణి. డిఆర్ఓ నాగరాజమ్మ, అడిషనల్ డిసిపి సుభాష్ చంద్రబోస్ పాల్గొన్నారు.

# భద్రంగా, సామాజిక బాధ్యతగా రోడ్డుపై వెళ్లాలి


### వాహనదారులు, ప్రజల భద్రతకు 'అరైవ్– అలైవ్' కార్యక్రమాలు అమలు

### ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్



**ప్రజాపక్షం/రాజన్నసిరిసిల్ల :** రోడ్డుపై వెళ్లే ప్రతి వాహనదారుడు భద్రంగా.. సామాజిక బాధ్యతగా రోడ్డు భద్రత నియమాలు పాటిస్తూ వెళ్లాలని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా పోలీస్ శాఖ, రవాణా శాఖ ఆద్వర్యంలో ఈ నెల 13వ తేదీ నుంచి 18వ తేదీ నుంచి వారోత్సవాల సందర్భంగా మొదటి రోజు పోలీసుల ఆధ్వర్యంలో కోనరావుపేట మండలం నిజామాబాద్ గ్రామంలో సోమవారం అరైవ్.. అలైవ్ కార్యక్రమాన్ని నిర్వహించగా, ముఖ్యఅతిథిగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితే హాజరయ్యారు. ముందుగా అరైవ్.. అలైవ్ పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డీజీపీ శివధర్ రెడ్డి వీడియో సందేశం వినిపించారు. గ్రామ రోడ్ సేఫ్టీ కమిటీని ఏర్పాటు చేసి.. గ్రామస్తులతో అరైవ్.. అలైవ్ పై ప్రతిజ్ఞ చేయించారు. ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక*లో భాగంగా పోలీస్ శాఖ ఆద్వర్యంలో అరైవ్.. అలైవ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డీజీపీ శివధర్ రెడ్డి సందేశం ప్రకారం యుద్ధాలు, వ్యాధుల ఇతర కారణాలతో ఎక్కువ మరణాలు జరగడం లేదని, రోడ్డు ప్రమాదాల్లోనే ఎక్కువ మంది మృతి చెందుతున్నారని వెల్లడించారు. ప్రతి వాహనదారుడు సామాజిక బాధ్యతగా రోడ్డు భద్రత నియమాలు పాటించాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ పెట్టుకోవాలని, కార్లలో తప్పనిసరిగా సీట్ బెల్ట్ పెట్టుకోవాలని తెలిపారు. ట్రాఫిక్ రూల్స్ పాటించాలని సూచించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వద్దని, మేజర్లకే జాగ్రత్తలు చెపుతూ వాహనాలు ఇవ్వాలని స్పష్టం చేశారు. సంక్షేమమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కచ్చకాయల ఎల్లయ్య, ప్రభాకర్, గ్రామ సర్పంచ్ శ్రీహరి, దేవరాజ్, డీఎస్పీ శ్రీనివాసులు,వరలక్ష్మి , నటరాజ్ పాల్గొన్నారు.

## పదవ తరగతి పరీక్ష కేంద్రాలను తనిఖీ



**ప్రజాపక్షం/కరీంనగర్:** కరీంనగర్ లోని పారామిత హై స్కూల్ సిద్ధార్థ హై స్కూల్ లో పదో తరగతి పరీక్ష కేంద్రాలను సోమవారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు రాస్తున్న పరీక్ష తీరును పరిశీలించారు. సిబ్బంది నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పరీక్షల నిర్వహణ ఎలా సాగుతున్నది. విద్యార్థుల హాజరు తదితర అంశాలపై ఆరా తీశారు. కరీంనగర్ జిల్లాలో పదవ తరగతి పరీక్షలు పకడ్బందీగా జరుగుతున్నాయని ప్రశాంతమైన వాతావరణంలో విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారని అడిషనల్ కలెక్టర్ పేర్కొన్నారు.

## హెల్మెట్ తప్పనిసరి

ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు

**ప్రజాపక్షం / హాజీపూర్ :** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా మంచిర్యాల జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రాపల్లి గ్రామంలో రోడ్డు భద్రత అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు మాట్లాడుతూ వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల ప్రాణాపాయం ఉంటుందని హెచ్చరించారు. రోడ్డుపై వాహనాలతో వెళ్లేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు. అనంతరం రహదారులు, భవనాల శాఖ మరియు పోలీసు అధికారులకు రోడ్డు భద్రతకు సంబంధించి పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ప్రమాదాల నివారణకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిసిపి భాస్కర్, ఎసిపి ప్రకాష్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాల నియంత్రణకు సమష్టి కృషి: కలెక్టర్ ఇలా త్రిపాఠి



**ప్రజాపక్షం/నిజామాబాద్ :** రోడ్డు ప్రమాదాల నియంత్రణకు అందరం కలిసికట్టుగా కృషి చేద్దామని కలెక్టర్ ఇలా త్రిపాఠి పిలుపునిచ్చారు.ప్రజాపాలనప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా సోమవారం అన్ని గ్రామపంచాయతీల పరిధిలో సర్పంచ్‌ల అధ్యక్షతన అరైవ్ అలైవ్ అమలుపై గ్రామ సభలు నిర్వహించారు. ఇందులో భాగంగానే ఆర్మూర్ మండలం పిప్రి గ్రామంలో జరిగిన గ్రామసభలో జిల్లా కలెక్టర్ పాల్గొని రోడ్డు ప్రమాదాల నియంత్రణకు కృషి చేసేలా కలెక్టర్ సమక్షంలో అంగన్‌వాడీ కార్యకర్త, ఆశావర్కర్, గ్రామపెద్దలతో కూడిన 9 మంది సభ్యులు గల రోడ్డు సేఫ్టీ కమిటీని ఎన్నుకున్నారు. రోడ్డు ప్రమాదాలను నిలవరించేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేయించి మాట్లాడారు. ప్రమాదాలను నియంత్రించాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీ స్థాయి అత్యున్నత అధికారులు ప్రజల్లో అవగాహనను పెంపొందిస్తూ వారిని భాగస్వాములు చేసేందుకు అరైవ్ అలైవ్ పేరిట కార్యక్రమాలను అమలు చేస్తున్నారన్నారు. మే 1 నుండి గ్రామంలో ప్లాస్టిక్ వాడకాన్ని విడనాడాలని, గంజాయి, మత్తు పదార్థాలను విక్రయించే వారి సమాచారాన్ని అందించిన వారికి తగిన పారితోషికం అందిస్తూ వారి పేర్లను గోప్యంగా ఉంచాలని గ్రామంలో ప్రతిఒక్కరూ తప్పక హెల్మెట్ ధరించాలని, రోడ్లపై ధాన్యం ఆరబెట్టకుండా రైతులకు అవగాహన కల్పించాలని, శబ్ద కాలుష్యాన్ని కలిగించేడీజెలను నిషేధించాలని ఏకగ్రీవంగా తీర్మానాలు చేశారు. ఈ గ్రామసభకు సర్పంచ్ కిరణ్ అధ్యక్షత వహించగా డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ దుర్గాప్రమీల, జిల్లా రవాణాధికారి ఉమామహేశ్వర్‌రావు, ఎంపీడీఓ శివాజీ, తహసీల్దార్ సత్యనారాయణ, ఎంపీఓ శ్రీనివాస్, ఆర్మూర్ ఎస్‌హెచ్‌ఓ సత్యనారాయణ, ఎంవీఓ రాహుల్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి మురళి, గ్రామస్తులు పాల్గొన్నారు.

## లక్ష్య సాధనలో అంకితభావంతో పనిచేయాలి: కలెక్టర్ కె.హరిత



**ప్రజాపక్షం / ఆసిఫాబాద్ :** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలులో భాగంగా జిల్లాలో అత్యధికంగా కూలీల సమీకరణ చేపట్టి, లక్ష్య సాధనలో విశేష కృషి చేసిన ఫీల్డ్ అసిస్టెంట్లను జిల్లా కలెక్టర్ కె. హరిత ప్రత్యేకంగా అభినందించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ సముదాయ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రతిభ కనబరిచిన ఫీల్డ్ అసిస్టెంట్లను ఆమె శాలువాతో ఘనంగా సత్కరించి జ్ఞాపికలను బహుమతిగా అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు ఉపాధి కల్పించడంలో ఫీల్డ్ అసిస్టెంట్ల పాత్ర అత్యంత కీలకమని అన్నారు. జిల్లాలో ఉపాధి హామీ పథకాన్ని మరింత పకడ్బందీగా అమలు చేయాలని, క్షేత్రస్థాయిలో కూలీల సమీకరణను ఇంకా ముమ్మరం చేయాలని ఆమె ఆదేశించారు. ప్రస్తుతం సాధించిన పురోగతిపై సంతృప్తి వ్యక్తం చేస్తూనే, రాబోయే రోజుల్లో జిల్లాను రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలపడానికి ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ కూలీల సంఖ్యను పెంచేందుకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి బి. దత్తారావు, తిర్యాణి ఎంపిడిఒ వి. మల్లేష్, ఏపిఒలు, సంబంధిత మండలాల ఫీల్డ్ అసిస్టెంట్లు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## హౌస్ లిస్టింగ్ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలి: భారతి హోళీకేరి



**ప్రజాపక్షం/నిజామాబాద్ :** జనగణనలో భాగంగా చేపట్టనున్న హౌస్ లిస్టింగ్ (ఇళ్ల గణన) ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని జనగణన రాష్ట్ర సంచాలకులు భారతి హోళీకేరి అన్నారు. సోమవారం హైదరాబాద్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లతో ఇళ్ల గణన కార్యక్రమం నిర్వహణ ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. జనగణనలో భాగంగా మే 11 నుండి నిర్వహించే ఇళ్ల గణన ప్రక్రియను ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. హౌస్ లిస్టింగ్‌లో భాగంగా ఇళ్ల జాబితా బ్లాక్‌లను రూపొందించాలని ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్ల నియామకం, మండల స్థాయిలో శిక్షణ కార్యక్రమాలు పూర్తి చేయాలన్నారు. ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా అధికారులు క్షేత్రస్థాయిలో పక్కాగా పర్యవేక్షించాలని, ఇళ్ల గణన, జనగణన జాబితా ప్రకారం అర్హులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడంలో దోహదపడుతాయన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ హౌస్ లిస్టింగ్ ప్రక్రియను చేపట్టేందుకు వీలుగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. ఇళ్ల గణన కోసం ఆరు మండలాలు మినహా జిల్లావ్యాప్తంగా అన్ని చోట్ల సరిహద్దుల నిర్ధారణ పూర్తయిందని, మిగిలిపోయిన మండలాల్లోనూ 15లోగా పూర్తి చేస్తామన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ దిలప్‌కుమార్, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు బాలరాజ్ పాల్గొన్నారు.

# ఆడపిల్లలు ఆత్మస్థైర్యంతో ముందడుగు

డిజిపి శివధర్ రెడ్డి



**ప్రజాపక్షం/ ఆదిలాబాద్ అర్బన్ :** ఆడపిల్లలు మనోధైర్యం కోల్పోకుండా ఆత్మస్థైర్యాన్ని, ధైర్యాన్ని అలవర్చుకోవాలని రాష్ట్ర డిజిపి శివధర్ రెడ్డి సూచించారు. సోమవారం ఆదిలాబాద్ జిల్లా పర్యటనలో భాగంగా ఆయన ఏఆర్ హెడ్ క్వార్టర్స్‌లో నిర్వహించిన పలు కార్యక్రమాల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జిల్లావ్యాప్తంగా ఆడపిల్లలకు ఆత్మరక్షణ విద్యల్లో శిక్షణ ఇచ్చేందుకు చేపట్టిన 'ఆపరేషన్ జ్వాలా' ముగింపు కార్యక్రమంలో డిజిపి ప్రసంగించారు. జిల్లాలోని 135 పాఠశాలలకు చెందిన 10 వేల మంది విద్యార్థినులకు కరాటే శిక్షణ ఇచ్చినట్లు ఆయన తెలిపారు. ఎలాంటి కష్ట పరిస్థితులనైనా ఎదుర్కొనేలా విద్యార్థినులకు కరాటే శిక్షణ ఇచ్చినట్లు ఆయన తెలిపారు. ఎలాంటి కష్ట పరిస్థితులనైనా ఎదుర్కొనేలా విద్యార్థినులను సిద్ధం చేయడం అభినందనీయమన్నారు. ఖాకీ కిడ్స్ కార్యక్రమంలో భాగంగా 190 పాఠశాలల్లో 15 వేల మందికి ట్రాఫిక్ నిబంధనలు, సైబర్ నేరాలపై అవగాహన కల్పించామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా శిక్షణ పొందిన విద్యార్థులకు ఆయన బ్యాచ్‌లను అందజేశారు. అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా మైనర్ డ్రైవింగ్ చేసిన 400 మందికి, వారి తల్లిదండ్రులకు నిర్వహించిన కౌన్సిలింగ్‌లో డిజీపీ మాట్లాడారు. పిల్లలకు సరైన వయస్సు వచ్చే వరకు తల్లిదండ్రులు వాహనాలు ఇవ్వవద్దని హితవు పలికారు. మైనర్ డ్రైవింగ్ వల్ల కలిగే ప్రమాదాల గురించి వివరిస్తూ, నిబంధనలు ఉల్లంఘిస్తే ప్రాణాలకే ముప్పు అని హెచ్చరించారు. అనంతరం విద్యార్థులకు రహదారి సూచికలు, జాగ్రత్తలపై అవగాహన కల్పించేందుకు జిల్లాలో మొదటి సారిగా ఏర్పాటు చేసిన ట్రాఫిక్ పార్కును ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఐజీ గజరావ్ భూపాల్, ఎస్పి అఖిల్ మహాజన్, అదనపు ఎస్పిలు సురేందర్‌రావు, మౌనిక, శిక్షణ ఐపీఎస్ రాహుల్ కాంత్, డిఎస్‌పి జీవన్‌రెడ్డి, పట్టణ సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

## 'నో హెల్మెట్.. నో ఎంట్రీ' గ్రామంగా నందగోకుల్ ఆదర్శం: కలెక్టర్ ప్రతిమాసింగ్



**ప్రజాపక్షం/నిజాంపేట :** ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మెదక్ జిల్లాలో గ్రామసభల ద్వారా అరైవ్ అలైవ్ కార్యక్రమం నిర్వహించారు. నిజాంపేట మండలం నందగోకుల్ గ్రామంలో గ్రామస్తుల ఏకగ్రీవ తీర్మానం మేరకు నో హెల్మెట్.. నో ఎంట్రీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ ప్రతిమాసింగ్, ఎస్పీ డీవీ శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరై గ్రామస్థుల నుంచి ఘన స్వాగతం అందుకున్నారు. అనంతరం హెల్మెట్‌లతో ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రోడ్డు భద్రత కోసం ప్రతీ ఒక్కరు హెల్మెట్ ధరించడం తప్పనిసరని, నందగోకుల్ గ్రామాన్ని ఆదర్శంగా తీసుకొని అన్నిగ్రామాల్లో ఈ కార్యక్రమాన్ని అమలు చేయాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో ప్రజలు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కోరారు. అనంతరం రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, ప్రత్యేకాధికారి దేవకుమార్, సర్పంచ్ పాతూరు భాను, ఎంపీడీఓ రాజిరెడ్డి,డీఎస్పీ నరేందర్‌గౌడ్, సీఐ వెంకటరాజా గౌడ్, పోలీసు అదికారులు పాల్గొన్నారు.

## ఎసిబి నూతన కార్యాలయం ప్రారంభం



**ప్రజాపక్షం/నిజామాబాద్ :** అవినీతి నిరోధక శాఖ నూతన కార్యాలయాన్ని సిపి సాయిచైతన్య ప్రారంభించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సుభాష్‌నగర్‌లోని పాత ఆర్‌అండ్‌బి గెస్ట్‌హౌస్‌లో నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల పరిధిలో నూతన కార్యాలయం ఏర్పాటు చేశారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిపి సాయిచైతన్య విచ్చేసి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ కమలాకర్‌రెడ్డి, డీఎస్పీ ఏసీబీ శేఖర్‌గౌడ్, ఇన్‌స్పెక్టర్లు వేణుకుమార్, నగేష్ సిబ్బంది పాల్గొన్నారు.

# సహారా బాధితుల డబ్బులు చెల్లించాలని ధర్నా



**ప్రజాపక్షం / మందమర్రి :** మంచిర్యాల జిల్లా మందమర్రి మార్కెట్‌లోని సహారా కార్యాలయం ముందు బాధితులు భారీ ధర్నా నిర్వహించారు. సంవత్సరాలుగా తమ కష్టార్జితం తిరిగి రాకపోవడంతో సహారా ఇండియా సంస్థపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ నిరసన చేపట్టారు. ఫిక్స్‌డ్ డిపాజిట్ల కాలపరిమితి ముగిసి ఐదేళ్లు గడుస్తున్నా ఇప్పటికీ చెల్లింపులు జరగకపోవడం అన్యాయమని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. నల్ల బ్యాడ్జీలు ధరించి, ప్లకార్డులు పట్టుకుని తమ నిరసనను తెలియజేశారు. తమ డిపాజిట్ మొత్తాలను వెంటనే చెల్లించకపోతే జిల్లావ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సమస్యపై ప్రజాప్రతినిధులు, ముఖ్యంగా రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకట స్వామి, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీ కృష్ణ వెంటనే స్పందించి పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం కార్యాలయ మేనేజర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘం, తెలంగాణ ఉద్యమకారుల ఐక్య వేదిక ప్రతినిధులు గజెల్లి వెంకటయ్య, సిహెచ్ సంజీవ్, డి రాజమౌళి, రామ్ నరేష్ బాబు, సిహెచ్ సంపత్, ఎస్ మధు, దుర్గం మల్లేశ్వరి, భేరి రమాదేవి, దూత లక్ష్మి, పాషా, అబేదా పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నియంత్రణ అందరి బాధ్యత

జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య

అన్ని శాఖల సమన్వయంతో ప్రమాదాల నివారణకు కృషి చేయాలి

జిల్లా ఎస్‌పి పరితోష్ పంకజ్




**ప్రజాపక్షం/సంగారెడ్డి :** జిల్లాలో రోడ్డు ప్రమాదాల నియంత్రణ ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య అన్నారు. ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా సోమవారం సంగారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని 24,26 వార్డుల్లో పోలీసు మున్సిపల్ శాఖల ఆధ్వర్యంలో నిర్వహించిన అరైవ్–అలైవ్ అవగాహన కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల వల్ల అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల్లో అవగాహన పెంపొందించి వారిని భాగస్వాములుగా చేసుకునే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం అరైవ్– అలైవ్ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నదని తెలిపారు. హైవేలపై వాహనాలు అధిక వేగంగా నడపడం వల్ల ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని పేర్కొన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్‌ను తప్పనిసరిగా ధరించాలని అది ప్రాణాలను రక్షించే శిరస్త్రాణమని అన్నారు. కారులో ప్రయాణించే వారు సీట్ బెల్ట్ ధరించడం తప్పనిసరి అని సూచించారు. వాహనం నడుపుతూ మొబైల్ ఫోన్ ఉపయోగించకూడదని, మద్యం సేవించి డ్రైవింగ్ చేయకూడదని హెచ్చరించారు. ఇంటి పెద్దలు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ పిల్లలకు మంచి ఉదాహరణగా నిలవాలని కోరారు. జిల్లా మొత్తాన్ని ప్రమాదరహిత జిల్లాగా తీర్చిద్దేందుకు అందరూ సహకరించాలని పిలుపు నిచ్చారు. జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు అన్ని శాఖల సమన్వయంతో చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ముఖ్యంగా హైవేలపై ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయని సంవత్సరానికి 400 మందికి పైగా ప్రాణాలు కోల్పోతున్నారని చెప్పారు. టూ వీలర్ ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని ఒకే బైక్ పై ముగ్గురు, నలుగురు ప్రయాణించడం ప్రమాదకరమని హెచ్చరించారు. హెల్మెట్ లేకుండా ప్రయాణించడం వల్ల ప్రమాద సమయంలో ప్రాణ నష్టం ఎక్కువగా జరుగుతుందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ భద్రతా నిబంధనలు పాటిస్తూ సురక్షిత ప్రయాణం చేయాలని సూచించారు. అడిషనల్ కలెక్టర్ పాండు మాట్లాడుతూ మైనర్లకు వాహనాల తాళాలు ఇవ్వకుండా పెద్దలు జాగ్రత్తలు తీసుకోవాలని బయటకు వెళ్తూ హెల్మెట్ ధరించడం అలవాటు చేసుకోవాలని అన్నారు. ప్రతి కుటుంబం రోడ్డు భద్రతా నియమాలను పాటిస్తే ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ వనిత సంతోష్, సబ్ కలెక్టర్ ఉమా హారతి, వార్డు కౌన్సిలర్లు , పోలీసు అధికారులు,ప్రజలు యువత తదితరులు పాల్గొన్నారు.

## రైతులు ఆందోళన చెందొద్దు

అంతటా మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తాం

ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్



**ప్రజాపక్షం/బైంసా :** రైతులు తమ పంటను తక్కువ ధరకు అమ్మి నష్టపోవద్దని నియోజకవర్గంలో రైతాంగానికి సరిపడ మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే పవార్ రామారావ్ పటేల్ తెలియజేశారు.సోమవారం గొల్లమాడ,తిమ్మాపూర్ గ్రామాలకు చెందిన రైతులు తమ గ్రామాల్లో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల సబ్ సెంటర్‌లు ఏర్పాటు చేయాలని బైంసాలో వినతి పత్రం అందించిన సందర్భంగా అయన మాట్లాడారు.రైతుల పంటను పూర్తి స్థాయిలో ప్రభుత్వం కొనుగోలు చేసేలా చర్యలు చేపట్టనున్నట్లు వెల్లడించారు.కొన్ని చోట్ల కేంద్రాలను ప్రారంభించడం జరిగిందని,అవసరమైన చోట్ల కేంద్రాలు ఏర్పాటు చేస్తామని చెప్పారు.ఈ పాటికి సమస్యను అధికారులకు, సంబంధిత మంత్రికి తెలియజేయడం జరిగిందన్నారు.కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు విషయంలో ప్రభుత్వం జాప్యం చేస్తే రైతుల వినతి పత్రం సమర్పించిన వారిలో తిమ్మాపూర్ సర్పంచ్ రాజేందర్,గొల్లమాడ మాజీ సర్పంచ్ చిన్న మహేష్,నాయకులు వినోద్ రెడ్డి,సత్యం,విజయ్,తదితరులు పాల్గొన్నారు.

## 'మన ఇసుక-వాహనం' పోర్టల్ పటిష్ఠంగా అమలు: కలెక్టర్ రాజర్షిషా



**ప్రజాపక్షం/ ఆదిలాబాద్ అర్బన్:** ఇసుక బుకింగ్, రవాణా ప్రక్రియలో జాప్యం జరగకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో 'మన ఇసుకవాహనం' పోర్టల్‌పై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఇసుక బుకింగ్ కోసం బిల్డింగ్ పర్మిషన్ లేదా పన్ను రసీదులు తప్పనిసరని, కేవలం ట్రాక్టర్ ఆర్సీతో అనుమతులు ఇవ్వకూడదని స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రస్తుతం ఉన్న 8 ట్రిప్పుల ఇసుక కోటాను అవసరమైతే 12 ట్రిప్పుల వరకు పెంచేలా చర్యలు తీసుకుంటామన్నారు. దరఖాస్తులను తహసీల్దార్లు, వార్డు ఆఫీసర్లు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సాంకేతిక సమస్యల కోసం ప్రత్యేక హెల్ప్‌లైన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు. ఈ సమావేశంలో ఆర్డీఓ స్రవంతి, డీపీఓ రమేష్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# అతివేగం, అజాగ్రత్త తప్పిదాలతో ప్రమాదాలు

మెదక్ డిఎస్‌పి ప్రసన్నకుమార్

'ప్రమాదాల నివారణపై' కొత్తపల్లిలో అవగాహన సదస్సు



**ప్రజాపక్షం/పాపన్నపేట :** అతివేగం, అజాగ్రత్త, తప్పిదాలతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, ఈ ప్రమాదాలలో ముఖ్యంగా యువ త ప్రమాదాల బారిన పడి ప్రాణాలు కోల్పోతున్నారని మెదక్ డిఎస్‌పి ప్రసన్నకుమార్, రూరల్ సిఐ జార్జ్ అన్నారు. మండల పరిధిలోని కొత్తపల్లి లో రోడ్డు భద్రతా వారోత్సవాలు, ప్రభుత్వ ఆదేశాల మేరకు, పోలీస్, రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో ప్రజా పాలన, ప్రగతి ప్రణాళిక లో భాగంగా అరవ్– అలైవ్ కార్యక్రమం ద్వారా వాహనదారులకు, ప్రజలకు రోడ్డు భద్రతా, నియమాలు, నిబంధనలపై అవగాహన కల్పించారు. అవగాహన కార్యక్రమానికి ప్రజలు, మహిళలు, వాహనదారులు భారీ ఎత్తున తరలివచ్చి అవగాహన సదస్సులో పాల్గొన్నారు. ఈ కార్యక్రమం సర్పంచ్ కుమ్మరి పద్మ జగన్, అధ్యక్షతన నిర్వహించగా వివిధ శాఖల అధికారులు పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా డీఎస్పీ ప్రసన్నకుమార్ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించడం వల్ల ప్రాణాలకు రక్షణ కవచంలా ఉంటుందని, అందువల్ల ప్రతి ఒక్క వాహనదారుడు హెల్మెట్ తోపాటు సీటు బెల్టు ధరించాలన్నారు. పోలీసుల జరిమానా విధిస్తారని హెల్మెట్ ధరించడం కాదు. మీ ప్రా ణాలు కాపాడుకోవడం కోసమన్నారు. ఎవరికి వాళ్లు స్వతహాగా నియమాలు పాటిస్తే రోడ్డు ప్ర మాదాలను తగ్గించవచ్చున్నారు. ప్రమాదాలు ఎక్కువగా నిర్లక్ష్యం, అతి వేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం, సెల్ ఫోన్, మైనర్లు, డ్రైవింగ్, ఓవర్ టర్నింగ్ పాయింట్ వద్ద క్రాసింగ్‌లు చేయడంవల్ల ప్ర మాదాలు జరుగుతున్నాయన్నారు. హెల్మెట్ లేనివారికి హెల్మెట్ పంపిణీ చేస్తామని సభాముఖంగా సర్పంచ్ భర్త జగన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్టీవో వెంకటస్వామి, ఆర్టీసీ డిపో మేనేజర్ సురేఖ, తహసీల్దార్ సతీష్ కుమార్, ఆ ర్‌అండ్‌బి డిఈ వెంకటేశం, పిఆర్‌ఏఇ. శ్రీ కాంత్, మెడికల్ ఆఫీసర్ ప్రదీప్ రావు, ఎక్సైజ్ సీఐ నాగేశ్వరరావు, స్థానిక ఎస్సై శ్రీనివాస్ గౌ డ్, ఉప సర్పంచ్ నాయకులు రాము, రామకిష్టయ్య, గడ్డంరాజు,భూమేష్, దుర్గేష్,సోమశేఖర్, నహిమొద్దీన్, శేఖర్ గౌడ్ పాల్గొన్నారు.

# గ్రామాల్లో బెల్టు జోరు..

# మత్తులో యువత చిత్తు





**ప్రజాపక్షం/ నేరడిగొండ :** మండల పరిధిలోని 32 గ్రామ పంచాయతీల్లో అక్రమ బెల్టు షాపులు విచ్చలవిడిగా వెలిశాయి. తాగడానికి నీళ్లు దొరకని గ్రామాల్లో కూడా మద్యం ఏరులై పారుతోంది. కిరాణా షాపుల్లో సైతం మద్యం విక్రయాలు మూడు పువ్వులు; ఆరు కాయలుగా సాగుతండటంతో గ్రామీణ యువత మద్యానికి బానిసలై భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారు. గ్రామాల్లో 24 గంటల పాటు మద్యం అందుబాటులో ఉండటం వల్ల కుటుంబాల్లో గొడవలు పెరిగి దంపతుల మధ్య చిచ్చు రేగుతోంది. కష్టపడి సంపాదించిన కూలీ డబ్బులన్నీ మద్యానికే ఖర్చు చేస్తుండటంతో సామాన్య కుటుంబాలు అప్పుల ఊబిలో మగ్గిపోతున్నాయి. మద్యం మత్తులో వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు కూడా పెరుగుతున్నాయి. సంబంధిత శాఖల పర్యవేక్షణ లోపం వల్లే అక్రమ బెల్టు షాపులు పెరుగుతున్నాయని, అధికారులు మామూళ్ల మత్తులో ఉండి చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గ్రామాల్లోని బెల్టు షాపులను నిర్మూలించాలని, లేనిపక్షంలో గ్రామీణ సమాజం సామాజికంగా, ఆర్థికంగా చిన్నభిన్నం అయ్యే ప్రమాదం ఉందని మేధావులు హెచ్చరిస్తున్నారు.

## ప్రజావాణి దరఖాస్తులను పరిష్కరించాలి

జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** ప్రజావాణి కార్యక్రమంలో స్వీకరించిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని,ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను స్వయంగా స్వీకరించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ,ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖల అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి,తక్షణమే స్పందించాలని సూచించారు.మండలాల వారీగా పెండింగ్‌లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని ఆదేశించా రు.ప్రజల సమస్యలను సంబంధిత శాఖలు పరస్పర సమన్వయంతో పరిష్కరించేలా చర్యలు తీ సుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రజలు విద్య, వైద్యం, ఇందిరమ్మ ఇండ్లు, పింఛన్లు, భూ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులను సమర్పించారు.ప్రజావాణఇ కార్యక్రమం అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను వేగవంతం చేసి సమయానికి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మండల ప్రత్యేక అధికారులు ప్రభుత్వ వసతి గృహాలను నిరంతరం తనిఖీ చేయాలని తెలిపారు.అలాగే ముఖ్యమంత్రి బాసర పర్యటనను విజయవంతంగా నిర్వహించినందుకు అధికారులను అభినందించారు.ఇంటర్మీడియాట్ పరీక్షలో మంచి ఫలితాలు సాధించినందుకు సంబంధిత అధికారులకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్(రెవెన్యూ)కిషోర్ కుమార్, ఆర్డీఓ రత్నకళ్యాణి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ముంబయిపై బెంగళూరు గెలుపు



**ముంబయి:** ఐపిఎల్ 2026లో భాగంగా ముంబయి ఇండియన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు 18 పరుగుల తేడాతో విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఆర్‌సిబి 4 వికెట్ల నష్టానికి 240 పరుగులు చేసింది. ఈ భారీ లక్ష్యఛేదనలో ముంబయి 5 వికెట్లు కోల్పోయి 22 పరుగులు చేసింది. రూథర్‌ఫోర్డ్ (71*; 31 బంతుల్లో 1 ఫోర్, 9 సిక్సు) పోరాడినా ముంబయికి ఓటమి తప్పలేదు. హార్దిక్ పాండ్య (40), రికెల్టన్ (37), సూర్యకుమార్ యాదవ్ (33), రోహిత్ శర్మ (19 రిటైర్డ్ హార్ట్) పరుగులు చేశారు. ఆర్సీబీ బౌలర్లలో సుయాశ్ శర్మ 2, జాకబ్ డఫీ, కృనాల్ పాండ్య, రసిఖ్ సలామ్ ఒక్కో వికెట్ తీశారు. ఈ సీజన్‌లో మూడో విజయం కాగా.. ముంబయికి మూడో ఓటమి. బెంగళూరుకు ఇది తొలుత బ్యాటింగ్ చేసిన బెంగళూరు బ్యాటర్లలో ఫిల్ సాల్ట్ (78; 36 బంతుల్లో 6ఫోర్లు, 6 సిక్సు), రజత్ పటిదార్ (53; 20 బంతుల్లో 4 ఫోర్లు, 5 సిక్సు) ఆకాశమేహద్దుగా చెలరేగారు. విరాట్ కోహ్లి (50; 38 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్) రాణించగా.. టిమ్ డేవిడ్ (34*; 16 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్స్) చివర్లో మంచి ఫినిషింగ్ ఇచ్చాడు. ముంబయి బౌలర్లలో ట్రెంట్ బౌల్ట్, హార్దిక్ పాండ్య, మిచెల్ శాంట్నర్, శార్దూల్ ఠాకూర్ ఒక్కో వికెట్ తీశారు.

## మహిళల టి-20 వరల్డ్ కప్... రూ.82 కోట్ల ప్రైజ్‌మనీ ప్రకటించిన ఐసిసి



**దుబాయ్:** ఈ ఏడాది జూన్‌లో మహిళల టి20 వరల్డ్ కప్ జరగనున్నది. దీని కోసం సోమవారం ఎసిసి ప్రైజ్‌మనీ ప్రకటించింది. వరల్డ్ కప్ విజేతలకు అందజేసే ప్రైజ్‌మనీని రికార్డు స్థాయిలో పెంచేసింది. రెండు నెలల పాటు ఇంగ్లండ్, వేల్స్‌లో జరిగే వరల్డ్ కప్ కోసం సుమారు రూ.82 కోట్ల వరల్డ్ కప్ ప్రకటించింది ఐసిసి. గత ఎడిషన్‌తో పోలిస్తే సుమారు 10 శాతం ప్రైజ్‌మనీ పెంచారు. ఈసారి ఈ టోర్నీలో మొత్తం 12 జట్లు పాల్గొననున్నాయి. 2024లో కేవలం 10 జట్లు మాత్రమే పాల్గొన్నాయి. జూన్ 12 నుంచి జూలై 5వ తేదీ వరకు ఏడు వేదికల్లో టోర్నీ జరగనున్నది. లార్డ్స్ మైదానంలో ఫైనల్ మ్యాచ్ ఆడుతారు. గత వరల్డ్ కప్ ప్రైజ్‌మనీ రూ.74 కోట్లు కాగా, ఈసారి 82 కోట్లు ఇవ్వనున్నారు. వరల్డ్ కప్ విజేతలు ఈసారి రూ.21.8 కోట్ల ప్రైజ్మనీ గెలుచుకుంటారు. ఇక రన్నరప్‌కు రూ.10 కోట్లు ఇవ్వనున్నారు. సెమీఫైనల్లోకి ఎంటరైన జట్లకు రూ.6.29 కోట్లు ఇవ్వనున్నారు. ఇక గ్రూపు మ్యాచ్ ఆడిన ప్రతి జట్టుకు రూ.29 లక్షలు ఇవ్వనున్నారు. ప్రతి జట్టుకు కనీసం రూ.రెండు కోట్లు దక్కే అవకాశాలు ఉన్నట్లు ఐసిసి తన ప్రకటనలో పేర్కొన్నది. జూన్ 12న బర్మింగ్‌హోమ్‌లో శ్రీలంక, ఇంగ్లండ్ మధ్య ఫస్ట్ మ్యాచ్ జరుగుతుంది. ఆస్ట్రేలియా, బంగ్లాదేశ్, ఇండియా, ఐర్లాండ్, నెదర్లాండ్స్, న్యూజిలాండ్, పాకిస్థాన్, స్కాట్‌ల్యాండ్, దక్షిణాఫ్రికా, వెస్ట్ ఇండీస్ కూడా టోర్నీలో ఉన్నాయి. 24 రోజుల్లో మొత్తం 33 మ్యాచ్‌లు ఆడనున్నారు.


## రోయింగ్‌లో తెలంగాణ పతక జోరు



కటక్(ఒడిశా) వేదికగా జరిగిన ఆల్‌ఇండియా ఇండోర్ రోయింగ్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ రోయర్లు పతక జోరు కనబరిచారు. నాలుగు రోజుల పాటు జరిగిన టోర్నీలో రెండు స్వర్ణాలు సహా మూడు రజతాలు, రెండు కాంస్య పతకాలతో మెరిశారు.
అండర్-15 బాలికల పెయిర్లో వర్షిత, ధాత్రి, లావణ్య, దేవేంద్రమ్మతో కూడిన తెలంగాణ పసిడి సొంతం చేసుకుంది. అండర్-15 బాలుర పెయిర్లో యశ్వంత్, సాయితేజ రజతం దక్కించుకున్నారు. బాలుర రిలేలో యశ్వంత్, సాయితేజ వెండి పతకం దక్కించుకున్నారు.

## యువతరంగం

## ఉపాధ్యాయ-విద్యార్థి సంబంధాన్ని పునర్నిర్వచిస్తున్న కృత్రిమ మేధ!



కృత్రిమ మేధస్సు (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ - ఎఐ) విద్యారంగంలో ప్రవేశించడం కేవలం ఒక సాంకేతిక మార్పుగా మాత్రమే చూడలేం. ఇది విద్య యొక్క లక్ష్యాలు, బోధనా విధానాలు, మూల్యాంకన పద్ధతులు, ఉపాధ్యాయ-విద్యార్థి సంబంధాన్ని కూడా మౌలికంగా పునర్నిర్వచించే స్థాయిలో ఉంది. జాతీయ విద్యా విధానం (ఎన్ఇపి) 2020 ఊహించిన సాంకేతిక ఆధారిత విద్యా వ్యవస్థకు ఎఐ కీలక సాధనంగా మారింది. అయితే, ఎఐని కేవలం ఉపకరణంగా ఉపయోగించడమే సరిపోదు. దాన్ని సమర్థవంతంగా విద్యలో ఏకీకృతం చేయాలంటే మూడు 'ఎ'లుగా పేర్కొనే అడాప్షన్, అబ్జార్ప్షన్, అప్లికేషన్ (స్వీకరణ, అవగాహన, అనుసరణ) అనే దశలను పాఠ్యాంశాలలో భాగం చేయాల్సిన అవసరం ఉంది. ఈ విధానం విద్యను మేధోపరమైన, నైతికమైన, వాస్తవ ప్రపంచ సమస్యల పరిష్కార దిశగా మళ్లిస్తుంది. మూడు 'ఎ'లు విధానం అనేది సంప్రదాయంగా కంఠస్థం చేసే విద్య నుంచి ఎఐకు సిద్ధమైన బోధనా పద్ధతికి మారేందుకు రూపొందించిన ఒక నిర్మిత మార్గదర్శకం. మొదటి దశ అయిన 'స్వీకరణ' అంటే ఎఐ సాధనాలను అంగీకరించడం మరియు పరిచయం చేయడం. విద్యార్థులు, ఉపాధ్యాయులు పెద్ద భాషా నమూనాలు (ఎల్ఎల్ఎం), డిజిటల్ అసిస్టెంట్లు, చిత్ర సృష్టి సాధనాలు వంటి వాటితో సౌకర్యంగా పనిచేయగలగడం ఈ దశ లక్ష్యం. ఎఐ పట్ల ఉండే భయం లేదా అపోహలను తొలగించి, డిజిటల్ సాక్షరతను పెంపొందించడం ద్వారా సాంకేతికతను సహజమైన భాగంగా మార్చడం దీనిలో ప్రధాన ఉద్దేశ్యం. ఈ దశలో విద్యార్థులు ప్రశ్నలను సరైన విధంగా అడగడం, పనులను ఆటోమేషన్ ద్వారా వేగంగా చేయడం, కొత్త సాధనాలకు అనుకూలంగా మారడం వంటి నైపుణ్యాలను అభివృద్ధి చేస్తారు.
రెండో దశ అయిన 'అవగాహన' మరింత లోతైనది. ఇది ఎఐ ఎలా పనిచేస్తుంది, దాని పరిమితులు ఏమిటి, అది ఇచ్చే సమాధానాలు ఎందుకు అలా ఉంటాయి అనే అంశాలను అర్థం చేసుకోవడంపై దృష్టి పెడుతుంది. ఎఐని ఒక బ్లాక్ బాక్స్‌గా కాకుండా, సంభావ్యతలు, డేటాపై ఆధారపడే వ్యవస్థగా గ్రహించడం ద్వారా విమర్శనాత్మక ఆలోచన పెరుగుతుంది. ఈ దశలో విద్యార్థులు ఎఐ ఇచ్చే సమాచారాన్ని నిర్ధారించుకోవడం, మూలాలను పరిశీలించడం, పక్షపాతం లేదా భ్రమాత్మక సమాధానాలను గుర్తించడం నేర్చుకుంటారు. అలాగే డేటా గోప్యత, అల్గోరిథమిక్ పక్షపాతం వంటి నైతిక అంశాలపై అవగాహన ఏర్పడుతుంది. ముఖ్యంగా, ఎప్పుడు ఎఐ సహాయం తీసుకోవాలి, ఎప్పుడు స్వంత మేధస్సును ఉపయోగించాలి అనే సమతుల్యతను ఈ దశ నేర్పుతుంది. మూడో దశ అయిన 'అనుసరణ' అనేది ఎఐని వాస్తవ ప్రపంచ సమస్యల పరిష్కారానికి ఉపయోగించే దశ. ఇది కేవలం వినియోగదారులుగా కాకుండా, విలువ సృష్టించగల ఆవిష్కర్తలుగా విద్యార్థులను తీర్చిదిద్దుతుంది. భూగోళశాస్త్రంలో వాతావరణ నమూనాల అంచనాలు, ఆర్థిక శాస్త్రంలో డేటా విశ్లేషణ, సామాజిక శాస్త్రాలలో విధాన ప్రభావాల అధ్యయనం వంటి రంగాలలో ఎఐని సహాయకుడిగా ఉపయోగించడం ఈ దశలో జరుగుతుంది. ఇక్కడ డిజైన్ థింకింగ్, డేటా విశ్లేషణ, ఆవిష్కరణ సామర్థ్యం వంటి నైపుణ్యాలు అభివృద్ధి చెందుతాయి.

## పడిలేచిన కెరటం జాన్ డీర్



ఆర్థికంగా పూర్తిగా కూలిపోయిన ఒక కమ్మరి పనివాడు. తన జీవితాన్ని మళ్లీ నిర్మించుకోవాలనే నిర్ణయం తీసుకున్నాడు. అతని పేరు జాన్ డీర్. ఐదుగురు పిల్లల తండ్రి. 1837 సంవత్సరం నాటికి పూర్తిగా దివాలా తీశాడు. స్థిరమైన ఉపాధి లేదు. ఆదాయం లేదు. ఇలాంటి పరిస్థితి మరెవరికైనా ఎదురైతే, పూర్తిగా కుంగిపోయేవాళ్లేమో. కానీ, డీర్ అందరి కంటే భిన్నమైనవాడు. అందుకే, అతను తన పరిస్థితిని చివరి మజిలీగా భావించలేదు. అక్కడితో తన జీవితం ముగిసిపోయిందనే వాదనను అంగీకరించలేదు. కొత్త అవకాశాల కోసం అతను అమెరికా పశ్చిమ ప్రాంతాల వైపు ప్రయాణించాడు. ప్రెయిరీ ప్రాంతంలోని రైతులు ఒక తీవ్రమైన సమస్యతో పోరాడుతున్న విషయాన్ని డీర్ గుర్తించాడు. అక్కడ నేల చాలా గట్టిగా ఉండది. అంతేగాక, జిగట మట్టి కావడంతో, నాగలికి అతుక్కుపోయేది. నాగలి నేలలోకి దిగినా, మట్టి దానికే అంటుకుని ముందుకు కదిలేది కాదు. దీనితో, ఆ ప్రాంతంలో పంటలకంటే సమస్యలే ఎక్కువగా తాండవించేది. డీర్ ఈ సమస్యను ఒక వ్యాపార అవకాశంగా కాకుండా, పరిష్కరించాల్సిన సవాలుగా చూశాడు. ఒక విరిగిపోయిన ఉక్కు కత్తి ముక్కను ఉపయోగించి కొత్త రకమైన నాగలిని రూపొందించాడు. అది నేలలోకి సులభంగా చొచ్చుకుపోయి, మట్టిని అంటుకోనీయకుండా బయటకు విసరగలిగింది. రైతులు వెంటనే ఫలితాన్ని చూశారు. ఇది వ్యవసాయ విధానాన్ని మార్చేసిన తొలి స్టీల్ ప్లౌ. అదే సమయంలో 'జాన్ డీర్' అనే సంస్థకు పునాది పడింది. ఆ సమయంలోనే డీర్ ఒక ముఖ్యమైన నిర్ణయం తీసుకున్నాడు. ప్రతి దున్నెపై తన పేరు ముద్రించాడు. అది కేవలం బ్రాండ్ గుర్తుకోసంగా కాకుండా, తాను స్వయంగా ఒక వాగ్దానాన్ని ఇస్తున్నట్టు రైతులు ధైర్యం ఉండాలన్న ఉద్దేశంతోనే పేరు ముద్రించేవాడు. 'నా పేరు ఉన్న ప్రతి పరికరం అత్యుత్తమ నాణ్యతను ప్రతిబింబించాలి' అని ప్రకటించేవాడు. తాత్కాలిక లాభాల కంటే దీర్ఘకాల విశ్వాసాన్ని అతను ఎంచుకున్నాడు. కాలక్రమేణా ఆ చిన్న వర్క్‌షాప్ ఒక విశాల పరిశ్రమగా మారింది. దివాలా తీసిన ఒక కమ్మరి ఆలోచన, శతాబ్దాల పాటు ప్రపంచ వ్యవసాయాన్ని ప్రభావితం చేయగలదని ఈ విజయ గాథ నిరూపిస్తుంది.

# దళితుల అభ్యున్నతిని విస్మరిస్తున్న ప్రభుత్వాలు

### డిహెచ్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఏసురత్నం



**ప్రజాపక్షం/ఖమ్మం :** అనేక దశాబ్దాలుగా దళితుల అభ్యున్నతిని ప్రభుత్వాలు విస్మరిస్తున్నాయని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కె.ఏసురత్నం విమర్శించారు. డిహెచ్‌పిఎస్ ఖమ్మం జిల్లా రెండవ మహాసభ గిరిప్రసాద్ భవన్‌లో యమాల గోపాలరావు, దొసపాటి సృజన అధ్యక్షతన సోమవారం జరిగింది. మహాసభ ముఖ్య అతిథిగా ఏసురత్నం హాజమాట్లాడుతూ తరతరాలుగా అణిచివేత అంటరానితనం, వివక్షత, దోపిడీ, పీడనాల కింద నలిగిపోతున్న అట్టడుగు వర్గాలైన అశేష శ్రామిక కులాల అభ్యున్నతి లక్ష్యంగా దళిత హక్కుల పోరాట సమితి ఆవిర్భవించిదన్నారు. సమాజంలో తరతరాలుగా అంటరానితనం అనే అవమానీయ దురాచారానికి అత్యంత దారుణంగా బలైపోతున్న దళితులను సామాజిక, ఆర్థిక, రాజకీయ ఆధిపత్యాన్ని ప్రశ్నించి, అణిచివేతను ఎదిరించి, సామానత్వాన్ని సాధించేందుకు సంఘటితంగా చైతన్యవంతం చేసేందుకు ప్రధాన లక్ష్యంతో దళిత సామాజిక దృక్పథంతో తెలంగాణ రాష్ట్ర 2వ మహాసభలు 2026 ఏప్రిల్ 17, 18 తేదిల్లో వరంగల్ అబ్బాస్ ఫంక్షన్ జరగనున్నాయని తెలిపారు. సిపిఐ ఖమ్మం జిల్లా కార్యదర్శి దండి సురేష్ మాట్లాడుతూ మోదీ నాయకత్వంలో ప్రభుత్వరంగ సంస్థలు, ప్రభుత్వ సేవలు, ఉన్నత విద్యలో ప్రవేటీకరణ వేగవంతం కావాడానికి తోడు, ప్రవేట్ రంగంలో రిజర్వేషన్లు లేకపోవడంతో పాటు రిజర్వేషన్ల విషయంలో రాజ్యాంగ ఆదేశాలను ఉల్లంఘిస్తున్నారన్నారు. ప్రవేట్ రంగాలలో రిజర్వేషన్ సాధన, పెరుగుతున్న జనాభా అనుగుణంగా రిజర్వేషన్లు, నిధులు కేటాయింపు, రక్షణశాఖలో, ప్రభుత్వ కాంట్రాక్టులో, ఇతర సంస్థల రిజ్వర్వేషన్ సాధన కోసం, సామాజిక న్యాయం, కులవివక్షణ నిర్మూలన, దళితుల సమగ్రాభివృద్ధి కోసం 2006 అక్టోబర్ 17న ఏర్పడిన దళిత హక్కుల పోరాట సమితి నాటి నుండి నేటి వరకు ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్ నిధుల కొరకు, దళితులపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా అనేక పోరాటాలు నిర్వహించిందన్నారు. భూమిలేని దళితులకు భూపంపిణీ కోసం పోరాడిందన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, సంఘం జిల్లా నాయకులు యంగల ఆనందరావు, పగిడిపల్లి యేసు, తడికమల్ల యోబు, తోటపల్లి సీతారాములు, మామిడాల కిరణ్, వరద నరసింహరావు, నారపోగు వసంతరావు, కోట నాగేశ్వరావు, కొమ్ము ఫిలిఫ్స్, మాతంగి శ్రీనివాసరావు, జల్లా రామకృష్ణ, మేళ్లచెర్వు రవి, తుంగా నవీన్ తదితరులు పాల్గొన్నారు.

### నూతన కమిటీ ఎన్నిక

సభలో దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా పగిడిపల్లి యేసు, యంగల ఆనందరావులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 31 మంది కౌన్సిల్ సభ్యులు, 18 మంది కార్యవర్గ



సభ్యులు, 11మంది ఆఫీస్ బేరర్లుగా ఎన్నికయ్యారు. గౌరవ అధ్యక్షుడిగా తడికమల్ల యోబు, ఉపాధ్యక్షుడిగా కోట నాగేశ్వరరావు, తోటపల్లి సీతారాములు, ఆర్గనైజింగ్ కార్యదర్శి యమాల గోపాలరావు, సహాయ కార్యదర్శులుగా మామిడాల కిరణ్, వరద నరసింహారావు, నారపోగు వసంతరావు, కోశాధికారిగా దొసపాటి సృజన ఎన్నికయ్యారు.

## పది నెలల అల్పాహారం పాత బిల్లులు విడుదల చేయాలి

### మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవీందర్ డిమాండ్

**ప్రజాపక్షం/ములుగు :** పది నెలల అల్పాహారం పాత బిల్లులు వెంటనే విడుదల చేయాలని తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని విశ్రాంత ఉద్యోగుల భవన్‌లో జరిగిన తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ ములుగు జిల్లా ద్వితీయ మహాసభ సామల రమ అధ్యక్షతన జరిగింది. ఈసభలో జంపాల రవీందర్ మాట్లాడుతూ 2023 డిసెంబర్ నుండి 2024 వరకు మధ్యాహ్న భోజన పథకం వంట కార్మికులు విద్యార్థులకు ఉదయం అల్పాహారం అందించడం జరిగిందని, ఆ బిల్లులు ఇప్పటి వరకు చెల్లించలేదన్నారు, అవి అలా ఉండగానే వచ్చే జూన్ నుండి మరల అల్పాహారం అందిస్తామని ప్రభుత్వం చెప్పడం అంటే కార్మికులకు ఎలా సాధ్యమన్నారు. పథకం సాఫీగా సాగాలంటే ప్రభుత్వం పాత బిల్లులు వెంటనే విడుదల చేసి కార్మికులను కాపాడాలన్నారు. మహాసభలో సంఘం జిల్లా అధ్యక్షురాలు సామల రమ, ఉపాధ్యక్షురాలు పోరెడ్డి ప్రమీల, మల్లంపల్లి, ములుగు, వెంకటాపూర్, గోవిందరావుపేట, తాడ్వాయి, ఏటూరునాగారం, మంగపేట, కన్నాయిగూడెం, వాజేడు, వెంకటాపురం మండలాల అధ్యక్షులు అంకం పద్మ, మాలగాని కమలక్క, జనగాం శోభ, సరోజన, భవాని, గడ్డం భారతి, కుడుముల సమ్మయ్య, అమ్రుత, పి రాధ, సలువాల స్వరూప, భాగ్య, సంగు పోషమ్మ, తదితరులు పాల్గొన్నారు.



## ప్రజా, కార్మిక సమస్యలపై పోరాటం చేస్తున్న సిపిఐని ఆదరించాలి

### సిపిఐ నిజామాబాద్ జిల్లా కార్యదర్శి సుధాకర్

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** నిత్యం ప్రజా, కార్మిక సమస్యలపై అలుపెగరని పోరాటం చేస్తున్న సిపిఐ పార్టీని ప్రజలు ఆదరించాలని పార్టీ నిజామాబాద్ జిల్లా కార్యదర్శి సుధాకర్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఓమయ్య కోరారు. సోమవారం సిపిఐ నగర కమిటీ ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలోని 32వ డివిజన్ గాంధీ గంజ్‌లో ఇంటింటికీ సిపిఐ పార్టీ ప్రచార కార్యక్రమం నిర్వహించారు. నిత్యం ప్రజా సమస్యల పరిష్కారం కార్మిక సమస్యల పరిష్కారం కోసం పని చేసే సిపిఐ పార్టీని ప్రజలు ఆదరించాలని, ప్రజా సమస్యలపై పోరాడే కార్యక్రమాలకు తమ వంతు సహకారమందించాలని విరాళాలు సేకరించారు. ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా కార్మిక వ్యతిరేక విధానాలపై సిపిఐ నిర్వహించే కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు రఘురాంనాయక్, గోవర్ధన్, సాయిలు, సత్యనారాయణ, రాజు, స్వామి, సలీం, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



## అర్హులైన ప్రజా కళాకారులకు గుర్తింపు కార్డులు



### ప్రజానాట్య మండలి రాష్ట్ర అధ్యక్షుడు కె.శ్రీనివాస్, సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి డిమాండ్

### కలెక్టరేట్ ఎదుట కళాకారుల భారీ ధర్నా

**ప్రజాపక్షం/భువనగిరి :** అర్హులైన ప్రజా కళాకారులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, ఉద్యోగ అవకాశాలు కల్పించాలని తెలంగాణ ప్రజానాట్య మండలి రాష్ట్ర అధ్యక్షుడు కురిమిద్ద శ్రీనివాస్, సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి రాష్ట్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం యాదాద్రి భువనగిరి జిల్లాలోని కళాకారులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి, అనంతరం ప్రజావాణిలో జిల్లా అదనపు కలెక్టర్ భాస్కర్‌రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్, దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజానాట్య మండలి కళాకారులు అనేక సంవత్సరాలుగా గుర్తింపు లేకుండా, సరైన పారితోషికం లేకుండా, సామాజిక భద్రత లేకుండా దయనీయ పరిస్థితుల్లో జీవిస్తున్నారన్నారు. కళాకారుల కష్టాలను పట్టించుకోకుండా ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి అవలంబించడం తగదన్నారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో కళాకారులను ఉపయోగించుకుంటూ, వారికి కనీస గౌరవ వేతనం ఇవ్వకపోవడం అన్యాయం అన్నారు. ప్రతి కళాకారులకు గుర్తింపు కార్డు జారీ చేసి, కనీస పారితోషికాన్ని చట్టబద్ధం చేయాలని, ప్రమాద బీమా, ఆరోగ్య బీమా, పెన్షన్ వంటి భద్రతా పథకాలు తక్షణమే అమలు చేయాలని, జిల్లా కేంద్రంలో సాంస్కృతిక భవనం నిర్మించాలని డిమాండ్ చేశారు. ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి భూషిపాక నర్సింహా, చెక్క వెంకటేష్ మాట్లాడుతూ 50 సంవత్సరాలు నిండిన ప్రతి కళాకారుడికి రూ.6 వేలు పెన్షన్ ఇవ్వాలని, గుట్ట దేవస్థాన బ్రహ్మోత్సవాల్లో స్థానిక వృత్తి కళాకారులకు ప్రదర్శన అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో కళాకారులు చిరుర్ల లింగం, మూల పోచయ్య, పిట్టల శంకర్, కట్ల యాదగిరి, సోమనరసయ్య, ఇంజ హేమలత, శ్రీనివాస్, రాజప్ప, మల్లేశం, సరిత, దుప్పెల్లి చౌదరి, రేణుక, సుగుణమ్మ, కృష్ణమ్మ, కవిత, ఎలేంద్ర, రేణుక, సామి, శంకరయ్య, పద్మ, చంద్రారెడ్డి, తేజ, లక్ష్మయ్య, మల్లేశం, అన్నేమైన వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టిజన్ కార్మికులతో చర్చలు జరపాలి

### ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి

**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి :** సమ్మె చేస్తున్న విద్యుత్ ఆర్టిజన్ కార్మికులతో చర్చలు జరిపి వారి సమస్యలను పరిష్కరించాలని ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని డిఇ కార్యాలయం వద్ద టివిఎసి జెఎసి ఆధ్వర్యంలో ఆర్టిజన్లు చేస్తున్న సమ్మెకు సంఘీభావం తెలిపి దేవేందర్‌రెడ్డి మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా సమ్మె చేస్తున్న ఆర్టిజన్లను ప్రభుత్వం చర్చలకు పిలవకపోవడం విచారకరమన్నారు. విద్యుత్ సంస్థలో గత 22 సంవత్సరాల నుండి విధులు నిర్వహిస్తున్నారని, వారి అర్హతను బట్టి కన్వర్షన్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆర్టిజన్ల విద్యా అర్హతను బట్టి జూనియర్ లైన్‌మెన్లుగా, సబ్ ఇంజనీర్లుగా, ఆఫీసు సబార్డినేటర్లుగా, జూనియర్ అసిస్టెంట్లుగా ప్రభుత్వం గుర్తించాలని కోరారు. చాలీచాలని జీతాలతో వెట్టిచాకిరి చేస్తున్న ఆర్టిజన్లకు ప్రభుత్వం ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విద్యుత్ జెఎసి నాయకులు హతీరాంనాయక్, రాంచంద్రు, దాసరి యాదయ్య, రమేష్‌రెడ్డి, కృష్ణ, రవి, జనార్ధన్‌గౌడ్, హరినాయక్, పాపయ్య, వెంకట్‌రెడ్డి, వెంకన్న, ఇంద్రారెడ్డి, యాదయ్య, సలీం తదితరులు పాల్గొన్నారు.



## విద్యుత్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఎఐటియుసి జిల్లా గౌరవ అధ్యక్షుడు ఓమ భిక్షపతి




**ప్రజాపక్షం/ తొర్రూరు :** విద్యుత్ శాఖలో పని చేస్తున్న ఆర్టిజెన్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలనిఎఐటియుసిగౌరవ అధ్యక్షుడు ఓమ భిక్షపతి, సిపిఐ మండల కార్యదర్శి బందు మహేందర్ అన్నారు. తొర్రూరు పట్టణ కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యుత్ శాఖలో పని చేస్తున్న ఆర్టిజెన్ కార్మికులపై ఎప్మా, డిస్మస్ వంటి చర్యలు తీసుకోకుండా చర్చలతో వారి సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా జెన్కో, ట్రాన్స్కో, ఎన్పీడీసీఎల్ విద్యుత్ సంస్థలో18000మంది ఆర్టిజెన్ కార్మికులు పనులు చేస్తున్నారని అన్నారు. కార్మికులు చేస్తున్న సమ్మెపై ప్రభుత్వం స్పందించి సమ్మెను విరమింపజేసి వారి సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల సహాయ కార్యదర్శి గణపురం లక్ష్మణ్, పేరబోయిన కిరణ్కుమార్, పట్టణ కార్యదర్శి ముద్రబోయిన వెంకన్న, నాయకులు సూరబోయిన వీరన్న, చంద్రయ్య, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల ప్రాణ భద్రతే లక్ష్యం: కలెక్టర్

**ప్రజాపక్షం/జనగామ:** ప్రజల ప్రాణ భద్రతే లక్ష్యమని, రోడ్డు భద్రతపై ప్రజలు అప్రమత్తత అవసరమని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న అరైవ్ అలైవ్లో భాగంగా రోడ్డు భద్రత వారోత్సవాలలో భాగంగా రోడ్డు భద్రత వారోత్సవాల సందర్భంగా జిల్లాలోని లింగాలఘనపురం మండలంలోని నెల్లుట్ల గ్రామ పంచాయితి పరిధిలో గల పంచాయితి కార్యాలయంలో సోమవారం రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వమించారు. ఈ కార్యక్రమానికి డీసీపీ రాజమహేంద్ర నాయక్తో కలిసి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా హాజరయ్యారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణలో ప్రతి క్కరి పాత్ర అత్యంత కీలకమన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు నూరుద్దీన్, సంబంధిత అధికారులు, పోలీసులు, సర్పంచ్, పంచాయితి, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## అతివేగం అజాగ్రత్తతోనే రోడ్డు ప్రమాదాలు: ఎస్ఐ శ్రీదేవి


**ప్రజాపక్షం/తరిగొప్పుల:** ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా రోడ్డు రవాణా అతి జాగ్రత్త కార్యక్రమంలో భాగంగా అతివేగం, అజ్రాత్త, కాస్త ఏమరపాటు వల్లే రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, ఈ ప్రమాదాలలో ముఖ్యంగా యువత ప్రమాదాల బారిన పడి ప్రానాలు కోల్పోతున్నారని తరిగొప్పుల ఎస్ఐ శ్రీదేవి పేర్కొన్నారు. వాహనదారులకు, ప్రజలకు రోడ్డు భద్రత నియమాలు, నిబంధనలపై అవగాహన కల్పించారు. కార్యక్రమానికి మహిళలు, వాహనదారులు భారీ ఎత్తున తరలివచ్చి అవగాహన సదస్సులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ శ్రీదేవి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించడం వల్ల ప్రాణాలకు రక్షణ కవచంలా ఉంటుందన్నారు. కారులో సీటు బెల్టు ధరించాలన్నారు. పోలీసులు జరిమానా విధిస్తారని హెల్మెట్ ధరించడం కాదు మీ ప్రాణాలు కాపాడుకోవడం కోసమన్నారు. ఎవరికి వాళ్లు స్వతాహాగా నియమాలు పాటిస్తే రోడ్డు ప్రమాదాలను తగ్గించవచ్చన్నారు. ఆయా గ్రామాలలో ప్రజలతో ప్రతిజ్ఞ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అర్జుల జ్యోతి మధుసూధన్ రెడ్డి, కార్యదర్శి భాగ్యలక్ష్మి, వార్డు మెంబర్ వేణుగోపాల్రెడ్డి, వివిధ గ్రామాల సర్పంచ్లు, వార్డు మెంబర్లు, ఆయా పార్టీల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## మూడు కోట్ల రూపాయలతో సిసి రోడ్డు మంజూరు

**ప్రజాపక్షం/వాజేడు:** మారుమూల ఏజెన్సీ ప్రాంతమైన ములుగు జిల్లా వాజేడు మండల పరిధిలోని చెరుకూరు నుండి ఆర్లగూడెం వరకు సుమారు మూడు కిలోమీటర్ల సీసీ రోడ్డు ఐటీడీఏ సహకారంతో సిఆర్ఆర్ నిధుల కింద మూడు కోట్ల రూపాయలు మంజూరు అయ్యాయి. ఈ రోడ్డు నిర్మాణం కోసం సోమవారం శంకుస్థాపన చేశారు. చెరుకూరు సర్పంచ్ వాసం రాజబాబు కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ములుగు జిల్లా ప్రధాన కార్యదర్శి కాకర్లపూడి విక్రాంత్ మాట్లాడుతూ తెలంగాణ ప్రజా ప్రభుత్వం గిరిజన గ్రామాల అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేయడం జరిగిందని ఎన్నో ఏళ్లుగా రోడ్డు సమస్యతో బాధపడుతున్న చెరుకూరు, చింతూరు, ఆర్లగూడెం గ్రామ ప్రజల రహదారి నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయడం జరిగిందని అన్నారు. ఈ రోడ్డు నిర్మాణం చేస్తే ఈ ప్రాంత ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఏ ఏఈ పి రాము, కాంగ్రెస్ పార్టీ ములుగు జిల్లా ఎగ్జిక్యూటివ్ నెంబర్ చెన్నం ఎల్లయ్య, సొసైటీ మాజీ ఉపాధ్యక్షులు వత్సవాయి జగన్నాధరాజు, కాంగ్రెస్ పార్టీ నాయకులు నల్లగాసి రమేష్, తల్లడి నాన్న బాబు, కాకర్లపూడి సత్యనారాయణపాల్గొన్నారు.

## ఆర్టిజన్ల డిమాండ్లను రేవంత్ రెడ్డి ప్రభుత్వం పరిష్కరించాలి

ఎఐటియుసి రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు గుంపెల్లి మునీశ్వర్




**ప్రజాపక్షం/ నర్సంపేట :** ఎన్నికల ముందు హామీ ఇచ్చిన విధంగా విద్యుత్ ఆర్టిజన్ల సమస్యలు పరిష్కరించాలని ఎఐటియుసిరాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగుంపెల్లి మునీశ్వర్ రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నర్సంపేట పట్టణంలో సమ్మె చేస్తున్న ఆర్టిజన్లకు సంఘీభావం మునీశ్వర్ సోమవారం తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టిజన్లకు ఎపి ఎస్ఇబి వర్తింప చేసి, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తూ క్వాలిఫికేషన్ ప్రకారం ప్రమోషన్లు, బదిలీలు చేపట్టాలన్నారు. ప్రభుత్వం ఆర్టిజన్ల శ్రమ దోపిడి చేస్తూ, వారి డిమాండ్లను సానుకూలంగా పరిష్కరించకుండా, గత ఆరు రోజుల నుంచి సమ్మె చేస్తున్నా పట్టించుకోకుండా బెదిరింపులకు పాల్పడడం సరికాదన్నారు. ఇప్పటికైనా ఆర్టిజన్ల సమస్యలను రేవంత్ రెడ్డి ప్రభుత్వం తక్షణమే పరిష్కరించి ఆర్టిజన్ల చేత సమ్మెను విరమింప చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. లేని ఎడల ఆర్టిజన్ లు తీసుకోబోయే ఏ ఆందోళనలకైనా ఎఐటియుసి పూర్తి మద్దతు ఇస్తుదన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టిజన్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు సలీంపాషా,జాయింట్ సెక్రటరీ పాపిరెడ్డి, డివిజన్ ప్రెసిడెంట్ దేవేందర్, సాంబయ్య, మాధవ రావు, మొగిళి కృష్ణ, భాను తదితరులు పాల్గొన్నారు

# కవిత చర్యలకు తడబడుతున్న కెటిఆర్

బంగారు తెలంగాణ పేరుతో
అప్పులపాలు, దోపిడీ
కెటిఆర్పై తీవ్రస్థాయిలో విమర్శలు
గుప్పించిన ఎమ్మెల్యే నాగరాజు



**ప్రజాపక్షం/హనుమకొండ :** బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ పై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించిన వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కెఆర్ నాగరాజు మీడియా సమావేశంలో మాట్లాడుతూ, జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీసుకుంటున్న నిర్ణయాలు, రాజకీయ పరిణామాలు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు కెటిఆర్ ను అసహజ స్థితిలోకి నెట్టాయని, ఆయన ఉత్తర కుమారుడిలా ప్రగల్భాలు పలుకుతున్నారని తీవ్రంగా విమర్శించారు.తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ఉద్యమకారుల సహకారంతో బిఆర్ఎస్ పార్టీ ఎదిగిందని, కానీ అదే ఉద్యమకారులను తరువాత పార్టీ నుండి గెంటివేయడం బాధాకరమని అన్నారు. ప్రస్తుతం బిఆర్ఎస్ పార్టీని తిరిగి టిఆర్ఎస్గా మారుస్తామని చెబుతున్నారని, అయితే ప్రజలు ఇకపై వారి మాటలను నమ్మే పరిస్థితిలో లేరని పేర్కొన్నారు.అదే విధంగా, దళితుడిని ముఖ్యమంత్రిగా చేస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేదని, పేదలకు డబుల్ బెడ్రూమ్ ఇళ్ల వాగ్దానం కూడా అమలు కాలేదని ఆయన విమర్శించారు. మరోవైపు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఉద్యమకారులకు అండగా నిలుస్తూ, వారి సంక్షేమం కోసం కృషి చేస్తోందని తెలిపారు.తెలంగాణ ప్రముఖ కవి కాళోజి నారాయణరావు చెప్పిన మాటలను ప్రస్తావిస్తూ, ప్రాంతీయ ప్రజలను మోసం చేసిన వారిని ప్రజలు తిరస్కరిస్తారని, బిఆర్ఎస్ పార్టీని కూడా ప్రజలు ఇప్పటికే రాజకీయంగా పాతిపెట్టారని అన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని "బంగారు తెలంగాణ" పేరుతో అప్పుల కుప్పగా మార్చి దోపిడీ చేశారని ఆయన ఆరోపించారు.కాంగ్రెస్ పార్టీపై బిఆర్ఎస్ నేతలు చేస్తున్న విమర్శలు అసత్య ఆరోపణలేనని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 60 వేలకుపైగా ఉద్యోగాలను కల్పించిందని తెలిపారు. ఉద్యోగాల కోసం కోట్ల రూపాయలు వసూలు చేశారనే ఆరోపణలు పూర్తిగా అబద్ధమని ఖండించారు.అసెంబ్లీ, పార్లమెంట్, ఉపఎన్నికలు, సర్పంచ్, మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు బిఆర్ఎస్ పార్టీకి గట్టి సమాధానం ఇచ్చారని పేర్కొంటూ, రాబోయే గ్రేటర్ వరంగల్, హైదరాబాద్ మున్సిపల్ ఎన్నికల్లో కూడా ప్రజలు అదే తీర్పు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారని అన్నారు.యువతను క్రీడల వైపు ప్రోత్సహించేందుకు సీఎం రేవంత్ రెడ్డి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల కోసం క్రీడా పోటీలు నిర్వహిస్తే, వాటిని కూడా బీఆర్ఎస్ నేతలు బహిష్కరించడం బాధాకరమని విమర్శించారు. ప్రజల సమస్యలపై దృష్టి పెట్టకుండా రాజకీయ నాటకాలు ఆడుతున్నారని ఆరోపించారు.ప్రస్తుతం ప్రజలంతా కాంగ్రెస్ పార్టీ వైపే ఉన్నారని, రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ ఘన విజయం సాధించడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి న్యాయం చేసే విధంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పనిచేస్తుందని ఆయన స్పష్టం చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు, ప్రజలు వాస్తవాలను గుర్తించి సరైన నిర్ణయం తీసుకోవాలని, అభివృద్ధి మరియు సంక్షేమాన్ని ముందుకు తీసుకెళ్లే ప్రభుత్వానికి మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు.ఈ మీడియా సమావేశంలో కుడా చైర్మన్, హన్మకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఇనుగాల వెంకట్రామి రెడ్డి, వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహమ్మద్ ఆయుబ్, నాయకులు వీసం సురేందర్ రెడ్డి,ప్రజా ప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## జూన్ నాటికి గండి రామారం ఎత్తిపోతల పనులు పూర్తి

స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి



**ప్రజాపక్షం/హసన్పర్తి :** ఎట్టి పరిస్థితుల్లో జూన్ 30నాటికి గండి రామారం లిఫ్ట్ 1 పనులు పూర్తి చేసి వర్షాకాలం వరకు వేలేరు, చిల్పూర్ మండలాల రైతులకు సాగు నీరు అందించే విధంగా అధికారులు పనులు పూర్తి చేయించాలని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆదేశించారు.హన్మకొండ చింతగట్టు క్యాంప్ లోని నీటి పారుదల శాఖ చీఫ్ ఇంజనీర్ కార్యాలయంలో గండి రామారం ఎత్తిపోతల పథకం పనులపై నీటి పారుదల శాఖ చీఫ్ ఇంజనీర్ సుధీర్ తో కలిసి అధికారులు, కాంట్రాక్టర్లు, చిల్పూర్, వేలేరు మండలాల సర్పంచులతో ఎమ్మెల్యే కడియం శ్రీహరి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గండి రామారం ఎత్తిపోతల పథకం పనులు ఎలా జరుగుతున్నాయా...? ఏమైనా అడ్డంకులు ఉన్నాయా....? అనే వివరాలను అధికారులు, కాంట్రాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. వివిధ గ్రామాల సర్పంచులు, స్థానిక నాయకులతో అదనపు చెరువులు ఏమైనా ఉన్నాయా.....? వాటిని నింపేందుకు ఫీజుబులిటీ ఎంత వరకు ఉంది అనే సమాచారాన్ని తీసుకున్నారు. లిఫ్ట్ 1కాలువ ఏ ఏ గ్రామాల నుండి ఏ ఏ చెరువులు నిండుతున్నాయో క్షేత్ర స్థాయిలో మ్యాప్ పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... గండి రామారం ఎత్తిపోతల పథకం లోని లిఫ్ట్ 1పనులను 30జూన్ 2026నాటికి పూర్తి చేసి వర్షాకాలం వరకు చెరువులు నింపి రైతులకు సాగు నీరు అందించాలని నీటి పారుదల శాఖ అధికారులను ఆదేశించారు. లిఫ్ట్ 1 పైన వేలేరు, చిల్పూర్ మండలాల రైతులు నుండి డిమాండ్ ఎక్కువగా ఉందని తెలిపారు. లిఫ్ట్ 1పనులు పూర్తి చేసేందుకు ఏమైనా అడ్డంకులు ఉన్నాయా అని కాంట్రాక్టర్లను అడిగారు. ఏమైనా సమస్యలు ఉంటే వెంటనే నా దృష్టికి తీసుకురావాలని సూచించారు. గ్రామంలో అదనపు చెరువులు, కుంటలు నింపేందుకు రైతుల నుండి వచ్చిన విజ్ఞప్తులకు వెంటనే ఎస్టిమేషన్లు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపించాలని అన్నారు. అధికారులు వారానికి రెండు సార్లు క్షేత్రస్థాయిలో పనులు పర్యవేక్షించాలని అధిక ప్రాధాన్యత ఇచ్చి పనులు పూర్తి చేయించాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లో 30 జూన్ 2026 వరకు లిఫ్ట్ 1పనులు పూర్తి కావాలని జులై మొదటి వారంలో ప్రారంభోత్సవం చేసుకోవాలని ఈ డెడ్ లైన్ లో ఏవిధమైన మార్పు ఉండదని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో నీటి పారుదల చీఫ్ ఇంజనీర్ సుధీర్, ఎస్ఈ సీతారాం, డిఈలు, ఏఈలు, కాంట్రాక్టర్లు, చిల్పూర్, వేలేరు మండలాల సర్పంచులు, ఇతర నాయకులు, కార్యకర్తలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## చదువులతో పాటు ఆట,పాటల్లోనూ రాణించాలి

24వ వార్డు సిపిఐ కౌన్సిలర్ వేముల జ్యోతి శ్రీకాంత్




**ప్రజాపక్షం/భూపాలపల్లి :** చిన్నారులు చదువుతోపాటు ఆట,పాటల్లో అలాగే శాస్త్ర సాంకేతిక రంగాల్లో రాణించాలని సిపిఐ 24వ వార్డు కౌన్సిలర్ వేముల జ్యోతి శ్రీకాంత్, భూపాలపల్లి ఎస్సై జి.శ్రావణ్ కుమార్ ఆకాంక్షించారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలో ఉన్న స్థానిక సెయింట్ పీటర్స్ హైస్కూల్ లో ఘనంగా ప్రీస్కూల్ గ్రాడ్యుయేషన్ డే ఉత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా భూపాలపల్లి ఎస్సై జి.శ్రావణ్ కుమార్, 24 వార్డు కౌన్సిలర్ వేముల జ్యోతి శ్రీకాంత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, చిన్నారులు చదువుతో పాటు ఆటలు, పాటలు, శాస్త్ర సాంకేతిక రంగాల్లో రాణించి భవిష్యత్తులో భారతదేశ ఉన్నత భావిభారత పౌరులుగా ఎదగాలని అన్నారు. సెయింట్ పీటర్ స్కూల్ డైరెక్టర్ జార్జి, కరస్పాండెంట్ జోసెఫ్, ప్రిన్సిపాల్ జానీ, సెర్లీ జార్జ్, బినా, సిస్లి, అధ్యాపక బృందం, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో అలరించాయి.

## శరీరం, మనసు, ఆత్మ మధ్య సమతుల్యత యోగా ద్వారా సాధ్యం: కలెక్టర్ చాహత్



**ప్రజాపక్షం/హనుమకొండ :** యోగ శరీరం, మనసు, ఆత్మ మధ్య సమతుల్యతను సాధించే మార్గమని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్పాయి అన్నారు. ప్రజాపాలన– పురోగతి ప్రణాళిక' 99 రోజుల కార్యాచరణలో భాగంగా జిల్లా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో యోగ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్పాయి ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం కలెక్టర్ స్వయంగా యోగాసనాలు చేసి పాల్గొన్న వారిలో ఉత్సాహాన్ని నింపారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, యోగ మన భారతీయ సంస్కృతిలో ఒక ముఖ్యమైన భాగమని, ఇది వేల సంవత్సరాల చరిత్ర కలిగిన జీవన విధానమని తెలిపారు. నేడు యోగ ప్రపంచవ్యాప్తంగా విస్తరించి, అన్ని దేశాల్లో ప్రజలు దీనిని ఆచరిస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకుంటున్నారని పేర్కొన్నారు.యోగ కేవలం శారీరక వ్యాయామం మాత్రమే కాకుండా, మనసు, ఆలోచనలు, జీవనశైలిని సానుకూల దిశగా మలిచే శక్తివంతమైన సాధనమని కలెక్టర్ అన్నారు. ప్రతిరోజూ యోగ సాధన చేయడం ద్వారా ఒత్తిడి, ఆందోళనలు తగ్గి, శరీరానికి శక్తి, మనసుకు ప్రశాంతత లభిస్తాయని వివరించారు.ప్రస్తుత కాలంలో ఉద్యోగులు దైనందిన జీవితంలో పని ఒత్తిడితో ఆరోగ్యం పట్ల సరైన శ్రద్ధ వహించకపోవడం వల్ల వివిధ వ్యాధులు దరిచేరుతున్నాయని తెలిపారు. అలాంటి పరిస్థితుల్లో ప్రతిరోజూ క్రమం తప్పకుండా యోగ చేయడం ద్వారా శారీరక దృఢత్వం, మానసిక సమతుల్యత పెంపొందడంతో పాటు వ్యాధులను దూరం చేసుకోవచ్చని కలెక్టర్ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో యోగ గురువు రవీంద్ర చారి, జిల్లా పర్యాటక శాఖాధికారి శివాజీ, జిల్లా ట్రెజరీ అధికారి శ్రీనివాసరావు, జిల్లా పౌరసంబంధాల అధికారి ఆయూబ్ అలీ, డీఈ అరుణ,జిల్లా సహకార అధికారి, సంజీవరెడ్డి, డిఎం హెచ్ ఓ డాక్టర్ అప్పయ్య, ఎన్ ఎస్ ఎస్ కోఆర్డినేటర్ శ్రీనివాస్, తదితర శాఖల అధికారులు, సిబ్బంది యోగాభ్యాసకులు పాల్గొన్నారు.

## సమస్యల వలయంలో ఆరోగ్య కేంద్రం..!

ఇబ్బందుల్లో వైద్య సిబ్బంది
పట్టించుకోని అధికారులు,
ప్రజా ప్రతినిధులు



**ప్రజాపక్షం/చెన్నారావుపేట:** చూసుకొని మురువ...చెప్పుకొని ఎడువ అన్న చందంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సమస్యల వలయంగా మారింది. చెన్నారావుపేట మండలంలో పెద్ద ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉంది. ఇదే ఆరోగ్య కేంద్రంలో ప్రతి రోజు వైద్యులు, పదుల సంఖ్యలో రోగులు వస్తుంటారు. కనీస సదుపాయాలు లేక మూడేళ్లుగా ఇబ్బందులు పడుతున్న పట్టించుకునే నాథుడే కరువయ్యారని ఆరోగ్య కేంద్రానికి వచ్చే బాధితులు ఆరోపిస్తున్నారు. ప్రధానంగా ఆరోగ్య కేంద్రంలో తాగు నీరు, మరుగుదొడ్లు, కిటికీలకు డోర్లు లేక సుమారు మూడు ఏండ్లుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న సంబంధించిన అధికారులు, ప్రజా ప్రతినిధులు ఎందుకు పట్టించుకోవడం లేదని పలువులు బాధితులు ప్రశ్నిస్తున్నారు. రోజు రోజు మండుతున్న ఎండకు ఆరోగ్య కేంద్రానికి రోగులు వస్తే కనీసం త్రాగునీరు లేక ఇదేమి దావఖాననాయన అంటూ తమ బాధను వెల్లబోస్తున్నారు. సమస్య ఉందని వైద్యులు బయటకు చెప్పలేక..లోపల దిగమింగలేక అవస్థలు పడుతున్నారు. ఆరోగ్య కేంద్రంలో బోరు, నల్లాలు ఉన్నప్పటికి వాటిని కలెక్షన్ ఇవ్వక అవి నిరుపయోగంగా మారాయి. ఇప్పటికైనా నర్సంపేట ఎంఎల్ఏ చొరవ తీసుకొని కనీసం త్రాగునీరు, ఆరోగ్య అన్ని రకాల సౌకర్యాలు ఉండేలా చూడాలని మండల ప్రజలు కోరుతున్నారు.

## కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే రేవూరి



**ప్రజాపక్షం/దామెర :** సోమవారం దామెర మండలం ఊరుగొండ గ్రామంలో పిఎసిఎస్ పెద్దాపురం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకొని,మద్దతు ధరను పొందాలని సూచించారు.అలాగే రైతులు దళారులను నమ్మి మొసపోవద్దని, కొనుగోలు కేంద్రాల్లోనే కనీస మద్దతు ధర క్వింటాల్ కి 2400 రూపాయలు లభిస్తుందని అన్నారు.కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని, ఎలాంటి ఇబ్బందులు ఉన్న తన దృష్టికి తీసుకురావాలని అధికారులకు తెలిపారు. రైతుల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనేక సంక్షేమ కార్యక్రమాలను చేపడుతున్నారని అన్నారు.రైతును రాజు చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం అని తెలిపారు.

## జియో కోఆర్డినేషన్లో ఎలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్త వహించాలి

కలెక్టర్ దివాకర టిఎస్



**ప్రజాపక్షం/ములుగు:** రామచంద్రపురం భూముల సర్వేలో ఏర్పాటు చేసే జియో కోఆర్డినేషన్లో ఎలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్త వహించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం మల్లంపల్లి మండలం రామచంద్రపురం గ్రామ శివారులోని రాజేశ్వరరావు పల్లెలో జరుగుతున్న సర్వేను జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలిచి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా సర్వే జరుగుతున్న తీరును, డేటా ఎంట్రీ, జియో కోఆర్డినేషన్ ఏర్పాటు పనులను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. రామచంద్రపురం భూముల సర్వే ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతతో నిర్వహిస్తుందని జియో కోఆర్డినేషన్ ఏర్పాటుతో సర్వే నిర్వహించడంలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్త వహించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ వెంకటేష్, తహసీల్దారు విజయభాస్కర్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## అసైన్మెంట్ భూముల సమస్యను తొందరగా తేల్చాలి

ఆర్డిఒకు సిపిఐ జిల్లా కార్యదర్శి
కర్రె భిక్షపతి వినతి



**ప్రజాపక్షం/హనుమకొండటౌన్ :** అయినవోలు మండలం వెంకటాపురం గ్రామంలోని అన్యాక్రాంతమైన అసైన్మెంట్ భూముల విషయంలో అట్టి భూములను వెలికి తీయడం కోసం అధికార యంత్రాంగం వేగవంతమైన చర్యలు తీసుకోవాలని సిపిఐ జిల్లా సమితి కార్యదర్శి కర్రె భిక్షపతి అధికారులను డిమాండ్ చేశారు.వెంకటాపూర్ తో పాటు ముచ్చర్ల గ్రామానికి సంబంధించిన అసైన్మెంట్ భూముల సమస్యను పరిష్కరించాలని కోరుతూ సోమవారం హనుమకొండ ఆర్డీఓ కార్యాలయం ముందు జరిగిన ధర్నా కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడారు.ఈ సందర్భంగా భిక్షపతి మాట్లాడుతూ దశాబ్దాలుగా అధికారుల నిర్లక్ష్యం వల్ల పేదలకు అన్యాయం జరుగుతూనే ఉన్నదని, ముఖ్యంగా భూ పంపిణీలో భూములను దళితులు, నిరుపేదలకు ఇచ్చినట్లే ఇచ్చి తిరిగి ఏదో ఒక రకంగా ఆ భూములను వారి చేతుల్లో లేకుండా చేస్తున్నారని విమర్శించారు. పేదలకు పంపిణీ చేసిన ( అసైన్మెంట్) భూములు అన్యాక్రాంతం కావడానికి కారణం కొంతమంది అవినీతికర అధికారులేనని ఈ సందర్భంగా అన్నారు. ప్రభుత్వ అసైన్మెంట్ భూములను ఆక్రమించుకున్న కబ్జాదారుల పైన, వారికి సహకరించిన అధికారుల పైన చర్యలు తీసుకోనందువల్లనే నేడు పేదల చేతుల్లో భూములు లేకుండా పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. హనుమకొండ జిల్లాలో వందల కోట్ల విలువ చేసే ప్రభుత్వ అసైన్మెంట్ భూములు అనేకం నేడు కబ్జా కోరల్లో ఉన్నాయని, అట్టి భూములను గుర్తించి స్వాధీన పరుచుకొని అర్హులైన పేదలకు పంపిణీ చేయాలని ఈ సందర్భంగా బిక్షపతి డిమాండ్ చేశారు.ధర్నా కార్యక్రమం అనంతరం హనుమకొండ ఆర్డిఓతో అసైన్మెంట్ భూముల ప్రస్తుత పరిస్థితి పై జిల్లా నాయకత్వంతో కలిసి చర్చించారు. ఇందుకు సంబంధించిన వివరాలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన ఆర్డిఓ వెంకటాపూర్ అసైన్మెంట్ భూముల సర్వే ప్రస్తుతం జరుగుతున్నదని, త్వరలోనే ప్రభుత్వ భూమిని మొత్తంగా స్వాధీనం చేసుకుంటామని ఈ సందర్భంగా సిపిఐ జిల్లా నాయకత్వానికి హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎదునూరి వెంకట్రాజం, కొట్టేపాక రవి, జిల్లా సమితి సభ్యులు అలవాల రాజు, నాయకులు మాదాసి యాకూబ్, కొమురయ్య, సరిత, సంతోష, రామారావు, సదానందం, మట్టెడ స్వరూప, మట్టెడ రాజు, నాగరాజు, సమ్మయ్య తదితరులతోపాటు పై రెండు గ్రామాలకు సంబంధించిన పేదలు పాల్గొన్నారు.

## అక్రమంగా దాచిన నెమలి స్వాధీనం

విచారణ అనంతరం చట్టపరమైన చర్యలు: ఫారెస్ట్ డిఆర్ఓ



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:** ఖమ్మంరూరల్ మండలం తీర్థాల గ్రామంలోని ఓ ఇంట్లో అక్రమంగా దాచిపెట్టిన నెమలిని అటవీశాఖ అధికారులు సోమవారం స్వాధీనపరుచుకున్నారు. గ్రామస్తులు, అధికారులు తెలిపిన వివరాల ప్రకారం...గ్రామానికి చెందిన కిషన్ అనే వ్యక్తి తన ఇంట్లో నెమలిని ఉంచాడనే ఫిర్యాదు మేరకు అటవీశాఖ డిఆర్ఓ రామారావు తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో ఆ ఇంట్లో నెమలి ఉన్నట్లు గుర్తించి, గ్రామస్తుల సహకారంతో దానిని స్వాధీనపరుచుకున్నారు. గత కొన్ని రోజుల క్రితం జింకలను వేటాడి భుజించినట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. అలాగే రెండు నెమలులను గూడు ఒకదానిని భుజించిన మరో నెమలిని ఇంట్లో పెంచుతున్నట్లు పేర్కొంటున్నారు. ఈ ఘటనపై డిఆర్ఓ రామారావును వివరణ కోరగా...పూర్తి స్థాయి దర్యాప్తు కొనసాగుతున్నది, విచారణలో ఆరోపణలు నిజమని తేలితే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

## సిపిఐ కౌన్సిలర్ దండికి ఘన సన్మానం



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:** ఏదులాపురంమున్సిపాలిటీపరిధిలోని 28వ వార్డుకు చెందిన సిపిఐ కౌన్సిలర్ దండి రంగారావుని ఖమ్మం జిల్లా జేసీబీ ఓనర్స్,ఆపరేటర్స్ అసోసియేషన్ సభ్యులు సోమవారం ఘనంగా ఆయన నివాసం వద్ద సన్మానించారు. ఈ సందర్భంగా పూల మాలలు వేసి శాలువలతో సత్కరించారు. అనంతరం కౌన్సిలర్ మాట్లాడుతూ...పార్టీలకు అతీతంగా అసోసియేషన్‌కు ఎల్లవేళలా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జేసీబీ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు వెంపటి స్వామి, జిల్లా,వరంగల్‌క్రాస్‌రోడ్డు సమితి సభ్యుడు పుణ్యకోటి, వెంపటి వెంకటేశ్వర్లు, ధనియాకుల సుధాకర్, వెంపటి పృథ్వీ, కత్తి రాము, శ్రీశైలం బీరయ్య, సుమన్, ఆపరేటర్ సభ్యులు మహేందర్, సాయి, వినయ్, సంపత్, మహేష్, వెంకటేష్, నాగరాజు, మున్సిపాలిటీ సిపిఐ నాయకులు వెంపటి సురేందర్, వెన్నం భాస్కర్, వెంపటి శ్రీను, వెంపటి రాము, వెంపటి వీరయ్య, మిరియాల నరుణ్‌తేజ్, బుద్ధి రాధాకృష్ణ, బూరెల రాము, చింతల ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

## సిఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేత

**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:** ఏదులాపురంమున్సిపాలిటీపరిధిలోని 28, 30,32వార్డులకు చెందిన లబ్ధిదారులకు మంజూరైన రూ.79,500వందల విలువగల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను స్థానిక సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం అందజేశారు. ఈ చెక్కులు సిపిఐ పార్టీ జిల్లా కార్యదర్శి దండి సురేష్ సహకారంతో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సిఫారస్ ద్వారా లభించాయి. అందుకున్న వారిలో గోలి ఇంద్ర రూ.18,500, గోలి హర్షిని రూ.17వేలు, మామిడి అంజయ్య రూ.25వేలు, పానమాకులు ఎలిశయమ్మ రూ.19వేలు ఉన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు, 28వ వార్డ్ కౌన్సిలర్ దండి రంగారావు, సిపిఐ జిల్లా సమితి సభ్యులు వెంపటి సురేందర్, 29,28వ వార్డు సిపిఐ కార్యదర్శులు వెంపటి రాము, లగిశెట్టి రాము, సిపిఐ మున్సిపాలిటీ నాయకులు వెన్నం భాస్కర్, యోబుకుమార్, బూరెల రాము, బుద్ధి రాధాకృష్ణ, రమేష్, ఆనంద్, యువజన సంఘం నాయకులు మిరియాల నరుణ్‌తేజ్, చింతల ఉదయ్, కొక్కు రిత్విక్, సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

## వడదెబ్బ తగలకుండా ప్రజలు జాగ్రత్తలు పాటించాలి: కలెక్టర్

**ప్రజాపక్షం/ ఖమ్మంఅర్బన్ :** ఉష్ణోగ్రతలు అధికంగా నమోదు అవుతున్నందున ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని వడదెబ్బ తగలకుండా ప్రజలు అవసరమైన జాగ్రత్తలు పాటించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. వడదెబ్బ తగలకుండా ప్రజలు జాగ్రత్తలు పాటించాలని, ఎండలో బయట తిరగవద్దని అత్యవసర పరిస్థితి అయితే తప్ప ప్రజలు బయటకు రాకూడదన్నారు. చిన్నారులు, వయో వృద్ధులు ఇంటికే పరిమితం కావాలని ప్రతి రోజు సరిపడ నీటిని తీసుకోవాలన్నారు. వదులుగా ఉన్న దుస్తులు ధరించాలని బయటకు వెళ్లేటప్పుడు గొడుగు, టోపీ, కాటన్ వస్త్రాలు ధరించాలని, ద్విచక్ర వాహనాలపై సుదూర ప్రయాణాలు చేయవద్దన్నారు. సూర్యకిరణాలు శరీరంపై నేరుగా పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎండలో పనిచేసే కార్మికులు తరచూ నీటితో పాటు ఓఆర్ఎస్ ద్రావణాన్ని తీసుకోవాలని తద్వారా వడదెబ్బ నుంచి శరీరాన్ని కాపాడుకోవచ్చనని తెలిపారు. అధిక చెమట, దాహం, బలహీనత, తలతిప్పటం, కండరాలు పట్టేయటం వంటి లక్షణాలు ఉన్నచో వడదెబ్బగా భావించి సమీప ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లాలని కోరారు. వీరికి సహాయం అందే వరకు చల్లని ప్రదేశానికి తరలించాలని, చల్లని నీటితో శరీరాన్ని తుడవాలని, వీలైనంత గాలి తగిలేవిధంగా జాగ్రత్తవహించాలని కలెక్టర్ తెలిపారు.

## మినీ ప్లీనరీని విజయవంతం చేయాలి



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** ఈనెల 19న జరిగే బిఆర్ఎస్ పార్టీ మినీ ప్లీనరీని విజయవంతం చేయాలని రఘునాథపాలెం మండల బిఆర్ఎస్ అధ్యక్షులు అజ్మీర వీరునాయక్ కోరారు. సోమవారం మండల పరిధిలోని మంచుకొండ గ్రామంలో ముఖ్య పార్టీ ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వీరునాయక్ మాట్లాడుతూ ఈనెల 19న మమత ఆసుపత్రి గ్రౌండ్‌లో బిఆర్ఎస్ పార్టీ మినీ ప్లీనరీ జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ ప్లీనరీకి రఘునాథపాలెం మండలం నుంచి బిఆర్ఎస్ శ్రేణులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ వ్యక్తిగత సహాయకులు రవికిరణ్, మాజీ వైస్ ఎంపిపి గుత్తా రవి, మార్కెట్ కమిటీ మాజీ వైస్ ఛైర్మన్ పిన్ని కోటేశ్వరరావు, ఆత్మ మాజీ చైర్మన్ భూక్యా లక్ష్మణ్ నాయక్, సర్పంచ్‌లు శంకర్, రవీందర్, మూర్తి, ప్రేమ్‌కుమార్, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపిటిసిలు, నాగండ్ల భద్రయ్య, రవి, దొంతు సత్యనారాయణ, తాతా వెంకటేశ్వర్లు, చెన్నబోయిన సైదులు, సూర్యం, డేవిడ్, దానయ్య తదితరులు పాల్గొన్నారు.

# పొత్తు పాలనలో పగుళ్లు

గ్రామంలో కుంటుపడుతున్న అభివృద్ధి
పనులకు ప్రారంభ దశలోనే అంతరాయం
రెండు పార్టీల మధ్య కుదరని
పొత్తు విభేదాలు



**ప్రజాపక్షం/అన్నపురెడ్డిపల్లి:** అన్నపురెడ్డిపల్లి మండలం అబ్బుగూడెం గ్రామంలో మూడు పార్టీల పొత్తుతో ఏర్పడిన పాలకవర్గంలో అంతర్గత విభేదాలు బయటపడుతున్నాయి. మొదట అభివృద్ధి లక్ష్యాలతో ఒకటైన నాయకులు, ఇప్పుడు అధికార భాగస్వామ్యం, నిర్ణయాధికారాలపై విభేదాలతో పరస్పరం విమర్శలు చేసుకుంటున్న పరిస్థితి నెలకొంది. గ్రామ పంచాయితీ పాలనలో భాగంగా రెండు ప్రధాన రాజకీయ పార్టీలకు చెందిన సభ్యులు కలిసి పని చేయాలని నిర్ణయించుకున్నప్పటికీ, పదవుల పంపకం, నిధుల వినియోగం, అభివృద్ధి పనుల కేటాయింపుల విషయంలో ఏకాభిప్రాయం కుదరడం లేదు. ముఖ్యంగా ఉప సర్పంచ్ పదవి, అవినీతి ఆరోపణలపై వార్డు సభ్యులలో పాలక వర్గంలో ఎంపికలో ఒక పార్టీకి ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారనే ఆరోపణలు మిగతా పార్టీల నుండి వినిపిస్తున్నాయి. ఈ పరిస్థితి కారణంగా పాలకవర్గ సమావేశాలు కూడా ఉద్రిక్తంగా మారుతున్నాయి. కొన్ని సార్లు సమావేశాల మధ్యలోనే నిలిచిపోవడం, తీర్మానాలు వాయిదా పడటం వంటి పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ఫలితంగా గ్రామ అభివృద్ధి పనులు మందగిస్తున్నాయనే విమర్శలు గ్రామస్తుల నుండి వినిపిస్తున్నాయి. ఇక గ్రామ ప్రజలు మాత్రం ఈ రాజకీయ అంతర్గత పోరాటాలపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. త్రాగు నీరు, రహదారులు, పారిశుద్ధ్యం వంటి ప్రాథమిక సమస్యల పరిష్కారం కావాల్సిన సమయంలో నాయకులు పరస్పరం తగాదాలకు దిగడం సరైంది కాదని వారు అభిప్రాయపడుతున్నారు. స్థానిక పెద్దలు, మాజీ ప్రజాప్రతినిధులు పరిస్థితిని సర్దుబాటు చేయడానికి ప్రయత్నాలు ప్రారంభించినట్లు సమాచారం. మూడు పార్టీల నాయకులు మళ్లీ చర్చలకు కూర్చొని సమస్యలకు పరిష్కారం కనుగొంటేనే పాలన సజావుగా సాగుతుందని వారు సూచిస్తున్నారు. మొత్తానికి అబ్బుగూడెం గ్రామంలో పొత్తు పాలనలో ఏర్పడిన పాలకవర్గం ముందుకు సాగుతుందా లేదా అన్నది ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది. రాజకీయ చీలికలు మరింతగా పెరిగితే పాలన స్తంభించే ప్రమాదం ఉందని మూడవ పార్టీకి అవకాశం వచ్చే విధంగా ఉందని హెచ్చరిస్తున్నారు. ఇదే పరిస్థితి ఈ విధంగా కొనసాగితే ఐదేళ్ల పాలన బుగ్గిపాలు అయ్యే పరిస్థితి ఉందని గ్రామానికి కేటాయించిన నిధులను వినియోగించుకోలేకపోవడం గ్రామ అభివృద్ధిని కుంటుపడేలా చేయడం జరుగుతుందని, రాబోయే రోజులు ఈ గ్రామ రాజకీయాల దిశను నిర్ణయించనున్నాయనీ మండల ప్రజలు చర్చించుకుంటున్నారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** రోడ్డు ప్రమాదాల నివారణకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజాపాలన ప్రగతి ప్రణాళికపై సంబంధిత అధికారులతో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అదనపు కలెక్టర్లు డా॥ పి. శ్రీజ, పి. శ్రీనివాసరెడ్డి లతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఏప్రిల్ 16న మండల స్థాయిలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామసభ ల తరహాలో నిర్వహించాలని సూచించారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణాలు పరిశుభ్రంగా ఉంచాలని, శానిటేషన్‌ను నిరంతర ప్రక్రియగా కొనసాగించాలని తెలిపారు. ఉపయోగంలో లేని పాత ఫర్నీచర్, స్క్రాప్ వాహనాలను తొలగించాలని, ఫీల్డ్ సందర్శనలో ఇవి కనిపిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అరైవ్ అలైవ్ రోడ్డు భద్రత కార్యక్రమాన్ని చేపట్టాలని తెలిపారు. ఖమ్మంజిల్లాలో 30 బ్లాక్ స్పాట్‌లను గుర్తించామని అక్కడ 50 శాతం కంటే ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఈ బ్లాక్ స్పాట్‌లను యుద్ధ ప్రాతిపదికన సరి చేయాలని అలాగే కొత్తగా ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించి రక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. రాహు వీర్, పిఎం రాహుత్ పథకాలపై విస్తృత ప్రచారం నిర్వహించాలని తెలిపారు. రాహు వీర్ పథకంలో ప్రమాదంలో గాయపడిన వ్యక్తిని గోల్డెన్ అవర్‌లో ఆసుపత్రికి చేర్చిన వారికి రూ. 25వేలు బహుమతి లభిస్తుందన్నారు. పిఎం రాహుత్ పథకంలో ప్రమాద బాధితులకు ఆసుపత్రిలో లక్షన్నర వరకు క్యాష్ లెస్ చికిత్స అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఈ పథకాలపై ప్రజల్లో అవగాహన పెంచి గోల్డెన్ అవర్‌ను సమర్థవంతంగా వినియోగించి ప్రాణాలను కాపాడాలని సూచించారు. ప్రైవేటు పాఠశాలల బస్సులు, వాహనాల ఫిట్‌నెస్, డ్రైవర్ల ఆరోగ్య పరిస్థితిని తప్పనిసరిగా పరిశీలించి నివేదిక సమర్పించాలని ఆర్టీవోను ఆదేశించారు. రోడ్డు భద్రతపై గ్రామసభలను నిర్వహించాలని లారీ డ్రైవర్లు, కమర్షియల్ డ్రైవర్లకు కంటి పరీక్ష శిబిరాలను యుద్ధ ప్రాతిపదికన నిర్వహించాలని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో డిఆర్‌వో ఎ. పద్మశ్రీ, జెడ్పిసిఈవో దీక్షా రైనా, జిల్లా అధికారులు, ఇంచార్జి ఆర్టీవో జెవిన్ శ్రీనివాసరావు, ఎంవిఐలు జి. దినేష్, జి.సుమలత, ఆర్టిఏ మెంబర్ గజ్జెల్లి వెంకన్న, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాలకు మానవ తప్పిదాలే కారణం




**ప్రజాపక్షం/కొత్తగూడెం:** రోడ్డు ప్రమాదాకు మానవ తప్పిదాలే కారణమని, ఆ ప్రమాదాల నివారణకు విస్తృత ప్రచారం జరగాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. ప్రగతి ప్రణాళిక కార్యచరణలో భాగంగా ఈనెల 18 వరకు నిర్వహించనున్న అరైవ్ అలైవ్ రహదారి భద్రతా అవగాహన కార్యక్రమాల గోడపత్రికను ఆయన అవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు తగ్గించేందుకు జిల్లాలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం అవసరమన్నారు. హెల్మెట్, సీటుబెల్ట్ వినియోగం, ట్రాఫిక్ నియమాలు పాటింపు తప్పనిసరి అని సూచించారు. జిల్లా వ్యాప్తంగా గ్రామ సభలు, అవగాహన ర్యాలీలు, పాఠశాలలు, కళాశాలల్లో చైతన్య కార్యక్రమాలు, డ్రైవర్లకు శిక్షణా శిబిరాలు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రవాణా ఆధికారి వెంకట రమణతో పాటు ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పది పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్



**ప్రజాపక్షం/పాల్వంచ :** పరీక్షల నిర్వాహణలో పూర్తి పారదర్శకత పాటించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. పాల్వంచ బొల్లోరుగూడెంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న పదవ తరగతి పరీక్షా కేంద్రాన్ని సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షల నిర్వాహణ పరిశీలించారు. కల్పిస్తున్న సౌకర్యాలపై ఆరా తీశారు. పరీక్షా హాల్‌లో సరైన వెలుతురు, విద్యుత్ సరఫరా, ఫ్యాన్‌లు, తాగునీటి సదుపాయం తదితర మౌళిక వసతులు కల్పించాలన్నారు. ప్రతీ విద్యార్థికి సరైన దూరం పాటిస్తూ కూర్చునేలా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. పరీక్షా సమయాల్లో ఎటువంటి అంతరాయాలు లేకుండా అన్ని ఏర్పాట్లు సమర్థంగా ఏర్పాటు చేయాలన్నారు. ప్రశ్నా పత్రాల పంపిణి, సమాధాన పత్రాల సేకరణ, భద్ర పరిచే విధానాల వంటి పలు అంశాలను పరిశీలించారు. నిర్వాహణలో పూర్తి పారదర్శకత, రాగాద్వేషాలకు అతీతంగా నిబద్ధతతో విధులు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.

## రాపల్లి విద్యార్థికి రాష్ట్ర స్థాయి ఐదవ ర్యాంకు




**ప్రజాపక్షం/ బోనకల్ :** రాపల్లి గ్రామానికి చెందిన ఏలూరి శ్రీవాత్సవ్ సాయి ఎంఈసిలో రాష్ట్ర స్థాయిలో ఐదవ ర్యాంకు సాధించాడు. హైదరాబాద్ కుకట్‌పల్లి లోని అవినాష్ కళాశాలలో ఎంఈసి గ్రూప్ ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న శ్రీవాత్సవ్ సాయి 500 మార్కులకు 492 మార్కులు సాధించి అత్యుత్తమ ఫలితాన్ని సాధించారు. ప్రస్తుత ట్రెండ్‌కు భిన్నంగా ఇంటర్‌లో ఎంఈసి గ్రూపును ఎన్నుకున్న ఈ వాత్సవ్ తదనుగుణంగానే మంచి మార్కులు సాధించడం పట్ల పలువురు అభినందిస్తున్నారు. శ్రీ వాత్సవ్ తండ్రి శ్రీకాంత్ కాంట్రాక్టర్‌గా పని చేస్తున్నారు. శ్రీవాత్సవ్ రాష్ట్రస్థాయిలో ఐదవ ర్యాంకు సాధించి రాపల్లి గ్రామానికి మంచి పేరు తీసుకు వచ్చాడని భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని గ్రామానికి చెందిన పలువురు ఆకాంక్షిస్తూ అభినందనలు తెలియజేశారు. కళాశాల యాజమాన్యం శ్రీవాత్సవ్‌ను ప్రత్యేకంగా అభినందిస్తూ రూ. 10వేల నగదు పారితోషికాన్ని అందజేసింది.

# స్వీయ నియంత్రణ పాటించాలి



**ప్రజాపక్షం/పాల్వంచ :** ప్రతీ ఒక్కరు స్వీయ నియంత్రణ పాటించి రోడ్డు ప్రమాద నివారణకు కృషి చేయాలని జిల్లా ఎస్‌పి. బిరుదురాజు రోహిత్‌రాజు అన్నారు. పాల్వంచ పోలీసుల ఆధ్వర్యంలో స్థానిక ఎంసిబిటి ఐటిఐ కళాశాలలో ప్రజాపాలన, ప్రగతి ప్రణాళికలో భాగంగా విద్యార్థులకు అరైవ్, అలైవ్ అవగాహనా సదస్సు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాలను అరికట్టడానికి ప్రజల్లో ట్రాఫిక్ నియమాలపై ఆరు రోజుల పాటు అవగాహన కల్పించాలనే దృఢ సంకల్పంతో అరైవ్, అలైవ్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.హెల్మెట్ వినియోగం, సీటు బెల్ట్ ప్రాధాన్యత డిఫెన్సివ్‌డ్రైవింగ్ నియమాలపై విద్యార్థులకు వివరించారు. రోడ్డు భద్రతా నియమాలను పాటించటంలో స్వీయ ప్రమశిక్షణ కలిగి ఉండాలన్నారు. దీనితో రోడ్డు ప్రమాదాలను కట్టడి చేయటానికి వీలు కలుగుతుందన్నారు. రోడ్‌పై విధులు నిర్వహించే ట్రాఫిక్ పోలీసులు లేకపోయినా వాహనాలను నడిపేటపుడు నియమ నిభంధనలు ప్రతీ ఒక్కరు పాటించే విధంగా సివిక్ సెన్స్ కలిగి ఉండాలని కోరారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిభంధనలను పాటించి తమ ప్రాణ భద్రతతో పాటుగా ఇతరుల భద్రతకు భరోసా కల్పించాలని సూచించారు. డ్రంకండ్ డ్రైవ్, ర్యాష్ డ్రైవింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్, రాంగ్ రుట్ డ్రైవింగ్, సిగ్నల్ జంపింగ్, ఓవర్ లోడ్ వలన కలిగే ప్రమాదాల గురించి తెలిపారు. విద్యార్థి దశలో ప్రతీ ఒక్కరుతమ తల్లిదండ్రుల ఆశయాలకు తగ్గట్టుగా నడుచుకొంటూ ఉన్నత చదువులు చదివి ఉజ్వల భవిష్యత్‌ను పొంది సమాజానికి మార్గ దర్శకంగా మారాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాల్వంచ డిఎస్‌పి సతీష్ కుమార్, కొత్తగూడెం మునిసిపల్ కార్పోరేషన్ కమీషనర్ కే. సుజాత, ఆర్‌డిఓ వెంకటరమణ, మెడికల్ ఆఫీసర్ రాంప్రసాద్, ఎన్‌హెచ్‌ఏఐ జేఈ మొహమ్మద్ అలీ, ఎస్‌బి ఇన్స్‌పెక్టర్ శ్రీనివాస్, సిఐ.సతీష్, ఎస్ఐలు టి. నాగరాజు, జీవన్‌రాజు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జీరో మాతాశిశు మరణాలే లక్ష్యం: కలెక్టర్

**ప్రజాపక్షం/వైద్యవిభాగం:** జిల్లాలో జీరో మాతృ, శిశు మరణాలు లక్ష్యంతో ప్రణాళికాబద్ధంతో అధికారులు పనిచేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో మాతృ, శిశు మరణాలు తగ్గింపు, సంక్షేమ శాఖపై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్లు డాక్టర్ పి శ్రీజ, పి శ్రీనివాసరెడ్డిలతో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ ప్రతి ప్రసవం సురక్షితంగా జరుగుతుందనే సందేశం ప్రజలకు చేరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో జీరో మాతృ, శిశు మరణాల లక్ష్య సాధనకు అన్ని విభాగాలు సమన్వయంతో ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని అన్నారు. ప్రతి పిహెచ్‌సీ పరిధిలో హై రిస్క్ గర్భిణీలను తప్పనిసరిగా గుర్తించాలన్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ అధ్యయనాల ప్రకారం 12 నుండి 15 శాతం గర్భిణీలు హై రిస్క్ కేటగిరిలో ఉంటారని తెలిపారు. ఏ పిహెచ్‌సి హై రిస్క్ కేసులు లేవని నివేదిస్తే గుర్తింపు ప్రక్రియలో లోపాలు ఉన్నట్లేనని, అలాంటి ప్రాంతాల్లో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని ఆదేశించారు. ప్రస్తుతం ఉన్న హై రిస్క్ గర్భిణీలను ఒక్క వారం లోపు పూర్తి స్థాయిలో గుర్తించి, వారి కోసం బర్త్ ప్లానింగ్ సిద్ధం చేయాలని సూచించారు. ఆరోగ్యశాఖలో అందుబాటులో ఉన్న మానవ వనరులను సమర్థవంతంగా వినయోగించి ప్రతి పిహెచ్‌సికి అవసరమైన సిబ్బంది అందుబాటులో ఉండేలా చూడాలని తెలిపారు. ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ వారం నిర్వహించి, సున్నిత వర్గాల పిల్లల పూర్తి స్థాయి డేటా సేకరించి చేపట్టాలని ఆదేశించారు. పాఠశాలకు వెళ్లని పిల్లలు, అనాథలు, బాల కార్మికులు, సదరం కేటగిరీ పిల్లల వివరాలు సమగ్రంగా సేకరించి, అన్ని శాఖలతో సమన్వయం చేసి వారికి ప్రభుత్వ పథకాలు పూర్తి స్థాయిలో అందేలా చూడాలని తెలిపారు. పాఠశాలల్లో పోక్సో చట్టం అమలు బాధ్యతను ఉపాధ్యాయులకు అప్పగించి, బాలలపై దుర్వినియోగాన్ని గుర్తించేలా ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. పాఠశాలల్లో పిల్లల ఫిర్యాదులను స్వీకరించి పరిష్కరించే ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేయాలని, ఐసిడిఎస్, విద్యాశాఖలు ఈ అంశంపై పర్యవేక్షణ చేయాలని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆరోగ్యసమస్యలు ఉన్న పిల్లలను గుర్తించి అవసరమైన చికిత్స అందించాలనీ, అవసమైతే పెద్ద ఆసుపత్రులకు తరలించి చికిత్స అందించాలన్నారు.మాతృ, శిశు మరణాల ప్రతి ఘటనను విశ్లేషించి కారణాలను గుర్తించి పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. గ్రామ స్థాయిలో ఆశా, అంగన్‌వాడీ సిబ్బంది చురుకుగా పని చేసి గర్భిణీల ఆరోగ్యంపై నిరంతర పర్యవేక్షణ చేయాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ డి రామారావు, డిసిహెచ్ఎస్ డాక్టర్ రాజశేఖర్‌గౌడ్, డిడబ్ల్యూఓ వేల్పుల విజేత, డిసిపిఓ విష్ణువందన, విద్యాశాఖ సంబంధిత జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత

‘అరైవ్ – అలైవ్’ రోడ్డు భద్రతా ర్యాలీ




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** రోడ్డు భద్రతా ప్రతి ఒక్కరి బాధ్యత అని టిజిఎస్ ఆర్టిసి ఖమ్మం రీజినల్ మేనేజర్ ఎ. సరిరామ్ తెలిపారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఖమ్మం డిపో మేనేజర్ శివప్రసాద్ ఆధ్వర్యంలో అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా సోమవారం ఖమ్మంలో రోడ్డు భద్రతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ పాత బస్టాండ్ నుంచి ప్రారంభమై మయూరిసెంటర్, బస్ డిపో వరకు నిర్వహించారు. పాత బస్టాండ్‌లో ఈ ర్యాలీని ఖమ్మం రీజినల్ మేనేజర్ ఎ. సరిరామ్, ఆర్టీవో కార్యాలయ అధికారి దినేష్ లు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని నిర్లక్ష్యం ప్రాణ నష్టాలకు దారి తీస్తుందన్నారు. వాహనదారులు రోడ్డు నియమాలను ఖచ్చితంగా పాటించాలన్నారు. అతివేగం నివారించడంతో పాటు మద్యం సేవించి వాహనాలు నడపరాదన్నారు. తప్పనిసరిగా హెల్మెట్ ధరించడంతో పాటు సీట్ బెల్ట్ వినియోగించాలని తెలిపారు. ఈ సందర్భంగా ప్రజలకు రోడ్డు భద్రతకు సంబంధించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్టిసి అధికారులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజా వినతులను సత్వరమే పరిష్కరించాలి

ప్రజల నుంచి అర్జీలను స్వీకరించిన కలెక్టర్

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ప్రజా వినతులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి జిల్లా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అదనపు కలెక్టర్లు డా॥ పి. శ్రీజ, పి. శ్రీనివాసరెడ్డి లతో కలిసి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. కల్లూరు మండలం చంద్రుపట్లకు చెందిన ప్రజలు గ్రామంలోని హరిజనవాడ ప్రాథమిక పాఠశాలకు సంబంధించిన స్థలం ఆక్రమణకు గురైందని దానిని సంరక్షించాలని కోరుతూ దరఖాస్తు చేశారు. కూసుమంచి మండలం ముత్యాలగూడెంకు చెందిన స్వప్న తనకు మతిస్థిమితం సరిగ్గా ఉండదని సదరం సర్టిఫికెట్ ఉందని దివ్యాంగుల పెన్షన్ మంజూరు చేయాలని దరఖాస్తు చేశారు. బోనకల్ మండలం బ్రాహ్మణపల్లికి చెందిన ఎ. దేవేందర్‌రావు రిజిస్టర్డ్ విక్రయ దస్తావేజు ద్వారా రాపల్లిలో క్రయం పొందిన వ్యవసాయ భూమిని నకిలీ సాదాబైనామా ద్వారా సునీల్ పేరున మార్పిడి చేసి కొత్త పాసుపుస్తకం మంజూరు చేశారని దానిని రద్దు చేసి తన పేరుపై పట్టాపాసుపుస్తకం మంజూరు చేయాలని దరఖాస్తు చేశారు. ఆయా వినతులను పరిశీలించిన కలెక్టర్ సత్వరమే చర్యలు తీసుకోవాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌వో ఎ. పద్మశ్రీ, జెడ్పిసిఈవో దీక్షారైనా, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏవో కె. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## ఆళ్ల వెంకటరెడ్డి మృతికి తుమ్మల నివాళి



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆళ్ల అంజిరెడ్డి తండ్రి ఆళ్ల వెంకటరెడ్డి మృతిపట్ల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సంతాపం వ్యక్తం చేశారు. సోమవారం ఖమ్మం నగరంలోని ధంసలాపురంలో గల వారి స్వగృహంలో ఉంచిన వెంకటరెడ్డి పార్థీవ దేహాన్ని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సందర్శించి నివాళులర్పించారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్, మాజీ అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మేయర్ పునుకొల్లు నీరజ, పలువురు కార్పొరేటర్లు, నాయకులు తదితరులు నివాళులర్పించారు.

**బతుకమ్మ మృతికి మంత్రి తుమ్మల నివాళి :**
తెలంగాణ రాష్ట్ర పద్మశాలీల సంఘం అధ్యక్షులు, 24వ డివిజన్ కార్పొరేటర్ కమర్తపు మురళి మాతృమూర్తి కమర్తపు బతుకమ్మ మృతి పట్ల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సంతాపం వ్యక్తం చేశారు. శ్రీరాం హీల్స్‌లోని వారి స్వగృహంలో ఉంచిన బతుకమ్మ పార్థీవ దేహాన్ని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సందర్శించి నివాళులర్పించారు.

ప్రజాపక్షం
Telugu National Daily
ఖమ్మం
మంగళవారం
14-04-2026
www.prajapaksham.in

“విశ్వక్‌సేన్ హీరోగా కొత్త సినిమాఎన్‌టిఆర్ దేవరతో సెన్సేషనల్ క్రియేట్ చేసిన యువ సుధ ఆరట్స్ బ్యానర్ మరో భారీ సినిమాను రూపొందించటానికి సిద్ధమైంది. విశ్వక్‌సేన్ హీరోగా నిర్మాత సుధాకర్ మిక్కిలినేని ఈ క్రేజీ ప్రాజెక్ట్ స్టార్ట్ చేశారు.”

రీల్

# చిరు అనే యువకుడి కథ ‘చిరంజీవి’




కికు యనమల, కశిష్ ఖాన్ జంటగా నటిస్తున్న సినిమా ‘చిరంజీవి‘. ఈ చిత్రంలో తనికెళ్ల భరణి, ఈశ్వరీ రావు, గోపరాజు రమణ, శ్రీకాంత్ భరత్, వైవా రాఘవ ఇతర ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమాను, కికు ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై దీప్తి నడిమింటి నిర్మిస్తున్నారు. సాయి వెంకట్ దర్శకత్వం వహిస్తున్నారు.‘చిరంజీవి’ సినిమా వేసవి విడుదలకు సిద్ధమవుతోంది. తాజాగా ఈ చిత్ర టైటిల్ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను నాగబాబు చేతుల మీదుగా లాంఛ్ చేశారు.ఈ సందర్భంగా నాగబాబుకు చిత్ర బృందం కృతజ్ఞతలు తెలిపారు. డెక్స్ట్రోకార్డియా (కుడివైపు గుండె ఉండే అరుదైన పరిస్థితి)తో ఉండే చిరు అనే యువకుడు తన జీవితంలో ఎదురైన సంఘర్షణలను, సవాళ్లను, అరుదైన పరిస్థితిని ఎలా తట్టుకుని నిలబడ్డాడు , తను అనుకొన్నవి ఎలా సాధించాడు అనేది ఈ చిత్రంలో ఆద్యంతం ఇంట్రెస్టింగ్‌గా, ఇన్స్ పైరింగ్‌గా తెరకెక్కిస్తున్నారు దర్శకుడు సాయివెంకట్. ప్రేక్షకులను ఎంగేజ్ చేసే అన్ని ఎలిమెంట్స్‌తో సమ్మర్ రిలీజ్‌కు రాబోతోంది చిత్రం. త్వరలోనే ‘చిరంజీవి’ సినిమా రిలీజ్ డేట్ ను మేకర్స్ అనౌన్స్ చేయబోతున్నారు. ఈ చిత్రానికి డిఒపి రామకృష్ణ, మ్యూజిక్ శేఖర్ చంద్ర ,ఎడిటింగ్ ఛోటా కె.ప్రసాద్, ప్రొడ్యూసర్ దీప్తి నడిమింటి స్క్రిప్ట్, డైరెక్షన్ శుభ సాయి వెంకట్.

# సెన్సార్ పనుల్లో ఆర్‌కె దీక్ష




ఆర్ కె ఫిలిమ్స్, సిద్ధ క్రియేషన్స్ బ్యానర్‌లో డా.ప్రతాని రామకృష్ణ గౌడ్ దర్శక నిర్మాతగా డి ఎస్ రెడ్డి సమర్పణలో ఢీ, జోడి ఫేమ్ అక్సఖాన్, అలేఖ్య రెడ్డి హీరోయిన్స్‌గా, కిరణ్ హీరోగా నటిస్తున్న చిత్రం ‘ఆర్ కే దీక్ష’. ఈ చిత్రంలో తులసి, అనూష,కీర్తన, ప్రవల్లిక, రోహిత్ శర్మ ఇతర కీలక పాత్రలు పోషించారు. ‘ఆర్ కే దీక్ష’ సినిమా ప్రస్తుతం సెన్సార్ కార్యక్రమాలు జరుపుకుంటోంది. ఈ చిత్రాన్ని త్వరలోనే థియేట్రికల్ రిలీజ్‌కు తీసుకొస్తామని దర్శక నిర్మాత డా. ప్రతాని రామకృష్ణ గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్ లో హీరోయిన్ అక్సాఖాన్ మాట్లాడుతూ ఆర్‌కె దీక్ష మూవీ తరువాత ఈ మూవీ తర్వాత వీరి కాంబినేషన్‌లోనే మహిళా కబడ్డీ మూవీ చేస్తున్నాను. ఆర్ కే దీక్ష సినిమాలో నంది అనే సాంగ్ చేశాను.ఈ పాట నంది అవార్డ్స్ నేపథ్యంగా సాగుతుందని అన్నారు. నటి తులసి మాట్లాడుతూ నేను ఈ చిత్రంలో హీరోయిన్ ఫ్రెండ్ క్యారెక్టర్‌లో నటించాను. ఈ మూవీలో అక్సాఖాన్, అలేఖ్య రెడ్డి కాంబినేషన్ లో నా సీన్స్ ఉంటాయి. ‘ఆర్ కె దీక్ష‘ సినిమా పెద్ద విజయం సాధించాలని కోరుకుంటున్నా అన్నారు. సెన్సార్ పనులు జరుగుతున్నాయి.సెన్సార్ కార్యక్రమాలు పూర్తి కాకుండా రిలీజ్ డేట్ అనౌన్స్ చేయలేం కాబట్టి ఆగాం. త్వరలోనే గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు తీసుకొస్తాం. నిర్మాతగా నాకు ఇది 44వ సినిమా, దర్శకుడిగా 9వ సినిమా. ఫైట్స్ రవి మాస్టర్ అద్భుతంగా కొరియోగ్రాఫ్ చేశారు. అలాగే సాంగ్స్ లో ఒక పాట స్పెషల్‌గా మన జవాన్ల ధైర్యసాహసాలను త్యాగాన్ని చెబుతూ రూపొందించాం. ఆ పాటను మధుప్రియ పాడింది. ఈ సినిమా నిర్మాణంలో డిఎస్ రెడ్డి మాకు సపోర్ట్‌గా నిలిచారు. విలన్‌గా జమ్మూ కాశ్మీర్‌కు చెందిన రోహిత్ శర్మ నటిస్తున్నారు. ఈ చిత్రానికి సంగీతం : రాజ్ కిరణ్, ఎడిటర్ : మేఘన శ్రీను, ఫైట్స్ : రవి డాన్స్ : ఆనంద్.

# జూ.ఎన్‌టిఆర్ కొత్త మేకోవర్



జూనియర్ ఎన్‌టిఆర్, కన్నడ దర్శకుడు ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో వస్తున్న సినిమా కోసం ఎన్‌టిఆర్ కొత్తగా మేకోవర్ అవుతున్నాడు. యాక్షన్ నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ సినిమాకు ఇంకా పేరు నిర్ణయించలేదు. అయితే డ్రాగన్ అనే పేరును వర్కింగ్ టైటిల్‌గా పెట్టుకున్నారు. యాక్షన్, పొలిటికల్ థ్రిల్లర్‌గా తెరకెక్కుతున్న ఈ సినిమా కోసం ఎన్టీఆర్ ప్రతి రోజూ వ్యాయామం చేసి కొత్తగా మేకోవర్ అవుతున్నారు. ఈ సినిమా దాదాపుగా యాభై శాతం షూటింగ్ అయింది. కెజిఎఫ్, సలార్ వంటి సినిమాలను రూపొందించిన ప్రశాంత్ నీల్ కావడంతో సినిమా పై క్రేజ్ పెరిగింది. ఎన్‌టిఆర్ సరసన రుక్మిణీ వసంత్ హీరోయిన్ గా నటిస్తోంది. నందమూరి కళ్యాణ్ రామ్, వై. రవి శంకర్, నవీన్ యేర్నేని నిర్మిస్తున్నారు.

# ‘భరతవర్ష’గా గోపీచంద్



హీరో రో టి. గోపీచంద్, సంకల్ప్ రెడ్డి దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా కు పేరు ఖరారు చేశారు. శ్రీనివాస సిల్వర్ స్క్రీన్ నిర్మాత శ్రీనివాస చిట్టూరి నిర్మాణంలో, పవన్ కుమార్ సమర్పణలో రూపొందుతున్న చిత్రానికి భరతవర్ష అని నామకరణం చేశారు. ఈ చిత్ర నిర్మాతలు పవర్ ఫుల్ గ్లింప్స్ ద్వారా సినిమా టైటిల్‌ను ఆవిష్కరించారు. క్రీ.శ. 642 నేపథ్యంలో సాగే ఈ గ్లింప్స్, శూల భూమిలో ప్రారంభమై, అద్భుతమైన యాక్షన్ సన్నివేశాలతో కట్టిపడేసింది. భారీ యుద్ధ సన్నివేశాలు, యుద్ధంలో ఆరితేరిన యోధుల క్లోజప్‌లు, కత్తులు, గొడ్డళ్లు, అగ్నిజ్వాలల మధ్య జరిగే పోరాటాలు కనువిందు చేసే విజువల్ ఫీస్ట్‌ని అందించాయి. భరత భూమికి (భారతదేశానికి) ప్రతీకగా నిలిచే ‘భరత వర్ష’ టైటిల్ పెట్టినట్టు నిర్మాత చెప్పారు. యాక్షన్ సన్నివేశాలతో ఈ చిత్రం ఆకట్టుకునేలా రూపుదిద్దుకుంటోంది. హీరో గోపీచంద్ ఈ చిత్రంలో యోధుడి పాత్ర కోసం కంప్లీట్ ట్రాన్స్‌ఫర్మేషన్ అయ్యారు. ఆయన ఫిజిక్, నటన, స్క్రీన్ ప్రెజెన్స్అన్నీ కలిసి పాత్రను ఎంతో నిజాయితీగా కనిపించేలా చేశాయి. ఇది ఆయన గత చిత్రాల నుండి పూర్తిగా భిన్నమైన పాత్రగా నిలుస్తోంది. హీరోయిన్‌గా రీతూ వర్మ నటిస్తున్నారు. సినిమాటోగ్రాఫర్ సౌందర్ రాజన్ , అనుదీప్ దేవ్ అందించిన బ్యాగ్రౌండ్ స్కోర్ అందించారు. భారీ స్థాయి, నిజాయితీతో కూడిన కథనం, ఎమోషన్స్ అన్నీ కలిసిన భరత వర్ష ఒక గొప్ప చారిత్రక చిత్రంగా రూపుదిద్దుకుంటోంది. షూటింగ్ దాదాపుచివరి దశకు చేరుకోగా, పోస్ట్ ప్రొడక్షన్ వేగంగా కొనసాగుతోంది.

# మే 8న ‘గోదారి గట్టుపైన’ రిలీజ్



హీరో సుమంత్ ప్రభాస్ రూరల్ లవ్, ఫ్యామిలీ డ్రామా ‘గోదారి గట్టుపైన’తో అలరించబోతున్నారు. సుభాష్ చంద్ర దర్శకత్వంలో రెడ్ పప్పెట్ ప్రొడక్షన్స్ నిర్మించింది. నిధి ప్రదీప్ ఈ చిత్రంలో కథానాయికగా నటించగా, జగపతి బాబు కీలక పాత్రలో కనిపించనున్నారు. ‘గోదారి గట్టుపైన’ రిలీజ్ డేట్‌ని అనౌన్స్ చేశారు. మే 8న ఈ చిత్రం వరల్డ్ వైడ్ రిలీజ్ కానుంది. ఒక వైపు సుమంత్ ప్రభాస్, మరో వైపు జగపతి బాబు.. మధ్యలో నిధి ప్రదీప్ నిల్చున్న రిలీజ్ డేట్ అనౌన్స్‌మెంట్ పోస్టర్ కథపై ఆసక్తిని మరింత పెంచుతోంది. ఈ చిత్రానికి నాగ వంశీ కృష్ణ మ్యూజిక్, సినిమాటోగ్రఫీని సాయి సంతోష్, ప్రొడక్షన్ డిజైన్‌ను ప్రవాల్య, ఎడిటింగ్‌ను అనిల్ కుమార్ పి, సౌండ్ డిజైన్‌ను నాగార్జున తల్లపల్లి నిర్వహిస్తున్నారు. సుమంత్ ప్రభాస్, నిధి ప్రదీప్, జగపతి బాబు, రాజీవ్ కనకాల, లైలా, దేవి ప్రసాద్, సుదర్శన్, రాజ్ కుమార్ కసిరెడ్డి, వైవా రాఘవ్, రోహిత్ కృష్ణ వర్మ తదితరులు నటించారు. ఈ చిత్రానికి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ మధులిక సంచన లంక, డిఓపి సాయి సంతోష్ , సంగీతం నాగ వంశీ కృష్ణ, , ఎడిటర్ అనిల్ కుమార్ పి సౌండ్ డిజైనర్ నాగార్జున తాళ్లపల్లి.

## తిమ్మరాజుపల్లి టీవీలో

# ‘గోపాల గోపాల’ పాట ఆవిష్కరణ



హీరో కిరణ్ అబ్బవరం సుమైర స్టూడియోస్‌తో కలిసి తన కెఎ ప్రొడక్షన్స్‌పై నిర్మిస్తున్న సినిమా ‘తిమ్మరాజుపల్లి టీవీ’. తేజ వేల్పుచర్ల సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఈ చిత్రంతో సాయి తేజ్, వేద జలంధర్ హీరో హీరోయిన్స్‌గా పరిచయమవుతున్నారు. ‘తిమ్మరాజుపల్లి టీవీ’ చిత్రంతో వి.మునిరాజు దర్శకుడిగా పరిచయమవుతున్నారు. విలేజ్ బ్యాక్ డ్రాప్‌లో సాగే పీరియాడిక్ డ్రామాగా రూపొందుతున్న ఈ సినిమా ఈ నెల 17న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. ‘తిమ్మరాజుపల్లి టీవీ’ సినిమా నుంచి ‘గోపాల గోపాల..’ సాంగ్ రిలీజ్ చేశారు. ఈ పాటకు సనరే సాహిత్యాన్ని అందించగా, వంశీకాంత్ రేఖన కంపోజ్ చేశారు, మేఘనాయు డు పాడారు. ఈ పాట ఎలా ఉందో చూస్తే ‘గోకుల గోపాలక, మాధవ నారాయణ, కానగా సాధ్యమా, కలియుగ మాయ, గోకుల గోపాలక, మాధవ నారాయణ, కాలమే సాక్షిగా అలమిన మాయ, నీదు మాయే నీల వర్ణా , హాసమైనా శోకమైనా కాంతులే నిలుపవా కనుతడిన..’ అంటూ కలియుగంలో జరుగుతున్న వింత ఘటనల్ని ఆ గోవిందుడికి విన్నవిస్తూ పాట ఆకట్టుకునేలా ఉంది. సాయి తేజ్, వేద జలంధర్, ప్రదీప్ కొట్టె, స్వాతి కరిమిరెడ్డి, అమ్మ రమేష్, సత్యనారాయణ, లతీష్, తదితరులు నటిస్తున్నారు. ఈ చిత్రానికి ఆర్ట్ డైరెక్టర్ సుధీర్ మాచర్ల, క్రియేటివ్ ప్రొడ్యూసర్ రితికేష్ గోరక్ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ కెఎల్ మదన్డీ, ఒపి అక్షయ్ రామ్ పొదిశెట్టి, మ్యూజిక్ వంశీకాంత్ రేఖన,.

# వేతనాలు అమలు చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

వేతనాల సవరణ డిమాండ్‌ను నెరవేర్చాలని కోరుతూ ఉదయం ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా నినాదాలు చేశారు. సెక్టార్ 62, సెక్టార్ 84లలో, మదర్‌సన్ కంపెనీ యూనిట్‌తో సహా ఇలాంటి నిరసనలు జరిగినట్లు నివేదికలు వచ్చాయి. నిరసనకారులు జాతీయ రహదారి 9ని కూడా దిగ్బంధించారు. కొంతమంది నిరసనకారులు ఆస్తులను ధ్వంసం చేయడం, రాళ్లు విసరడం, వాహనాలకు నిప్పు పెట్టడంతో ఈ నిరసనలు త్వరలోనే హింసాత్మకంగా మారాయి. గౌతమ్ బుద్ధ నగర్ కమిషనరేట్ పరిధిలోని పారిశ్రామిక జోన్‌ల అంతటా తగినంత పోలీసు బందోబస్తును ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. పరిస్థితిని పర్యవేక్షించడానికి సీనియర్ పోలీసు, పరిపాలనా అధికారులు క్షేత్రస్థాయిలో నిమగ్నమై ఉన్నారు. పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి ప్రభావిత ప్రాంతాలకు భారీ పోలీసు బలగాలను పంపినట్లు వారు తెలిపారు. పరిస్థితి అదుపులో ఉందని, నిరంతరం పర్యవేక్షిస్తున్నామని, కార్మికులకు నచ్చజెప్పి, శాంతిని కాపాడటానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని, శాంతిభద్రతలను కాపాడటానికి అవసరమైన చోటల్లా కనీస బలప్రయోగం చేస్తున్నామని పోలీసులు ఒక ప్రకటనలో తెలిపారు.



వదంతులను నమ్మవద్దని అధికారులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రభావిత ప్రాంతాల్లో సాధారణ పరిస్థితిని పునరుద్ధరిస్తున్నామని హామీ ఇచ్చారు. గౌతమ్ బుద్ధ నగర్‌లోని కార్మికులకు తప్పనిసరిగా డబుల్ ఓవర్‌టైమ్ చెల్లింపు, సకాలంలో వేతనాలు సహా కార్మిక సంక్షేమాన్ని బలోపేతం చేసే లక్ష్యంతో ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం పలు చర్యలను ప్రకటించిన ఒక రోజు తర్వాత ఈ హింస చెలరేగింది. జిల్లా మేజిస్ట్రేట్ మేధా రూపమ్ ఆదివారం పారిశ్రామిక యూనిట్ల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి, కార్మికుల హక్కులను పరిరక్షించడానికి కీలక ఆదేశాలు జారీ చేశారు. తమ ఉద్యోగాలను కొనసాగించాలనుకుంటున్న కార్మికులకు ఎలాంటి అసౌకర్యం కలగకూడదని ఆమె ఆదేశించారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా యాజమాన్యాలు ఉద్యోగులతో సంప్రదింపులు జరపాలని కోరారు. కార్మికులకు ఎలాంటి కోతలు లేకుండా ప్రామాణిక రేటుకు రెట్టింపు ఓవర్‌టైమ్ చెల్లిస్తారని, అలాగే వారికి వారానికి ఒక సెలవు ఉంటుందని ఆమె ప్రకటించారు. ఆదివారాల్లో పని చేస్తే రెట్టింపు వేతనం చెల్లిస్తారని, నిబంధనల ప్రకారం బోనస్‌లు అందజేస్తారని కూడా ఆమె తెలిపారు. ఫ్యాక్టరీ గేట్ల వద్ద ఉన్న సిసిటివి కెమెరాలు పనిచేసేలా చూడాలని, కార్మికుల సమస్యలను పరిష్కరించడానికి, శాంతిభద్రతలను కాపాడటానికి ఒక కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేయాలని కూడా పరిపాలన యంత్రాంగం పారిశ్రామిక యూనిట్లను ఆదేశించింది. కాగా, సోమవారం ఢిల్లీలోని కీలక ప్రవేశ మార్గాల వెంబడి భద్రతను కట్టుదిట్టం చేశారు. పోలీసు వర్గాల సమాచారం ప్రకారం, అశాంతి వ్యాప్తి చెందకుండా నిరోధించడానికి, నోయిడాను ఢిల్లీలోని వివిధ ప్రాంతాలకు కలిపే అన్ని మోటారు వాహనాలు వెళ్లే రహదారులపై, ముఖ్యంగా ఉత్తరప్రదేశ్‌తో ఉన్న ప్రధాన సరిహద్దు పాయింట్ల వద్ద అనేక బృందాలను మోహరించారు. నిరసనల ముసుగులో ఎలాంటి సంఘ విద్రోహ శక్తులు నగరంలోకి ప్రవేశించకుండా ఉండేందుకు కట్టుదిట్టమైన నిఘా ఉంచుతున్నామని, వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నామని సీనియర్ అధికారులు తెలిపారు. కీలక సరిహద్దు పాయింట్ల వద్ద బారికేడింగ్‌ను ముమ్మరం చేశారు. ఏదైనా అవాంఛనీయ సంఘటన జరిగితే తక్షణమే స్పందించేందుకు, ర్యాపిడ్ రెస్పాన్స్ బృందాలు, పారామిలిటరీ బలగాలతో సహా అదనపు సిబ్బందిని మోహరించారు. తాము పరిస్థితిని పర్యవేక్షిస్తున్నామని, ఉత్తరప్రదేశ్ అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నామని పోలీసు అధికారులు తెలిపారు.

# కెసిఆర్ సభ

(మొదటి పేజీ తరువాయి)

కోరుతూ కాంగ్రెస్ నాయకులతో జీవన్ రెడ్డి సమవేశం నిర్వహించి మాట్లాడారు. నాలుగు దశాబ్దాల పాటు కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం పనిచేశామని విధిలేని పరిస్థితిలో పార్టీ నీ వీడాల్సి వచ్చిందన్నారు. జాతీయ స్థాయిలో బిజెపి,రాష్ట్ర స్థాయిలో కాంగ్రెస్ పాలనకు ప్రజలు విసిగిపోయి కెసిఆర్ పాలనే బాగుండే అనే చర్చ వచ్చిందన్నారు. రేవంత్ రెడ్డి పోవాలి.. కెసిఆర్ రావాలి అనే నినాదం ప్రజల్లో నుండి వచ్చిందని నేను అంటున్నది కాదన్నారు. పారిశుద్ధ్య కార్మికులకు రాష్ట్ర ప్రభు త్వం వేతనాలు ఇవ్వకపోవడంతో కేంద్రం నిధులతో గ్రామ పంచాయతీలు చెల్లిస్తున్నాయన్నారు. నాలుగు దశాబ్దాల అనుబంధాన్ని వీడాలని ఎవరు కోరుకోరని, జీవితం మొత్తం కాంగ్రెస్ పార్టీ కోసం త్యాగం చేసినట్లు గుర్తు చేశారు. అధికార పార్టీని కాదని ఆత్మ గౌరవం కోసం పార్టీని వీడుతున్నట్లు వివరించా రు. డిజిటల్‌కీ సర్పంచులకు ఇచ్చి పారిశుద్ధ్య కార్మికులకు తక్షణమే వేతనాలు ప్రభుత్వం చెల్లించాలని డిమాండ్ చేశారు. అధికారులు చట్టాన్ని అతిక్రమించి ఏకపక్షంగా వ్యవహరిస్తే చూస్తూ ఊరుకోమన్నారు. కెసిఆర్‌తో కలిసి నడవడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. సహజంగా ప్రతి పక్షంలోనున్నవారు అధికార పార్టీకి వెళ్తారు.కానీ నేను అధికార పార్టీని వీడి ప్రతిపక్షంలోకి వెళ్తున్నట్లు వివరించారు.


# లీగల్ నోటీసు


(మొదటి పేజీ తరువాయి)

కల్వకుంట్ల చంద్రశేఖర్ రావుకు రాష్ట్ర పంచాయతీ రాజ్,గ్రామీణాభివృద్ధి,మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క లీగల్ నోటీసు పంపించారు. బిఆర్‌ఎస్ అధికారిక సోషల్ మీడియా వేదికల్లో జరుగుతున్న దుష్ప్ర చారానికి ఆ పార్టీ అధినేతగా కెసిఆర్ బాధ్యత వహిస్తూ, ఈ మేరకు 48 గంటల్లో సోషల్ మీడియా పోస్టులను తొలగించి, బిఆర్‌ఎస్ , కెసిఆర్ బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేదంటే సివిల్, క్రిమినల్ చర్యలు తీసుకుంటామని ఆ లీగల్ నోటీసులో మంత్రి సీతక్క హెచ్చరించారు. మంత్రి తరపున అడ్వకేట్ నాగులూరి కృష్ణ కుమార్ రిజిస్టర్డ్ పోస్టు ద్వారా ఈ నోటీసును పంపించినట్లు మంత్రి సీతక్క సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అంగన్వాడి మొబైల్ ఫోన్ల కొనుగోలు ప్రక్రియను తెలంగాణ టెక్నాలజీ సర్వీసెస్ లిమిటెడ్ (టిజిటి) నిర్వహించిందని, టెండర్ ఎవాల్యుయేషన్ కమిటీ నిర్ణయాల ప్రకారం కాంట్రాక్ట్ కేటాయించారని, ఇందులో తమ ప్రమేయం లేదని ఆ నోటీసులో మంత్రి స్పష్టం చేశారు. తన ప్రతిష్టను దెబ్బతీసే విధంగా కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. మొత్తం టెండర్ విలువ రూ. 44.42 కోట్లు అయినప్పటికీ అందులో రూ.30 కోట్ల అవినీతి జరిగిందని ఆరోపించడం అసంబద్ధమని, ఇది పూర్తిగా ఆధారాలు లేని ఆరోపణ అని వివరించారు. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఒక్కో మొబైల్ ఫోన్‌ను రూ.11,650కే కొనుగోలు చేశామని, ఇతర రాష్ట్రాల కంటే తక్కువ ధరకు టిజిటిఎస్ ద్వారా కొనుగోలు చేశామని మంత్రి వివరించారు. అంగన్వాడి మొబైల్ ఫోన్ల కొనుగోలుకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఎక్స్‌పర్ట్ కమిటీ సూచనల మేరకే టెండర్ ప్రక్రియ పూర్తయ్యిందని మంత్రి సీతక్క తెలిపారు.












Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com